మంగళవారం
29•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 82
• పేజీలు : 16 + 20

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

జాప్యం వద్దు

కొలువుల భర్తీకి సత్వరమే వివరాలివ్వాలి

అన్ని శాఖలు టీఎస్‌పీఎస్సీకి అందజేయాలి

సీఎస్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం వేగంగా ముందడుగు వేస్తున్నప్పటికీ పలుశాఖలు క్రియాశీలకంగా వ్యవహరించని తీరుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దృష్టి సారించారు. నియామక సంస్థ అయిన టీఎస్‌పీఎస్సీకి వివరాలివ్వడంలో జాప్యంచేస్తున్న శాఖలు సత్వరమే సమగ్ర వివరాలు అందించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారని సమాచారం. త్వరలో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు సంబంధించి ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టమైన ప్రణాళికను ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలోనూ ప్రభుత్వం వేల కొలువుల భర్తీకి అనుమతులు ఇచ్చింది. వాటికి ఆర్థిక శాఖ అనుమతులూ వచ్చాయి. కానీ నియామక సంస్థ టీఎస్‌పీఎస్సీ నుంచి ఆశించిన ఉద్యోగ ప్రకటనలు వెలువడలేదు. ఈ విషయంలో జాప్యం గురించి సీఎం ఆరాతీయగా.. పలుశాఖలు సమాచారం ఇవ్వకపోవడం, అసమగ్ర వివరాలు ఇవ్వడం కారణంగా నోటిఫికేషన్లు విడుదల చేయలేదని టీఎస్‌పీఎస్సీ వివరించినట్టు తెలిసింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి మార్గదర్శకాలు, రోస్టర్లు తదితర వివరాలను సదరు శాఖలు టీఎస్‌పీఎస్సీకి అందించాల్సి ఉంది. ఈ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీనిపై సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. వివరాలు ఇవ్వడంలో తాత్సారం చేస్తున్న శాఖల నుంచి సమగ్ర సమాచారం తెప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి సూచించారని తెలిసింది.



భారత ప్రధాన న్యాయమూర్తిగా

జస్టిస్ దీపక్ మిశ్రా

ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి కోవింద్

3



డేరా బాబాకు 20 ఏండ్ల జైలు

రెండు రేప్ కేసుల్లో పదేండ్ల చొప్పున శిక్ష | 30 లక్షల రూపాయల జరిమానా

శిక్ష వినగానే కుప్పకూలిన రాంరహీం సింగ్ ■ క్షమాభిక్ష పెట్టాలని కోర్టుకు వేడుకోలు

పంజాబ్ హర్యానాల్లో హైఅలర్ట్ ■ డేరా కేంద్రాల్లో పోలీసుల సోదాలు

బాబా ఆస్తులపై అధికారుల మదింపు

> నన్ను క్షమించండి
> కొంచెం దయచూపండి
> నన్ను కాపాడేవారే లేరా?
>
> భోరుమన్న బాబా గుర్మీత్

రోహతక్, ఆగస్టు 28:

రేప్ కేసులలో డేరా సచ్చాసౌదా అధిపతి బాబా గుర్మీత్ రాంరహీం సింగ్ (50)కు సీబీఐ కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది. హర్యానాలోని రోహతక్‌లో గల సునారియా జైలులో తన ముందు హాజరుపర్చిన అపరాధి రాంరహీంసింగ్‌కు 20 ఏండ్ల శిక్షను ఖరారు చేస్తున్నట్టు సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగదీప్‌సింగ్ తీర్పును ప్రకటించారు. తీర్పు వినగానే రాంరహీం సింగ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. క్షమాభిక్ష పెట్టాలంటూ ఏడుపు అందుకున్నాడు. తన ఆశ్రమంలో ఇద్దరు సాధ్వీలపై లైంగికదాడికి పాల్పడ్డారంటూ 2002లో దాఖలైన కేసులో కోర్టు గత శుక్రవారం రాంరహీం సింగ్‌ను అపరాధిగా నిర్ధారించింది. సోమవారం సునారియా జైలు గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు గదిలో న్యాయమూర్తి శిక్షాకాలంపై తీర్పు చెప్పారు. రెండు రేప్ కేసులలో పదేండ్ల చొప్పున శిక్ష వేశారు. రెండు శిక్షలూ ఏకకాలంలో కాకుండా ఒకదాని తర్వాత మరొకటి అమలు చేయాలని ఆదేశించారు. అంటే ఈ శిక్షలు అమలైతే 20 ఏండ్లవరకు రాంరహీం సింగ్ జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం ఉండదు. దీంతోపాటుగా ఒక్కో కేసులో రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షల జరిమానా కూడా విధించారు. మొదట పదేండ్ల జైలుశిక్ష అంటూ వార్తలు వెలువడ్డాయి. తర్వాత శిక్షాకాలం 20 ఏండ్లు అంటూ సీబీఐ అధికారులతో పాటు హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వివరణ ఇచ్చారు.

కుప్పకూలిన రాంరహీం సింగ్

న్యాయమూర్తి తీర్పును వినగానే రాంరహీం సింగ్ కుప్పకూలాడు. ముఝే మాఫ్ కర్‌దో.. (నన్ను క్షమించండి) అంటూ రెండు చేతులు జోడించి కోర్టును వేడుకున్నాడు. థోడీజీ రియాయత్ (కొంచెం దయచూపండి) అంటూ చిన్నపిల్లాడిలా భోరుమన్నాడు. 'నన్ను కాపాడేవారు లేరా?' అంటూ శోకాలు పెట్టాడు. నేలమీదపడి లేవకుండా అదేపనిగా ఏడుస్తున్న రాంరహీంసింగ్‌ను జైలు సిబ్బంది రెట్టలు పట్టుకుని తీసుకుపోయారు. కోర్టు నిర్ణయం నేపథ్యంలో రాంరహీం సింగ్ అనుచరులు అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడకుండా నిరోధించేందుకు పంజాబ్, హర్యానా రాష్ట్రాలు తీవ్ర అప్రమత్తత పాటిస్తున్నాయి.

హెలికాప్టర్‌లో జైలుకు వచ్చిన న్యాయమూర్తి

శుక్రవారం రాంరహీం సింగ్‌ను అపరాధిగా ఖరారు చేసిన వెంటనే చెలరేగిన హింసాకాండలో 38 మంది

మిగతా 5వ పేజీలో





హర్యానాలోని రోహతక్‌లో డేరా బాబా గుర్మీత్ సింగ్ ఉన్న సునారియా జైలుకు సోమవారం సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగదీప్ సింగ్‌ను భద్రతా కారణాల దృష్ట్యా హెలికాప్టర్‌లో తీసుకువస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్) న్యాయమూర్తి జగదీప్ సింగ్



డోక్లాంలో కంచెకు అటూ ఇటూ..

సమసిన డోక్లాం వివాదం

బలగాల ఉపసంహరణకు భారత్, చైనా అంగీకారం

బ్రిక్స్ సమావేశానికి ముందు ఫలించిన ద్వైపాక్షిక చర్చలు

సరిహద్దుల్లో తమ గస్తీ కొనసాగుతుందన్న చైనా

రోడ్డు నిర్మాణాన్ని చైనా పక్కనబెట్టినట్లేనంటున్న విశ్లేషకులు

న్యూఢిల్లీ, ఆగస్టు 28:

భారత్ చైనా సరిహద్దుల్లో డోక్లాంపై కొనసాగుతున్న ప్రతిష్టంభన దాదాపు తొలిగిపోయింది. జూన్ 16 నుంచి రెండున్నర నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరుదేశాలు ఒక అంగీకారానికి వచ్చాయి. వివాదాస్పద ప్రాంతం నుంచి తమ బలగాలను ఉపసంహరించుకునేందుకు ఇరుదేశాలు ద్వైపాక్షిక చర్చల్లో అంగీకరించాయి. మరోవారం రోజుల్లో చైనాలో బ్రిక్స్ సమావేశాలు జరుగనుండటం, వాటి సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్ర మోదీ భేటీ కానున్న నేపథ్యంలో డోక్లాం ఉద్రిక్తతలకు ముగింపు పలుకాలని ఇరుదేశాలు నిర్ణయించినట్టు తెలుస్తున్నది. డోక్లాం ప్రతిష్టంభనపై దౌత్యపరమైన సంప్రదింపులు కొనసాగుతున్నాయని, సైన్యాన్ని క్రమంగా ఉపసంహరించుకునేందుకు భారత్‌తోపాటు చైనా కూడా అంగీకరించిందని భారత విదేశాంగశాఖ సోమవారం ప్రకటించింది. 'ఇరుదేశాల అంగీకారానికి అనుగుణంగా బలగాల ఉపసంహరణ దాదాపు పూర్తయినట్టే. తాజా పరిస్థితిని పరిశీలించాల్సి ఉన్నది' అని విదేశాంగశాఖ అధికారి తెలిపారు. అయితే సుదీర్ఘంగా సాగిన పట్టువిడుపుల తర్వాత ఒక్కసారిగా వెనుకకు తగ్గితే

మిగతా 3వ పేజీలో

ఏడు వేల చెరువులకు జలకళ

మత్తడి దుంకుతున్న 2వేలకుపైగా చెరువులు

నిండుకుండల్లా 34 శాతం నీటివనరులు

రాష్ట్రంలో చురుకుగా రుతుపవనాలు ▪ నేడు సాధారణం నుంచి భారీ వర్షాలు

రేపటి నుంచి ఐదు రోజులపాటు భారీ నుంచి అతిభారీ స్థాయిలో..

గడిచిన 24 గంటల్లో కొల్లాపూర్‌లో 6 సెం.మీ. వాన ▪ వాతావరణ కేంద్రం వెల్లడి



పొంగి పొర్లుతున్న ఘనపూర్ చెరువు | భారీ వర్షాలకు మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని ఘనపూర్ చెరువు పొంగిపొర్లుతున్నది. ఆనకట్ట పైనుంచి దుంకుతున్న నీరు నిజాంసాగర్ వైపు పరుగుపెడుతున్నది.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గత కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి బేసిన్‌లో చెరువులు జలకళలాడుతున్నాయి. దాదాపు ఏడు వేల చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. వీటిలో రెండువేలకు పైగా చెరువులు మత్తడి దుంకుతున్నాయి. ముఖ్యంగా మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యధికంగా చెరువులు అలుగుపోస్తున్నాయి. బేసిన్‌లోని మొత్తం చెరువుల్లో 34 శాతం వరకు చెరువులు నీళ్లతో కళకళలాడుతున్నాయి. మిగిలిన చెరువులకు కూడా ఇన్‌ఫ్లో భారీగానే వస్తున్నది. మొత్తం 20,814 చెరువులకుగాను 5,848 చెరువులు 25% మేరకు నిండాయి. మరో 4,336 చెరువులు 25%-50%, 3,532 చెరువులు 50%-75%, 5,074 చెరువులు 75%-100% నిండాయి. 2,024 చెరువులు మత్తడి దుంకుతున్నాయి.

జిల్లాల్లో భారీ వర్షం

సోమవారం కురిసిన భారీ వర్షాలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ జాతర గ్రౌండు

మిగతా 12వ పేజీలో

భువనగిరికి కేవీ

దేశవ్యాప్తంగా 50 కేంద్రీయ విద్యాలయాలు

ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభం ■ ఆదేశాలు జారీచేసిన కేంద్రీయ విద్యాలయ సంఘటన్

ఫలించిన ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కృషి.. ఎమ్మెల్యే పైళ్ల కృతజ్ఞతలు

న్యూఢిల్లీ/ యాదాద్రి భువనగిరి, నమస్తే తెలంగాణ:

ఎట్టకేలకు యాదాద్రి భువనగిరి జిల్లాకు కేంద్రీయ విద్యాలయం (కేవీ) మంజూరైంది. కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా మంజూరు చేసిన 50 నూతన కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటి భువనగిరిలో ఏర్పాటుచేస్తున్నట్టు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఈ ప్రభాకర్ సోమవారం జారీచేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. తాత్కాలికంగా యాదాద్రి – భువనగిరి జిల్లా బంజారాహిల్స్ (హైదరాబాద్‌లోనిది కాదు) లోని ఏఎల్‌ఎన్‌రెడ్డి స్మారక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు నిర్వహిస్తామన్నారు. నెలలోగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేసి తరగతుల బోధన ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి ఐదో తరగతి వరకు మాత్రమే నిర్వహిస్తున్నా ప్రతియేటా విద్యార్థుల అవసరాన్ని బట్టి తరగతుల సంఖ్య పెంచుతామన్నారు. కొంతకాలానికి పూర్తిస్థాయి కేంద్రీయ విద్యాలయంగా పనిచేస్తుందన్నారు. ఇక నూతన కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియ పూర్తయిందన్నారు. భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ రెండున్నరేండ్లుగా కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు

మిగతా 12వ పేజీలో





డిసెంబర్‌కల్లా కొత్త వెయ్యి నోటు!

మైసూర్, సల్‌బోని ముద్రణాలయాల్లో ప్రింటింగ్‌కు ఆర్బీఐ ఏర్పాట్లు

3

వచ్చేనెల 7 నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

16 వరకు కొనసాగనున్న ప్రక్రియ

20న సీట్ల కేటాయింపు, 25 నుంచి తరగతులు

2



శ్రీమాన్ చికిత్స కోసం సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ. 25లక్షల చెక్కును బాలుడి తల్లిదండ్రులకు అందజేస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి

మనసున్న సీఎం!

పసిబిడ్డ కాలేయ మార్పిడి చికిత్సకు రూ.25లక్షల తక్షణసాయం

పత్రికా కథనాలకు స్పందించి నిరుపేద కుటుంబానికి అండ

హైదరాబాద్/గజ్వేల్ నమస్తే తెలంగాణ: నిరుపేద కుటుంబానికి చెందిన పసిబాలుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆపద్బాంధవునిలా ఆదుకున్నారు. ఎవరూ అడుగకున్నా ఎంతో ఉదారతతో ఆ కుటుంబానికి రూ.25 లక్షల సాయం అందించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన దేవసాని హనుమాన్, మహేశ్వరి దంపతుల కుమారుడు శ్రీమాన్‌కు పుట్టుకతోనే కాలేయ వ్యాధి వచ్చింది. అతని కాలేయం చెడిపోయిందని, బతుకడం కష్టమని డాక్టర్లు చెప్పడంతో ఆ తల్లిదండ్రులు హతాశులయ్యారు. అయినా 11 నెలల తమ బిడ్డను ఎలాగైనా బతికించుకోవాలన్న కడుపుతీపితో హైదరాబాద్‌లోని నిలోఫర్‌తో సహ ఎన్నో దవాఖానలకు తిరిగారు. ముంబైలోని కేఎం దవాఖానకు సైతం వెళ్లారు. అక్కడ ఉన్నపుడే కోకిలా బెన్ దవాఖాన డాక్టర్ మహ్మద్‌రేలాను సంప్రదించారు. శ్రీమాన్‌కు కాలేయ మార్పిడి చేస్తే బతికే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు. ఇందుకు రూ.25లక్షల వరకు ఖర్చు అవుతుందని, మీరు డబ్బులు సమకూర్చుకుంటే హైదరాబాద్‌లోని గ్లోబల్ దవాఖానలో ఆపరేషన్ చేయడానికి వస్తానని చెప్పారు. దీంతో ఎంతో ఆశతో వారు శ్రీమాన్‌ను ముంబై నుంచి హైదరాబాద్‌కు తీసుకు వచ్చారు. కానీ అంతడబ్బు ఎలా సమకూర్చుకోవాలో తెలియక తమ గోసను పత్రికల వారి ముందు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు పత్రికలలో వచ్చిన కథనాలు చూసి సీఎం కేసీఆర్ చలించిపోయారు. వెంటనే సిద్ధిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.రూ.25 లక్షలు ఇస్తే ఆ పసికందు ప్రాణం నిలబడుతుందని తెలియగానే ఆ వెంటనే అంతమొత్తం మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్‌ను సోమవారం కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి హైదరాబాద్‌లోని గ్లోబల్ దవాఖానలో బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. సీఎం కేసీఆర్ దేవుడిలా తమను ఆదుకున్నారని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు.



మిషన్ భగీరథ అధ్యయనానికి నేడు మధ్యప్రదేశ్ బృందం రాక



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని మిషన్ భగీరథ ప్రాజెక్టుపై దేశంలోని పలు రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర అధికారులు తెలంగాణకు వచ్చి పనులను పరిశీలించి వెళ్లారు. తాజాగా మధ్యప్రదేశ్‌కు చెందిన జల్‌నిగమ్ మార్యాదిత్ శాఖ ఇంజినీర్ల బృందం మూడురోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాష్ట్రానికి రానున్నది. మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని సందర్శించనుంది. వారికి మిషన్ భగీరథ ప్రాజెక్టు స్వరూపం, లక్ష్యాలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. మరుసటిరోజు నుంచి బృందం క్షేత్రస్థాయి పర్యటనకు వెళుతుంది. బుధవారం మెదక్-సింగూరు సెగ్మెంట్‌లో, గురువారం మహబూబ్‌నగర్-ఎల్లూరు సెగ్మెంట్‌లో మిషన్ భగీరథ పనుల పురోగతిని అధ్యయనం చేస్తుంది.

నియోజకవర్గాల అభివృద్ధికి రూ.120 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ప్రణాళికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య ఉత్తర్వులు జారీచేశారు. ఏడాదికి ఒక్కో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి రూ.3 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. రెండో త్రైమాసికంలో భాగంగా నియోజకవర్గానికి రూ.75 లక్షల చొప్పున నిధులు విడుదలచేశారు. రూ.120 కోట్లలో జనరల్ క్యాటగిరీ కింద 90.56 కోట్లు, ఎస్సీ అభివృద్ధి కింద 18.54 కోట్లు, ఎస్టీ అభివృద్ధి కింద 10.89 కోట్లు విడుదల చేశారు.

టీఆర్‌ఎస్‌సీఎల్ బోర్డు ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ బోర్డును ఏర్పాటు చేస్తూ రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. టీఆర్‌ఎస్‌సీఎల్ బోర్డు చైర్మన్‌గా గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. డైరెక్టర్లుగా ప్రభుత్వ ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, ఎంఏయూడీ కార్యదర్శి, టీఆర్‌ఎస్‌సీఎల్ ఎండీ, హౌసింగ్ బోర్డు వైస్‌చైర్మన్, హౌసింగ్ కమిషనర్లను నియమిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.

31లోగా విద్యార్థుల ఆధార్ అప్‌లోడ్ చేయండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ నంబర్‌ను ఈ నెల 31 లోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ ఆదేశించారు. సోమవారం స్కూల్ యాజమాన్యాలతో సమావేశమైన కిషన్..ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు శిక్షణ పొందడానికి రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 15 వరకు గడువు విధించినట్టు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్య సమాచారం నమోదు చేయండి

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేయాలని గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా ఆదేశించారు. పిల్లల వైద్య విభాగంలో పనిచేస్తున్న పనాసియా సంస్థ ప్రతినిధులతో సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. గిరిజన హాస్టళ్లలో ఉంటున్న పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సమస్యల స్థాయిని బట్టి వైద్య సహాయం అందించాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఆర్ లక్ష్మణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.05 గంటలకు



సూర్యాస్తమయం: 6.28 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం సప్తమి మధ్యాహ్నం 12.39 వరకు తదుపరి అష్టమి. నక్షత్రం: అనురాధ రాత్రి 10.58 వరకు. అమృతఘడియలు: ఉదయం 11.21 నుంచి మధ్యాహ్నం 12.57 వరకు. రాహుకాలం: మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 4.55 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి ఉదయం 9.23 వరకు తిరిగి మధ్యాహ్నం 2.21 నుంచి మధ్యాహ్నం 3.10 వరకు. వర్జ్యం: మధ్యాహ్నం 12.39 నుంచి తె. 2.15 వరకు.

లోకం పోకడ



నువ్వు జైల్లో ఉంటేనే సమాజానికి సేవ చేసినట్టు నాయనా!

భూమి రికార్డుల ప్రక్షాళనకు

ఒకటి రెండు రోజుల్లో గైడ్‌లైన్స్

మొదటిదశలో వివాదంలేని వ్యవసాయ భూములు

రెండో దశలో వివాదాస్పద భూములు

రాష్ట్రవ్యాప్తంగా ములకలకాలువ విధానం

ప్రక్షాళన పూర్తికాగానే పట్టాదార్ పాసుపుస్తకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూమి రికార్డుల ప్రక్షాళనకు రెవెన్యూశాఖ సిద్ధమయ్యింది. ఇందుకు గైడ్‌లైన్స్‌ను కూడా సిద్ధంచేసింది. సంబంధిత ఫైల్‌పై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతకం చేయగానే ఒకటి రెండు రోజుల్లో మార్గదర్శకాలను విడుదలచేసే అవకాశం ఉంది. గైడ్‌లైన్స్ విడుదల తరువాత రికార్డుల ప్రక్షాళనపై అధికారులకు శిక్షణ ఇస్తారని సమాచారం.

గ్రామ రైతుల సమక్షంలోనే

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించిన విధంగా ప్రజల సమక్షంలోనే భూమి రికార్డులను ప్రక్షాళన చేయనున్నారు. రైతు సమన్వయ సంఘాలతో కో ఆర్డినేట్‌చేసుకొని పనిచేయాలని ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ఒక్కో గ్రామంలో ఇంటింటికీ తిరిగి రైతుల వాస్తవ భూముల సమాచారం తెలుసుకొని, ఆ తరువాత రైతులతో గ్రామ సభలు నిర్వహించి, సేకరించిన సమాచారాన్ని వారి ముందు ఉంచుతారు. అలా రైతుల అంగీకారంతో గ్రామాల్లో భూమి రికార్డుల ప్రక్షాళన చేపడుతారు. నల్లగొండ జిల్లా ములకలకాలువ గ్రామంలో భూమి రికార్డుల ప్రక్షాళనకు అనుసరించిన విధానాన్నే రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. భూమి రికార్డుల ప్రక్షాళన, సమగ్ర భూ సర్వే కార్యక్రమంపై సీఎం కేసీఆర్ నిర్వహించిన పలు సమీక్షా సమావేశాల్లో ములకలకాలువలో చేపట్టిన రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంపై చర్చించినట్టు తెలిసింది. ఇక్కడ చేపట్టిన కార్యక్రమంలో దాదాపు 98% భూమికి పక్కాగా రికార్డులు రూపొందించారు. 2% భూములు మాత్రమే వివాదాస్పదంగా ఉన్నాయని గుర్తించారు. ఇదే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయడానికి సిద్ధమయ్యారు. మొదటి దశలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో వివాదంలేని భూముల రికార్డులను పక్కాగా రూపొందిస్తే 90% సమస్యలు పరిష్కారం అవుతాయని, తరువాత దశలో వివాదాస్పద భూముల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు. వివాదాస్పద భూములను కూడా రైతుల సమక్షంలో పరిష్కరించాలని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి అధికారులకు ఈ దిశగా మార్గదర్శకాలివ్వనున్నారు.



రికార్డుల ప్రక్షాళనలో..

భూమి రికార్డుల ప్రక్షాళనలో అనేక సమస్యలు పరిష్కారం కానున్నాయి. ముఖ్యంగా వారసత్వ భూములు, భాగాల పంపిణీలతో కమతాల ఏకీకరణ, సర్వే నంబర్లలో ఉన్న భూమిలో ఎక్కువ తక్కువలు అన్నీ పరిష్కారమవుతాయి. ఎంతోకాలంగా ఉన్న సమస్యలు ఈ కార్యక్రమంతో పరిష్కారం కానుండడంతో దేశంలోనే ఇది మోడల్‌గా నిలువనున్నది. వాస్తవ భూమి, వాస్తవ భూయజమానులు ఎవరనేది నిక్కచ్చిగా తేలుతుంది. నల్లగొండ జిల్లా ములకలకాలువలో తరహాలో భూమి రికార్డుల ప్రక్షాళన చేపడితే ప్రతి గ్రామంలో 10 నుంచి 15 రోజుల్లో పూర్తి చేయవచ్చునన్న అభిప్రాయంతో అధికారులు ఉన్నారు. ప్రక్షాళన పూర్తికాగానే అత్యంత భద్రతా ఫీచర్లతో భూ యజమాన్య హక్కుల పత్రంతో కూడిన పట్టాదార్ పాసుపుస్తకాలను రైతులందరికీ అందజేస్తారు. ట్యాంపరింగ్ వీల్లేని, నీళ్లలో పడినా తడువని, చింపినా చిరుగని విధంగా కొత్త పాసుపుస్తకాలుంటాయి. ఈ మేరకు రకరకాల మోడళ్లను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంకులో లావాదేవీలను పాసుబుక్‌లో ఎక్కించినట్టుగానే ఈ పట్టాదార్ పాసుపుస్తకంలో కూడా భూముల లావాదేవీల వివరాలు నమోదు చేస్తారు.

సీనియారిటీని ఫైనల్ చేయండి

ఇరురాష్ట్రాల సీఎస్‌ల భేటీలో డీవోపీటీ కార్యదర్శి ఆదేశం

ఉద్యోగుల విభజన సమస్యలపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విభజన పూర్తికాని ఉద్యోగుల సీనియారిటీని ఫైనల్ చేసి, విభజించాలని హైకోర్టు ఆదేశాలు ఉన్న నేపథ్యంలో సెప్టెంబర్ 30లోగా సీనియారిటీని ఫైనల్ చేయాలని కేంద్ర ప్రభుత్వ డీవోపీటీ కార్యదర్శి, అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అజయ్‌మిట్టల్ ఏపీని ఆదేశించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ అంగీకారం తెలిపింది. ఇరు రాష్ట్రాల ఉద్యోగుల విభజనపై స్టేట్ అడ్వయిజరీ కమిటీ 23వ సమావేశం హైదరాబాద్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో 1,302 మంది ఉద్యోగుల విభజనపై ప్రధానంగా చర్చించారు. ఇందులో 62 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 683 నాన్‌క్యాడర్ ఎస్పీలు, డీఎస్పీలు, 536 మంది డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌లో 9 మంది, మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టరేట్‌లో నలుగురు, ఎస్పీ ఎఫ్‌లో ఆరుగురు, కార్మికశాఖలో ఇద్దరు ఉద్యోగులు ఉన్నారు. డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల సీనియారిటీని ఇప్పటివరకు ఫైనల్ చేయకపోవడంతో వారి విభజన ఆగింది. ఈ సమావేశంలో 9 మంది ఉద్యోగుల విభజనను పూర్తిచేశారు. ఇందులో కార్మికశాఖకు చెందిన ఇద్దరు, ఎస్పీఎఫ్‌కు చెందిన నలుగురు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌కు చెందిన ఇద్దరు, మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టరేట్‌కు చెందిన ఒక ఉద్యోగి ఉన్నారు. ఇప్పటివరకు 55,870 మంది రాష్ట్రస్థాయి ఉద్యోగుల విభజన పూర్తయింది. ఇందులో ఏపీకి 31,611, తెలంగాణకు 24,259 మందిని కేటాయించారు. సచివాలయంలో పనిచేసే 24 మంది సెక్షన్ అధికారుల అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. వాస్తవానికి వారిని తెలంగాణ రిలీవ్ చేసినా ఏపీ చేర్చుకోవడం లేదు. దీనిపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినందున రెండు రాష్ట్రాలు చర్చించుకొని సమస్యను పరిష్కరించుకోవాలని అజయ్ మిట్టల్ ఇరు రాష్ట్రాల సీఎస్‌లకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి కేంద్ర ప్రభుత్వ డీవోపీటీ కార్యదర్శి, అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అజయ్ మిట్టల్, జాయింట్ సెక్రటరీ కిమ్ బోంగ్ కిప్‌గెన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్, తెలంగాణ ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఏపీ జీఏడీ ముఖ్యకార్యదర్శి ప్రేమచంద్రారెడ్డి హాజరయ్యారు.



సోమవారం హైదరాబాద్‌లో 23వ రాష్ట్ర సలహా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రప్రభుత్వ డీవోపీటీ కార్యదర్శి అజయ్‌మిట్టల్. చిత్రంలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ఏపీ సీఎస్ దినేశ్‌కుమార్ తదితరులు కూడా ఉన్నారు.

బీజేపీతో పొత్తు ఉండదు

ఎంఐఎంతో అవకాశం ఉంది

కేంద్రంతో సఖ్యతగా ఉండి పనులు చేసుకుంటాం

టీఆర్‌ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి వెల్లడి

పాలమూరు: రాబోయే ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు బీజేపీతో పొత్తు ఉండబోదని మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎంఐఎంతో పొత్తు ఉండే అవకాశం ఉందన్నారు. మిగతా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకొనే ప్రసక్తే లేదన్నారు. పలువురు టీఆర్‌ఎస్ ఎంపీలు బీజేపీలో చేరుతున్నారంటూ కట్టుకథలతో కొన్ని పత్రికలు ప్రచారం చేస్తున్నాయని, ఇది ఎంతమాత్రం నిజం కాదన్నారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ జితేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున రాష్ట్రాభివృద్ధి కోసం వారి సహకారాన్ని తీసుకోక తప్పదన్నారు. అలాగని వారు చేసే పొరపాట్లను చూస్తూ ఊరుకునేది లేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల, ఇతర ప్రాజెక్టులతో లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించి తెలంగాణను సస్యశ్యామలం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే.. ప్రతిపక్ష పార్టీల నేతలు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి కోర్టుల్లో కేసులు వేస్తూ, ఆందోళనలు చేపడుతూ ఆటంకాలు సృష్టిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి మండిపడ్డారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉన్నదన్నారు. మూడేండ్లలోనే అందరి అంచనాలను తారుమారు చేస్తూ రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నదన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సైతం స్పష్టం చేశారన్నారు. రాష్ట్ర విభజన, జీఎస్టీ అమలు, ఇతర సమస్యలున్నా వాటన్నింటినీ అధిగమించి 20.7 శాతం వృద్ధిని సాధించి తెలంగాణ మిగతా రాష్ట్రాలకన్నా ముందంజలో నిలువడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ద్వితీయ స్థానంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ 10.6 శాతం మాత్రమే ప్రగతిని సాధించిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 75 రకాల సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తూ మూడేండ్లలో తిరుగులేని అభివృద్ధిని సాధించారని కొనియాడారు. రాష్ట్రంలోని అభివృద్ధిని చూసి, వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.25 వేల కోట్లను రుణంగా ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు వచ్చినట్టు తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి భూ సర్వే కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడ లేనివిధంగా చేపడుతామన్నారు. ఈ సర్వే పూర్తయ్యాక రైతులకు నూతన పాసు పుస్తకాలు అందించనున్నట్టు చెప్పారు. సమావేశంలో టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాద్మి శివకుమార్, నేతలు బెక్కెం జనార్దన్, కోట్ల కిశోర్‌రెడ్డి, ఇంతియాజ్ ఇసాక్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సోమవారం మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ జితేందర్‌రెడ్డి

51 మంది అధికారులకు పదోన్నతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పలు ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న 51 మంది అధికారులకు పదోన్నతి కల్పిస్తున్నట్టు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) తెలిపింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆధ్వర్యంలో సోమవారం సమావేశమైన డీపీసీ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. ఇందులో సాధారణ పరిపాలనశాఖ (పొలిటికల్) ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్‌సిన్హా, పలు ప్రభుత్వ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ఆయా శాఖ ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఇద్దరికి వ్యవసాయ శాఖలో సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్‌గా, ఐదుగురికి అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్లుగా, ఏడుగురికి డిప్యూటీ డైరెక్టర్/ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్లుగా, ఎనిమిది మందికి అకౌంట్స్ ఆఫీసర్లు/ అసిస్టెంట్ డైరెక్టర్లు / ఆర్థికశాఖలో లెక్చరర్లుగా, 15 మందికి ఎంఏయూడీ టౌన్ ప్లానింగ్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా, 11 మందికి సెక్షన్ హెడ్ (సివిల్, మెకానికల్, ఈసీఈ, ఫార్మసీ అండ్ సీసీపీ)గా, ఒక్కరికి సాంకేతిక విద్యాశాఖలో జాయింట్ డైరెక్టర్, ఇద్దరికి విద్యాశాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు.

సూక్ష్మసేద్యం పరికరాలపై జీఎస్టీ ఖరారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సూక్ష్మసేద్యం పరికరాలపై వస్తుసేవల పన్ను (జీఎస్టీ)ని గతంలో వ్యాట్ మాదిరిగానే 5 శాతం మేర రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూక్ష్మసేద్యం పరికరాలపై జీఎస్టీని 18 శాతంగా నిర్ణయించారు. గతంలో దీనిపై వ్యాట్ 5 శాతంగా ఉండేది. దీనిని గరిష్ఠంగా రూ.5వేల వరకు ప్రభుత్వమే భరించింది. పెరిగిన జీఎస్టీ నేపథ్యంలో గతంలో మాదిరిగానే 5 శాతాన్ని ప్రభుత్వం చెల్లించనున్నదని, కంపెనీలు 7 శాతం వరకు భరించేందుకు ముందుకు వచ్చినందున.. మిగిలిన 6 శాతం పన్నును రైతులు చెల్లించాల్సి ఉంటుంది.

హరితహారం మంచి ప్రయత్నం

కాలుష్య నియంత్రణపై చర్చలో రాజ్యసభ కమిటీ ప్రశంస

హైదరాబాద్‌లో ఎస్టీపీలకు రూ.4వేల కోట్లు ఇవ్వండి

కమిటీని కోరిన రాష్ట్ర అధికారులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: హరితహారం మంచి ప్రయత్నమని రాజ్యసభ కమిటీ అభినందించింది. కాలుష్య నియంత్రణపై సోమవారం హైదరాబాద్‌లో రాజ్యసభ సబార్డినేట్ లెజిస్లేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కాలుష్య నియంత్రణకు, అటవీ సంపదను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని అటవీ, పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్ కమిటీకి వివరించారు. దేశం మొత్తంలో 26% మొక్కలను తెలంగాణలోనే నాటినట్టు తెలిపారు. కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలు, చట్టంలో చేయాల్సిన మార్పులు, కొత్త విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని బీడీఎల్, ఈసీఐఎల్, ఎన్‌ఎండీసీ, సింగరేణి, హిందుస్థాన్ ఫ్లోరా కార్బన్ తదితర కంపెనీల కాలుష్యాన్ని ఎలా నియంత్రించాలనే అంశంపై కమిటీ చర్చించింది.

ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు రూ.4 వేలకోట్లు ఇవ్వండి

హైదరాబాద్‌లో కలుషిత జలాల శుద్ధి కోసం సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం రూ.4వేల కోట్లు కావాలని రాజ్యసభ కమిటీని కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్‌ఎంసీ కోరాయి. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌కు గ్రీన్‌క్యాప్‌కోసం రూ.148కోట్లు అవసరమవుతాయని నివేదించాయి. కొన్ని బడా కంపెనీలు ఈ-వ్యర్థాలను తొలిగించడానికి ఆన్‌లైన్‌లో టెండర్లను పిలుస్తున్నాయని, వివిధ రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు తరలిస్తున్నాయని, దీంతో ఎవరెవరు వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారనే విషయమై స్పష్టత లోపిస్తున్నదని కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి సత్యనారాయణరెడ్డి కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని కమిటీ పరిగణనలోకి తీసుకున్నది. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు, సీఎస్ ఎస్పీ సింగ్, అటవీశాఖ పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా, నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, సింగరేణి సీఎండీ శ్రీధర్, మినిస్ట్రీ ఆఫ్ కోల్ డిప్యూటీ సెక్రటరీ ఎస్‌కే సింగ్, ఎన్‌ఎండీసీ డైరెక్టర్ పీకే సత్పతి, టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో ఎండీ ప్రభాకర్‌రావు, ఆదాయపన్నుశాఖ డైరెక్టర్ జనరల్ నీనా నిగమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజ్యసభ కమిటీతో డీజీపీ భేటీ

పెద్దనోట్ల రద్దు తర్వాత రాష్ట్రంలో నకిలీ నోట్ల పట్టివేత, నమోదైన కేసులు తదితరాలపై చర్చించేందుకు రాష్ట్రానికి వచ్చిన రాజ్యసభ సభ్యుల కమిటీతో డీజీపీ అనురాగ్‌శర్మ మంగళవారం సమావేశం కానున్నారు.

'హరిత' లక్ష్యానికి సహకరించండి

ఎమ్మెల్యేలకు మంత్రి జోగు రామన్న లేఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'తెలంగాణకు హరిత హారం' మూడోవిడుత కార్యక్రమం లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయడానికి ఎమ్మెల్యేలు సహకరించాలని అటవీ, బీసీ సంక్షేమశాఖల మంత్రి జోగు రామన్న కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎమ్మెల్యేలకు లేఖరాశారు. మూడోవిడుత హరితహారం లక్ష్యంలో ఇప్పటికే 59% పూర్తయిందని తెలిపారు. హరితహారంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక ఆసక్తితో ఉన్నందున ప్రజాప్రతినిధులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. గ్రీన్ బ్రిగేడ్లను ఏర్పాటుచేసి ప్రజల భాగస్వామ్యంతో హరితహారంలో సంపూర్ణ లక్ష్యాన్ని సాధించాలని సీఎం ఇచ్చిన ఆదేశాలను లేఖలో ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

7 నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని బీఎడ్ కాలేజీల్లో సీట్ల భర్తీకి సెప్టెంబర్ 7నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సమావేశమైన ఎడ్‌సెట్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకొని షెడ్యూల్ విడుదలచేసింది. ఈ నెల 30న కౌన్సెలింగ్ తేదీలు ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇస్తారు. సెప్టెంబర్ 7నుంచి 13వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. సెప్టెంబర్ 9నుంచి 16 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. అదే నెల 17న వెబ్‌ఆప్షన్ ప్రక్రియలో తప్పులను సవరించుకోవచ్చు. 20న సీట్ల కేటాయిస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో 25లోపు రిపోర్టు చేయాలి. 25 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. సమావేశంలో ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దమయంతి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ టాస్క్‌ఫోర్స్ సమావేశాలు ప్రారంభం

పురపాలక, రోడ్లు భవనాల శాఖలతో కమిటీ భేటీ

వారంలో వివరాలు ఇస్తామని ఆయా శాఖల హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జాప్యాన్ని నివారించేందుకు నడుం బిగించిన టీఎస్‌పీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వ సూచనతో ముందడుగు వేసింది. కొలువుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికీ, పూర్తి వివరాలు అందించని శాఖలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేస్తున్నది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి కమిషన్ సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటుచేశారు. సోమవారం పురపాలక, రోడ్లు, భవనాలశాఖల అధికారులతో ఈ కమిటీ భేటీ అయ్యింది. టాస్క్‌ఫోర్స్ కమిటీ సమన్వయ భేటీలు సెప్టెంబర్ 2 వరకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగనున్నాయి. టాస్క్‌ఫోర్స్ కమిటీలో టీఎస్‌పీఎస్సీ సభ్యులైన సీ విఠల్, విద్యాసాగర్‌రావు, కృష్ణారెడ్డి తొలిరోజు పురపాలక, రోడ్లు, భవనాల శాఖలకు సంబంధించిన కొలువుల విషయంలో ఆయాశాఖల అధికారులతో భేటీ అయ్యారు. పురపాలకశాఖలో హెల్త్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల కొలువులకు దాదాపుగా రెండేండ్ల కిందట ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. కానీ, అసమగ్రంగా అందిన వివరాల కారణంగా టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీచేయలేదు. తాజా సమావేశంలో ఆయా ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను వారంలోగా అందించాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సూచించింది. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖలోని ఏఈ స్థాయి ఉద్యోగమైన డ్రాఫ్ట్‌మెన్ కొలువుల వివరాలపై సంబంధితశాఖ అధికారులతో సమావేశమైంది. నియామక ప్రక్రియకు అడ్డంకిగా ఉన్న వివరాలను వారంలోగా అందించాలని కోరింది. వెంటనే వివరాలు అందజేస్తామని ఆయా శాఖల అధికారులు హామీ ఇచ్చారు. సమాచారంలో అందించడంలో ఆయా శాఖలు వారానికి మించి జాప్యం చేస్తే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.



దీపక్ మిశ్రాతో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా

- ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి
- హాజరైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా(64) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఇప్పటి వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జేఎస్ ఖేహర్ పదవీకాలం పూర్తికావడంతో ఆయన స్థానంలో జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా వచ్చే ఏడాది అక్టోబర్ 2వ తేదీ వరకు సేవలందించనున్నారు. ఒడిశా హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన జస్టిస్ దీపక్ మిశ్రా 1996లో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా, పాట్నా, ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2011లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తర్వాత ఆరేండ్లపాటు పనిచేసి ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, పలువురు కేంద్రమంత్రులు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ ఆజాద్ న్యాయమూర్తులు తదితరులు హాజరయ్యారు.

సంచలనాత్మక తీర్పులు: పలు కేసుల్లో సంచలన తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టు ధర్మాసనాల్లో దీపక్‌మిశ్రా సభ్యుడిగా ఉన్నారు. వాటిల్లో కొన్ని..

- 1993 ముంబై వరుస బాంబు పేలుళ్ల కేసులో యాకూబ్ మెమన్ మరణశిక్షపై అర్ధరాత్రి విచారణ, శిక్ష విధింపు.
- నిర్భయ కేసులో నలుగురు దోషులకు మరణశిక్ష ఖరారు.
- ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలనను విధించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం విధులు నిర్వర్తించేలా తీర్పునిచ్చారు.
- సినిమా థియేటర్లలో జాతీయ గీతాన్ని తప్పనిసరిచేస్తూ తీసుకున్న నిర్ణయంలోనూ జస్టిస్ దీపక్ మిశ్రా కీలక భూమిక పోషించారు.
- తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించిన పిటిషన్లపై కూడా విచారణ జరిపారు.

జడ్ ప్లస్ భద్రత

సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్‌ల చరిత్రలోనే జడ్‌ప్లస్ భద్రత కలిగిన తొలి చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా. ముంబై వరుస బాంబు పేలుళ్ల కేసులో విధించిన మరణశిక్షపై స్టే కోసం యాకూబ్ మెమన్ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చినందుకు జస్టిస్ దీపక్ మిశ్రాకు అప్పట్లో బెదిరింపులు వచ్చాయి. దీంతో కేంద్రం ఆయనకు అప్పటి నుంచి జడ్‌ప్లస్ భద్రతను కల్పిస్తున్నది.

ప్రధాని అభినందనలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ దీపక్ మిశ్రాకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఆయన పదవీకాలం సాఫీగా, ఫలప్రదంగా సాగాలని ఆకాంక్షించారు.

పనాజీ నుంచి అసెంబ్లీకి పారికర్ ఎన్నిక

- గోవాలో మరో సీటు బీజేపీకే
- ఆప్ ఖాతాలోనే ఢిల్లీ 'భావన' సీటు
- నంద్యాలలో టీడీపీ విజయం



ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత సీఎం పారికర్

పనాజీ/ న్యూఢిల్లీ: గోవా సీఎం మనోహర్ పారికర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పనాజీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన సమీ ప కాంగ్రెస్ ప్రత్యర్థి గిరీశ్ చోడంకర్‌పై 4803 ఓట్ల తేడాతో గెలుపొందారు. తనను గెలిపించినందుకు పనాజీ ప్రజలకు పారికర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 23న గోవాలో రెండు, ఏపీలోని నంద్యాల, ఢిల్లీలోని భావన అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. అన్ని స్థానాల్లోనూ ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీలే గెలుపొందాయి. 2014 నవంబర్ నుంచి రక్షణశాఖ మంత్రిగా పనిచేసిన పారికర్.. గత మార్చిలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత గోవా సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యేందుకు పనాజీ నుంచి గెలుపొందిన బీజేపీ నేత సిద్ధార్థ్ కున్సిలియోంకర్ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మరోవైపు గత ఎన్నికల్లో గెలుపొందిన విశ్వజిత్ రాణే.. కాంగ్రెస్ పార్టీకి, వాల్పోయి ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసి, పారికర్ క్యాబినెట్‌లో చేరారు. అదేస్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ తరఫున పోటీ చేసి.. తన సమీప కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థి రాయ్ నాయక్‌పై 10,066 ఓట్ల తేడాతో రాణే గెలుపొందారు. ఇక ఢిల్లీలోని భావన స్థానం నుంచి అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) అభ్యర్థి రాంచందర్, సమీప బీజేపీ ప్రత్యర్థి వేదప్రకాశ్‌పై 24 వేల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 2015 ఎన్నికల్లో ఆప్ నుంచి గెలుపొందిన వేదప్రకాశ్, ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసి, బీజేపీ తరఫున పోటీ చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీలోని రాజౌరి స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఆప్‌పై బీజేపీ విజయం సాధించింది. ఆ ఓటమికి ఆప్ ప్రస్తుతం బదులు తీర్చుకున్నట్లయింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తన సమీప ప్రత్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి (వైసీపీ)పై 27 వేల పై చిలుకు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఐటీ 'నిఘా'

వృత్తి నిపుణులపైనా నజర్ ■ రూ.5 లక్షలు దాటితే 'ఐటీ రిటర్న్స్' తప్పనిసరి

ఈ ఏడాది ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యం రూ.9.8 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 28:

ఈ ఏడాది ప్రత్యక్ష పన్ను వసూళ్ల ద్వారా రూ.9.8 లక్షల కోట్ల ఆదాయం సంపాదించాలని ఆదాయం పన్ను శాఖ (ఐటీ) లక్ష్యం నిర్దేశించుకున్నది. తాము చేపట్టిన పన్ను పరిధి విస్తృతి చర్యలతో ఆ లక్ష్యానికి చేరుకోగలమని విశ్వాసంతో ఉన్నది. అందుకనుగుణంగా వసూళ్లు పెంచుకోవడానికి అవసరమైన వ్యూహాలన్నీ ఐటీ శాఖ రూపొందిస్తున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి అత్యధిక ఆదాయం పొందుతూ 'ఐటీ రిటర్న్స్' దాఖలు చేయని వేల మందిపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. వృద్ధులతోపాటు పలువురు ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనే రూ.5 లక్షలు, అంతకు మించి ఆదాయం పొందుతున్నా.. వాటిని 'ఐటీ రిటర్న్స్'లో కలుపడం లేదని గుర్తించామని కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) అధికారులు తెలిపారు. పన్ను వసూళ్ల పునాదిని విస్తృత స్థాయిలో విస్తరించాలన్న ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం.. వివిధ రంగాల నిపుణులపైనా దృష్టి పెట్టింది. నగదు రూపంలో ఫీజు తీసుకుంటూ విలాస జీవితం గడిపే నిపుణులు తమకు వచ్చే ఆదాయం వివరాలు సరిగ్గా వెల్లడించకపోవడం అనుచితమని సీనియర్ ఐటీ అధికారి ఒకరు తెలిపారు. భారీగా చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి వచ్చే ఆదాయం వివరాలను తమ ఐటీ రిటర్న్స్‌ల్లో చేర్చకుండా పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారని వివిధ సంస్థల నుంచి సమాచారం తమకు లభించిందని ఐటీ శాఖ చెబుతున్నది. ట్యాక్స్ డిడక్షన్ సోర్స్ (టీడీఎస్) కింద బ్యాంకుల్లో పౌరులు చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలను పరిశీలిస్తే పలు కేసుల్లో 10% పన్ను చెల్లిస్తున్నా వారు వాస్తవంగా 30% చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉదాహరణకు వైద్యులు తరుచుగా తమ వద్దకొచ్చే రోగులు.. ప్రత్యేకించి వర్షాకాలంలో చికున్‌గున్యా, డెంగ్యూ వ్యాధిగ్రస్తుల నుంచి భారీగా ఫీజులు వసూలుచేసినట్లు ఈ ఏడాది తాము జరిపిన దాడుల్లో తేలిందని ఐటీ అధికారులు చెప్తున్నారు. 'మా దృష్టంతా భారీగా పన్ను ఎగవేతకు పాల్పడుతున్న వారిపైనే' అని ఐటీ శాఖ అధికారి అన్నారు. రిటర్న్స్ ఫైల్స్ చేసిన వారిలో కోటి మంది లక్ష్యంగా పలువురికి ఎస్సెమ్మెస్‌లు పంపామని తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో వడ్డీ రూపంలో భారీగా ఆదా యం పొందుతున్నా ఐటీ రిటర్న్స్‌లో చేర్చకుండా పన్ను ఎగవేతకు పాల్పడుతున్న వారిపై దర్యాప్తు చేస్తామని ఐటీ శాఖ చెబుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19.1% వృద్ధి సాధించామని ఇటీవల కేం ద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. రీఫండ్స్ మినహాయిస్తే తొలి త్రైమాసికంలో రూ.1.90 లక్షల కోట్ల మేరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు జరిగాయని ఆర్థికశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ప్రత్యక్ష పన్ను వసూళ్ల అంచనాలు 19.5 శాతం దాటుతాయని భావిస్తున్నారు.



లక్షల మంది ఆకాంక్షలను నెరవేర్చిన జన్‌ధన్

- మూడేండ్లు పూర్తిచేసుకున్న పథకం
- పేద ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు

న్యూఢిల్లీ: లక్షల మంది ఆకాంక్షలను జన్‌ధన్ యోజనతో కేంద్రం నెరవేర్చిందని ప్రధాని మోదీ అన్నారు. ఈ పథకాన్ని ప్రారంభించి మూడేండ్లవుతున్న సందర్భంగా సోమవారం ఆయన ట్విట్టర్‌లో స్పందించారు. జన్‌ధన్‌తోపాటు ముద్రా యోజన, స్టాండప్ ఇండియా వంటి పథకాలూ ప్రజల సామాజిక భద్రతకు భరోసా ఇచ్చాయన్నారు. పేద ప్రజల జీవితాల్లో గుణాత్మక, పరివర్తనపూర్వక మార్పుకోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అపారమైన శక్తితో కొనసాగుతున్నదన్నారు. 'నేటితో జన్‌ధన్ యోజన మూడేండ్లయిన సందర్భంగా కోట్ల మంది ప్రజలకు.. ప్రత్యేకంగా దీని ద్వారా లబ్ధి పొందిన పేదలకు నా శుభాకాంక్షలు. పేదల కోసం విప్లవాత్మకమైన జన్‌ధన్ పథకాన్ని తేవడం చారిత్రాత్మక నిర్ణయం. అట్టడుగు వర్గాల ప్రజలను ప్రధాన ఆర్థిక స్రవంతితో ఈ పథకం అనుసంధానం చేసింది. కొత్తగా 30 కోట్ల కుటుంబాలు ఈ ఖాతాలను పొందగా, వాటిలో రూ.65వేల కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. మూడేండ్లలో సమాజంలో చిట్టచివరి వ్యక్తి కూడా ప్రధాన స్రవంతితో అనుసంధానం కావడం గొప్ప విషయం' అని అన్నారు.

సైన్యం పొగ బాంబులు చోరీ

రహస్య సమాచారం లీక్‌పై పోలీసుల దర్యాప్తు

ఝాన్సీ: భారత సైన్యానికి చెందిన పొగ బాంబులు చోరీకి గురయ్యాయి. మహారాష్ట్రలోని పుల్గావ్ నుంచి పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు ప్రత్యేక రైలులో వాటిని తరలిస్తుండగా ఈ ఘటన జరిగిం ది. ఈ రైలును ఆదివారం ఝాన్సీ రైల్వేస్టేషన్ దాటాక కాసేపు ఆపారు. తర్వాత ఓ జవాన్ బోగీలను పరిశీలిస్తుండగా ఓ బోగీ తాళం తీసి ఉంది. బోగీలోకి వెళ్లి చూస్తే పొగ బాంబుల అట్టపెట్టె కనిపించ లేదు. వెంటనే విషయాన్ని రైల్వే పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల ఝాన్సీ కలెక్టరేట్ క్లర్క్‌ను ఉత్తరప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఆర్మీ రహస్య సమాచారాన్ని పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్లకు చేరవేస్తున్నట్లు అతడిపై ఆరోపణలు రావడంతో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం చోరీకి గురైన పొగ బాంబుల సమాచారాన్ని అతడే చేరవేశాడా ? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డిసెంబర్‌కల్లా కొత్త వెయ్యి నోటు!

మైసూరు, సల్బోని ప్రెస్‌లలో ప్రింటింగ్‌కు ఆర్బీఐ ఏర్పాట్లు

న్యూఢిల్లీ: ఇటీవల రూ.200 నోటును మార్కెట్లోకి విడుదల చేసిన భారతీయ రిజర్వ్‌బ్యాంక్ (ఆర్బీఐ) కొత్తగా రూ.1000 నోటు తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. గత ఏడాది పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రధాని మోదీ ప్రకటించడంతో రూ.1000 నోట్లు చెల్లకుండాపోయిన విషయం తెలిసిందే. నూతన డిజైన్‌తో, సరికొత్త సెక్యూరిటీ ఫీచర్లతో రూ.1000 నోట్లను డిసెంబర్‌కల్లా మార్కెట్‌లోకి తేవాలని ఆర్బీఐ భావిస్తున్నది. నోట్లరద్దు తర్వాత తక్షణ మార్కెట్ అవసరాలకు రూ.2000, రూ.500 నోట్లను తెచ్చింది. ఈ నోట్ల మధ్య తేడా అధికంగా ఉండడంతో రూ.1000నోటు అవసరం ఏర్పడింది. ఇప్పటివరకు అధికారికంగా ప్రభుత్వం ఎక్కడా రూ.1000 నోటు తెస్తున్నట్లు ప్రకటించలేదు. కానీ నోట్ల రద్దు తర్వాత మార్కెట్‌లో నగదు కొరతపై అందిన పలు నివేదికల్లో రూ.1000 నోటు తేవాలన్న ప్రతిపాదన వచ్చింది. ఈనేపథ్యంలో ఆర్బీఐ రూ.1000 నోటును తెచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తున్నది. మైసూరు (కర్ణాటక), సల్బోని(పశ్చిమబెంగాల్)లోని ప్రింటింగ్ ప్రెస్‌లలో రూ.1000 నోట్ల ముద్రణకు ఏర్పాట్లు చేస్తున్నదని సమాచారం. ఆర్బీఐ గత వారం చెలామణీ లోకి తెచ్చిన రూ.200 నోటు ప్రజలకు పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. రూ.100, రూ.500 మధ్య తేడా ఎక్కువగా ఉండడంతో ఆ ఖాళీని రూ.200 నోటు భర్తీ చేస్తున్నది. ఏటీఎంలలో ఈ నోట్లు లభించడానికి సమయం పట్టొచ్చని తెలుస్తున్నది. కొత్త నోట్లు వస్తున్నా, రూ.2000 నోట్లను రద్దు చేయబోమని ఆర్థికశాఖమంత్రి జైట్లీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.



సమసిన డోక్లాం వివాదం



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ (ఫైల్)

మొదటిపేజీ తరువాయి...

బాగుండదనుకున్న చైనా పైపైన మాత్రం బింకాన్ని ప్రదర్శిస్తున్నది. వివాదాస్పద స్థలంలో భారత దళాలు వెనక్కి వెళ్లాయని మాత్రమే చెప్తున్న చైనా తన బలగాల ఉపసంహరణ గురించి ప్రస్తావించడంలేదు.

డోక్లాంలో భారత్, చైనా తమ సైన్యాన్ని ఉపసంహరించే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ముగిస్తాయని భారత విదేశాంగ శాఖ ప్రకటించిన కొద్ది గంటల్లోనే చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ బీజింగ్‌లో మీడియాతో మాట్లాడారు. తాము కూడా బలగాలను ఉపసంహరిస్తున్నామని ఎక్కడా స్పష్టంచేయకపోయినా, ఉపసంహరించబోమని కూడా ప్రకటించలేదు. 'ఈనెల 28వ తేదీ(సోమవారం) మధ్యాహ్నం భారత్ తన చొరబాటు బలగాలను, సైనిక సంపత్తిని డోక్లాం నుంచి ఉపసంహరించుకుంది. చైనా బలగాలు మాత్రం దేశ సార్వభౌమాధికార, ప్రాదేశిక సమగ్రతకు సంబంధించి చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రాంతంలో మరింత పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాయి' అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ తెలిపారు. తమ బలగాలు డోక్లాంలో గస్తీని కొనసాగిస్తున్నాయని చెప్పారు. చారిత్రక ఒప్పందాల ప్రకారం చైనా తన సార్వభౌమాధికారాన్ని యథాతథంగా కొనసాగిస్తూ, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకుంటుందని స్పష్టంచేశారు. భారత్, చైనా మధ్య అంగీకారమేదైనా కుదిరిందా అన్న ప్రశ్నకు హువా చున్యింగ్ సమాధానమివ్వలేదు. అయితే పరిస్థితులకు తగ్గట్టుగా తగిన మార్పులు, సర్దుబాట్లు చేసుకుంటామని ఆమె వ్యాఖ్యానించారు. అయితే ఆ సర్దుబాట్లు ఏంటనేది మాత్రం హువా చున్యింగ్ వెల్లడించలేదు. దీనిని బట్టి డోక్లాం నుంచి బలగాలను ఉపసంహరించుకుని యథాతథ స్థితిని కొనసాగించాలన్న భారత్ ప్రతిపాదనకు చైనా అంగీకరించినట్లు తెలుస్తున్నది. దీనికితోడు అక్కడ చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేసేందుకే చైనా నిర్ణయించుకున్నట్లు సమాచారం. వివాదాస్పద స్థలం నుంచి తన బుల్డోజర్లను చైనా వెనక్కి రప్పించిందని, టెంట్లు తొలగించిందని భారత విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి. డోక్లాంలో ఉన్న 1700-1800 సైనికులు వెనక్కి వెళ్లారని తెలిపింది.

బ్రిక్స్ సమావేశానికి సిద్ధంగా..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనా పర్యటన నేపథ్యంలో డోక్లాం వివాదానికి తెరదించేందుకు ప్రయత్నిస్తున్నట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీవరకు చైనాలోని జియామెన్‌లో జరిగే బ్రిక్స్ దేశాల సమావేశాలకు మోదీ హాజరుకానున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోనూ ఆయన చర్చలు జరుపనున్నారు. బ్రిక్స్ సమావేశాలకు ముందే ఒక అంగీకారానికి రావడం ఇరుదేశాలకు అత్యవసరమని జాతీయ భద్రతా మాజీ సలహాదారు శివ్‌శంకర్ మీనన్ తెలిపారు. ఈ పరిణామాలపై 'సెంటర్ ఫర్ చైనా అనాలిసిస్ అండ్ స్ట్రాటజీ' అధ్యక్షుడు జయదేవ్ రణడే స్పందిస్తూ.. 'రెండుదేశాలు ద్వైపాక్షిక అంగీకారంతో బలగాలు ఉపసంహరించుకుంటే రోడ్డు నిర్మాణం నుంచి చైనా సంపూర్ణంగా తప్పుకున్నట్లుగానే భావించాల్సి ఉంటుందని చెప్పారు.

ఉద్రిక్తతలు చల్లార్చే చర్యల్ని స్వాగతిస్తున్నాం : సీపీఎం

డోక్లాంలో ఉద్రిక్తతల్ని చల్లార్చే దిశగా భారత్, చైనా దేశాలు తీసుకుంటున్న చర్యల్ని స్వాగతిస్తున్నామని సీపీఎం ప్రకటించింది. డోక్లాం నుంచి ఇరుపక్షాలు తమ సైన్యాన్ని ఉపసహరించుకోవడం సంతోషకరమని, ప్రభుత్వం కూడా ఇరుగుపొరుగు దేశాలతో స్నేహ బంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

చౌక ఇండ్లకు ప్రభుత్వ సంస్థల మిగులు భూములు

విధానాన్ని రూపొందిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన మిగులు భూములను చౌక ఇండ్ల ప్రాజెక్టుల అభివృద్ధి కోసం వినియోగించుకునేందుకు కేంద్రం ఒక విధానాన్ని రూపొందిస్తున్నది. నారెడ్కో 'రియాల్టీ' సదస్సులో కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలశాఖ కార్యదర్శి దుర్గా శంకర్ మిశ్రా మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. ఈ విషయమై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా బలహీన వర్గాల వారికి దేశవ్యాప్తంగా 1.2 కోట్ల ఇండ్ల కొరత ఉన్నదని ఆయన చెప్పారు. మహారాష్ట్రలో విజయవంతమైన మోడల్‌ను పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్తంగా మురికి వాడల పునః అభివృద్ధి విధానం అవలంబించాల్సిన అవసరం ఉన్నదన్నారు. రియాల్టీ ప్రాజెక్టుల నిర్మాణంలో గడువు తగ్గించుకునేందుకు అత్యాధునిక టెక్నాలజీని అమలులోకి తేవాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఆన్‌లైన్‌లోనే భవన నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దుర్గా శంకర్ మిశ్రా తెలిపారు. అంతకుముందు నారెడ్కో చైర్మన్ రాజీవ్ తల్వార్ మాట్లాడుతూ చౌక ఇండ్ల ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వ రంగ సంస్థల వద్ద అందుబాటులో ఉన్న భూమిని వినియోగంలోకి తేవాలని కేంద్రాన్ని కోరారు.



బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా నితీశ్ బీహార్ ప్రజలను మోసం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీహార్ ప్రజలు నితీశ్‌కు, బీజేపీకి బుద్ధి చెబుతారు. బీహార్‌ను ఆర్జేడీ మాత్రమే పాలిస్తుంది. నేను లాలూను నమ్ముతాను. ఎందుకంటే, ఆయన ఏది చెబుతారో అదే చేస్తారు.

మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

పనాజీ, వాల్పాయి ఉప ఎన్నికల ఫలితాలు ఊహించినవే. మా ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నది. కాంగ్రెస్ నుంచి మరికొంత మంది ఎమ్మెల్యేలు రావాలని మేం కోరుకోవడం లేదు. ఆరవసారి నాపట్ల నమ్మకం ఉంచిన ప్రజలకు కృతజ్ఞతలు.

మనోహర్ పారికర్, గోవా ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు



1825

బ్రెజిల్ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన పోర్చుగల్.

1831

మొదటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రదర్శించిన మైకెల్ ఫెరడే.





1842

నాన్‌కింగ్ ఒప్పందంపై చైనా, బ్రిటన్ సంతకం. మొదటి నల్లమందు యుద్ధం ముగింపు.

నేపాల్‌తో సంబంధాల విషయంలో భారత్‌కు సందర్భానుసారం అనేక, పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు ఉన్నాయి. ఈ దేశం మళ్లా అంతర్యుద్ధంలో కూరుకుపోకుండా చూడటం అనేది ఒకటి. నేపాల్ రాజ్యాంగం శాశ్వతంగా మధేసీలకు వ్యతిరేకంగా ఉండకుండా చూడటం ప్రస్తుత లక్ష్యం. ఇందులో భాగంగా స్థిరమైన ప్రభుత్వం ఉండేలా అనేక రాజకీయ శక్తులను ఒప్పించాల్సి ఉంటుంది. నేపాల్ ఆర్థికాభివృద్ధికి భారత్ తోడ్పడే విధంగా, అక్కడ మౌలిక వసతులు అభివృద్ధి చెందేలా చూడాలె. అన్నిటికి మించి నేపాల్‌ను పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరంగా ఉపయోగించుకోకుండా, ఆ దేశాన్ని చైనా ప్రభావితం చేయకుండా చూడాలె.

హిందుస్థాన్ టైమ్స్

డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచార సభలో అఫ్ఘానిస్థాన్ విధానాన్ని విమర్శించారు. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికా ప్రాణాలను, ధనాన్ని పణంగా పెడుతున్నదని అన్నారు. ఒబామా విధానం పరమ చెత్త అన్నారు. కానీ ఇప్పుడు మొత్తం ఉల్టా పల్టా అయింది. ట్రంప్ అధికారానికి రాగానే అఫ్ఘానిస్థాన్‌కు మరిన్ని సైనిక దళాలను పంపించారు. గెలిచే వరకు యుద్ధం సాగుతుందని ప్రకటించారు. ఇంతకూ నాడు ట్రంప్ చెప్పింది ఉత్తమమైన విధానమా? ఇప్పుడు చేస్తున్నదా?

ది గార్డియన్

డేరా ఇష్టారాజ్యం

ఇద్దరు మహిళలపై లైంగిక అత్యాచారానికి పాల్పడిన డేరా సచా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఒక్కో కేసులో పదేండ్ల కారాగారం విధించడం వల్ల దేశంలో న్యాయం, ధర్మం ఉన్నాయనే భరోసా ప్రజలకు కలిగించినట్టయింది. అయినప్పటికీ ఆధ్యాత్మిక గురువుగా చలామణి అవుతున్న రామ్ రహీం సింగ్ పట్ల మెతకగా వ్యవహరించిన తీరు హర్యానాలోని బీజేపీ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసింది. దేశంలో చట్టబద్ధ పాలన సాగుతున్నదా అనే అనుమానాలకు తావిచ్చింది. హర్యానా ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో దోషిని చట్టం ముందు నిలబెడుతూనే, పరోక్షంగా ఆయనకు, ఆయన అనుచరగణాలకు సహకరించిన తీరు ఆక్షేపణీయంగా ఉన్నది. లైంగిక అత్యాచార కేసులో నిందితునిగా ఉన్న రామ్ రహీం సింగ్ న్యాయస్థానానికి రెండు వందల వాహనాల బారుతో తరలివచ్చాడు. ఆయన దోషిగా నిర్ధారణ అయితే ఆయన అనుచరులు హింసకు పాల్పడుతారనేది తెలిసిన విషయమే. అయినా లక్షకు పైగా జనాలు హర్యానాలోని పంచ్‌కులాకు చేరడం ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తే తప్ప సాధ్యం కాదు. న్యాయస్థానం తీర్పు వెలువడిన తరువాత డేరా అనుచరులు పెద్ద ఎత్తున హింసా విధ్వంసాలకు పాల్పడుతూ ఉంటే, పోలీసులు అడ్డుకోకుండా పై నుంచి ఆదేశాల కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ డేరా ప్రాబల్యం పంజాబ్‌లో ఇంకా ఎక్కువగానే ఉన్నది. అయినా పంజాబ్ ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడగలిగింది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం కూడా అల్లర్ల నిరోధానికి సత్వర చర్యలు తీసుకున్నది. కానీ హర్యానాలో మాత్రం ప్రభుత్వమంటూ ఉన్నదా అనే సందేహం తలెత్తింది. రామ్‌రహీంసింగ్ దోషిగా నిర్ధారణ అయిన తరువాత కూడా ఆయనను బీజేపీ పెద్దలు కీర్తించడం ఆశ్చర్యకరం.

రాజకీయ పెద్దలు డేరా మద్దతుతో ఓట్లు పొందుతున్నారే తప్ప, డేరా ప్రాతినిధ్యం వహిస్తున్న అట్టడుగువర్గాల అభ్యున్నతికి పాటుపడటం లేదు. డేరా నాయకత్వం సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు సమర్థనీయం కాదు. కానీ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు డేరా ప్రాబల్యానికి మూల కారణాలను గుర్తించాలె. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సామాజిక పరివర్తనకు కృషిచేయడం తమ బాధ్యతగా భావించాలె.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరి విశ్వాసాలు వారికి ఉంటాయి. ప్రజల విశ్వాసాన్ని చూరగొని చలామణి అవుతున్న గురూజీలు, బాబాలు, స్వామీజీలు అందరూ నిజంగా గొప్పవారని కాదు. ప్రజలను తప్పుదోవ పట్టించి, తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారూ ఉన్నారు. అయినప్పటికీ వీరు నేరాలకు పాల్పడితే చట్టం ముందు నిలబెట్టడం తప్ప, ప్రజల విశ్వాసాలను తప్పుపట్టడం మాత్రం కుదరదు. భక్తి సంప్రదాయం కొనసాగింపుగా పంజాబ్‌లో చారిత్రకంగా డేరాలకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. ఆధ్యాత్మిక గురువులుగా చలామణి అవుతున్న వారు నెలకొల్పిన చిన్నా పెద్దా డేరాలు పంజాబ్‌లో తొమ్మిది వేల వరకు ఉన్నాయి. కానీ డేరా సచా సౌదా వీటిలో అతి పెద్దది. హర్యానా కేంద్రంగా ఏర్పడిన ఈ డేరా పంజాబ్‌కు కూడా విస్తరించింది. ఈ రెండు రాష్ట్రాలలో బలమైన పునాదులు కలిగి ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో కూడా భక్తులను ఆకర్షించగలిగింది. ఈ డేరా మద్దతు కోసం రాజకీయ పక్షాలు పాకులాడటం మొదలుకావడంతో దీని అధిపతి రామ్‌రహీం సింగ్‌కు ఎదురులేకుండా పోయింది. గత ఎన్నికలలో ఈ డేరా బీజేపీకి మద్దతు ప్రకటించింది. కానీ ఈ డేరాకు ఉన్న ప్రాబల్యం దృష్ట్యా బీజేపీ పెద్దలు వీరి కార్యకలాపాల పట్ల చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. రాజకీయ మద్దతుతో డేరా అనుచరులు ఎంతగా పేట్రేగిపోతున్నారో గత నాలుగైదు రోజుల ఘటనలను బట్టి తెలుస్తున్నది. శాంతి భద్రతలు అదుపు తప్పుతాయనే భయంతో, దోషిని బంధించిన జైలు ప్రాంగణంలోనే తాత్కాలిక న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసి, న్యాయమూర్తిని అక్కడికి తరలించి తీర్పు ఇవ్వవలసి వచ్చింది. జైలు చుట్టూ అంచెలంచెలుగా రెండు వేల మందికి పైగా సైనికులు కాపలా కాస్తున్నారు. మత విశ్వాసాల పేరిట హింసకు పాల్పడితే సహించబోమని ప్రధాని మోదీ అంటున్నారు. కానీ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని దేశవ్యాప్తంగా ఘటనలను బట్టి తెలిసిపోతున్నది.

పదిహేనవ శతాబ్ది భక్తి కవి రవిదాస్ స్ఫూర్తి, 1920 దశకంలో మొగ్గ తొడిగిన ఆది ధర్మి ఉద్యమం, దళితుల ఆత్మగౌరవ పోరాటం వేసిన పునాదులు డేరా సచా సౌదా పంజాబ్‌లో విస్తరించడానికి దోహదపడ్డాయి. జాట్‌లకు పట్టుగొమ్మ అయిన మాల్వా ప్రాంతంలో దళితులు సమీకృతం కావడానికి ఈ డేరా వేదికగా మారింది. గుర్మీత్ రామ్‌రహీం సింగ్ నిజాయితీ, ఈ డేరాలో సాగుతున్న కార్యకలాపాలు అనుమానాస్పదం కావచ్చు. కానీ ఈ డేరా దళితుల అభిమానాన్ని ఇంతగా చూరగొనడానికి గల కారణాలను అధ్యయనం చేయాలె. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా చాలా రాష్ట్రాలలో ఆధిపత్య పోకడలు పోలేదు. పంజాబ్ కూడా ఈ సామాజిక వ్యత్యాసాలకు, అణచివేతకు అతీతంగా లేదు. రాజకీయ వ్యవస్థ పరిధిలో ఇందుకు పరిష్కారం లభించలేదు. దీంతో దళితులు ఈ డేరా నీడలో తమ అస్తిత్వాన్ని వ్యక్తీకరించుకోవడం మొదలైంది. రామ్‌రహీం సింగ్ వ్యక్తిత్వం ఎటువంటిదైనప్పటికీ, ఆయన నియమబద్ధ జీవనాన్ని, నైతిక విలువలను ప్రబోధించడం అట్టడుగు వర్గాలను ఆకర్షించింది. వారికి సామాజిక సంబంధాలు నెలకొల్పుకునే ఆశ్రమంగా మారింది. రాజకీయ పెద్దలు డేరా మద్దతుతో ఓట్లు పొందుతున్నారే తప్ప, డేరా ప్రాతినిధ్యం వహిస్తున్న అట్టడుగువర్గాల అభ్యున్నతికి పాటుపడటం లేదు. డేరా నాయకత్వం సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు సమర్థనీయం కాదు. కానీ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు డేరా ప్రాబల్యానికి మూల కారణాలను గుర్తించాలె. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సామాజిక పరివర్తనకు కృషిచేయడం తమ బాధ్యతగా భావించాలె.

జనగళం

అస్తమించని కవి

బచ్చేదానిల ఉన్నప్పుడే నాకు
మాతృమూర్తి అక్షర పలుకులు
నేర్పిస్తూ నాన్నతో పలికించింది
అక్షరాలకే అక్షరం వంటివాడని
నన్ను అందుకే అంటారేమో వీడు
నశించనోడని..

నవమాసాలు నిండాక అమ్మ చేతుల
స్వర్గంలో పడిన వెంబడే అందరి కళ్ళలో
నీళ్ళు పారాయి అందరి బాధల్ని
పోగొట్టే మారాజు వచ్చిండని..

కాలనదిలో పయనిస్తున్నపుడు కొన్ని
దుర్భర జీవితాలు, మరికొన్ని నిస్సహాయ
జీవులు దర్శనమిస్తుంటే,కాలనదికి
ఎదురు తిరుగాలని కలం పట్టిన
పుణ్య జీవితడు..

అన్నపు రాశులొక చోట
ఆకలి మంటలొక చోట
అలిసిన దేహాలొక చోట
హంస తూలికలొక చోట యని
కల గళం విప్పి నానా గొడవ
చేసిన కవితామూర్తితడు..

జనుల నాడిని బట్టి కష్టాలు
ఎరిగిన కార్మిక జనుల కవితడు
కలాయుధాన్ని ధరించి కాలాన్నే
ప్రశ్నించిన పృచ్ఛకుడితడు..

కలమే వరమని కలాన్ని పూజించిన
కష్టజీవుల దయార్ద్ర సేవకుడితడు
కవితా క్షేత్రంలో అక్షర కవితల్ని
పండించిన నిత్యకవి హాలికుడితడు

- ఘనపురం సుదర్శన్, 9000470542

(నేడు తెలుగు భాషా దినోత్సవం)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



మిహిర్ స్వరూప్ శర్మ

పట్టు విడుపుల ఫలితం

డోక్లాంలో ఏమి జరిగి ఉంటుంది? ఇది చైనాపై భారత్ సాధించిన ప్రఖ్యాత విజయమా? లేదా అందుకు విరుద్ధమా? నిర్మోహమాటంగా చెప్పాలంటే, మనకు ఇంకా ఆ విషయం తెలువదు. అయితే ఇది గెలుపు ఓటముల గురించి మాట్లాడుకోవలసిన విషయం కాదు. ఇది దౌత్యమే తప్ప యుద్ధం కాదు. ఇరు పక్షాలలో ఆవేశపడకుండా నిదానంగా ఆలోచించేవారి మాట చెల్లింది.

మనకు పూర్తి వివరాలు తెలువని ఈ విషయంలోకి లోతుగా వెళ్ళే ముందు, దీనిని విదేశాంగ విధానం కోణంలో ఆలోచిద్దాం! భారత్, చైనా మధ్య ఒప్పందం ప్రధాన అంశాలు మనకు ఇప్పుడిప్పుడే తెలువకపోవచ్చు. కానీ రెండు దేశాలు శాంతియుతంగా వివాదాన్ని పరిష్కరించుకోవడం మాత్రం సంప్రదాయేతర విధానంపై, సంప్రదాయ దౌత్య విధానం సాధించిన విజయమని చెప్పుకోవచ్చు. రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా, డోక్లామ్ వివాదం తీవ్రం కాకుండా జాగ్రత్త పడినందుకు విదేశాంగ మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులను అభినందించవలసిందే. త్వరలో మోదీ- జీ సమావేశంలో ఏదో జరుగబోతున్నదని ప్రచారం సాగింది. కానీ అదేమీ లేదని ఇప్పుడే తెలిసిపోయింది. అజిత్ దోవల్ బీజింగ్ పర్యటన కూడా భారీ మార్పు తెస్తుందని ప్రచారం సాగింది. కానీ ఈ ప్రచారాలకు భిన్నంగా తెరవెనుక సంప్రదాయ దౌత్యం పక్కాగా సాగింది.

డోక్లామ్ వివాదం శాంతియుతంగా పరిష్కారం కావడం, ఏదో ఒక పక్షానికి విజయంగా చెప్పుకోజూడటం అనవసరం, తొందరపాటు. వ్యూహాత్మక ప్రాధాన్యంగల ఇటువంటి అంశాలలో, ఏ బలమైన రాజ్యం ఏకపక్షంగా వ్యవహరించలేదు. కొందరు చెబుతున్నట్టు పరస్పర ఉపసంహరణ జరిగిందని కూడా అనుకోలేము. భారత్ ప్రకటించినట్టు విరమించుకోవడం అనేది స్పష్టతను ఇస్తుంది. ఉపసంహరణ, విరమించుకోవడం అనేవి వేర్వేరు అంశాలు. 'పరస్పర' చర్యలు తీసుకుంటున్నట్టు కూడా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ చెప్పుకోవడం లేదు. కానీ చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ మాత్రం భారత దళాలు ఉపసంహరించుకున్నట్టు ప్రకటించింది. తాము మాత్రం గస్తీ సాగిస్తూ ఉంటామని, తమ సార్వభౌమ హక్కులను వినియోగించుకుంటూ ఉంటామని చెప్పింది. ఇక్కడ పెద్దగా వైరుధ్యం లేదు. ఒకవైపు చైనా గస్తీ కొనసాగించడమూ, వివాదాస్పద స్థలంలో చైనా దళాలు రహదారి నిర్మించకుండా నిరోధించడంలో సఫలమైన తరువాత, భారత దళాలు తమ బంకర్లకు చేరుకోవడమూ- రెండూ సాధ్యమే.

ఆశించిన లక్ష్యం నెరవేరిందా అనేది ఈ దశలో మనకు తెలువదు. భారత్ ఇచ్చిన ప్రకటనలో రహదారి ప్రస్తావన లేదు. చైనా ప్రకటన సార్వభౌమ హక్కులు అంటూ నిగూఢంగా ఉన్నది. గతంలో న్యాయసమ్మతంగా రహదారి నిర్మాణానికి ఇటువంటి పదబంధాలు వాడింది. అందువల్ల ఎవరైనా తమకు విజయం లభించినట్టు చెప్పుకున్నంత మాత్రాన, వారు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాదు. చైనా వారు నిజంగా తమ రహదారి నిర్మాణాన్ని విరమించుకున్నారా అనేది కూడా వేచి చూడవలసిందే. మా అబ్జర్వర్ రిసెర్చి ఫౌండేషన్‌లో నాకు సహచరులైన అభిజ్ఞాన్ రేజ్ అభిప్రాయం గమనార్హమైనది. పరస్పర వ్యూహాల కోణంలో- వ్యూహాత్మక ఉద్రిక్తతలను ఆయన అధ్యయనం చేస్తుంటారు. భారత్, చైనా మధ్య తెరవెనుక ఏ అవగాహనకు వచ్చాయనేది గత ఉదాహరణల ఆధారంగా అంచనాకు రావాలంటారు ఆయన. చైనా రహదారి నిర్మాణం చేపట్టడానికి తరలించిన ఉపకరణాలు ఇంకా అక్కడే ఉన్నాయా అనేది మరో వారం రోజుల వరకు గమనించాలని సూచించారు.



భారత్ ముందుకు వచ్చి, ఉమ్మడి భద్రతకు హామీ ఇచ్చింది. ఇది మంచి సంకేతం. చైనా ప్రాబల్యం వల్ల భయపడుతున్న చిన్న దేశాలకు భారత్ నుంచి అనుకూల సందేశం ఇచ్చినట్టయింది. ఇప్పుడు వివాదాస్పదమైన భూభాగం చైనా- భూటాన్ సరిహద్దులోనిది. మన సందేశం అన్నివేళలా ఉపయుక్తమైనదేనా అనేది కూడా ఆలోచించాలె. మన చొరవ వల్ల భూటాన్ జాతీయ భావనలు దెబ్బతినకుండా చూడాలె. ద్వైపాక్షిక సంబంధాలు ఏ మాత్రం బలహీనపడకుండా జాగ్రత్త పడా లె. భూటాన్‌కు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించే అవకాశం కోసం చైనా వేచి చూస్తున్నది. చైనా చూపే తాయిలాలు మన తోడ్పాటు కన్నా ఆకర్షణీయంగా ఉండకుండా జాగ్రత్త వహించాలె.

తాము విజయం సాధించామని ఇరు పక్షాలకు చెందిన ప్రచారకర్తలు చెబుతూ ఉంటారు. కానీ దౌత్య వేత్తలు చెబుతున్న ప్రకారం వాస్తవాలు అంత సరళంగా ఉండవు. ఎంత గొప్ప దేశమైనా ఏకపక్షంగా వ్యవహరించజాలదు. చైనా రహదారి నిర్మాణం చేపట్టినా భారత్ పరాజయం సాధించినట్టు కాదు. తనకు ఇబ్బంది కలుగకుండా ఉండటానికి భారత్ ఇతరత్రా వెసులుబాట్లు కల్పించిందా అనేది కూడా తెలువదు. చైనా రహదారి నిర్మాణం చేపట్టడం లేదూ అంటే, భారత్ వన్ బెల్ట్ వన్ రోడ్ వంటి ఏదైనా ఇతర విషయంలో దిగి వచ్చిందా అనేది తెలువదు. కాలం గడిచే కొద్దీ ఈ విషయాలు బయటికి వస్తాయి. అందువల్ల కండ్లు తెరిచి, చెవులు రిక్కించి, మనసు పెట్టి గమనిస్తూ ఉండాలె. ఏదో ఒకరకమైన ఒప్పందం మాత్రం కుదిరింది. తక్షణ ప్రమాదం తొలిగిపోయింది. తామ లక్ష్యాలను సాధించామని ఏ ఒక్క పక్షమూ అధికారికంగా చెప్పుకోలేదు. అయితే రెండు పక్షాలూ అనధికారికంగా అట్లా చెప్పుకుంటూ ఉంటాయి. పౌరులుగా మనం క్షేత్ర స్థాయిలో జరిగేది చూడాలె తప్ప ఏదీ నమ్మడానికి లేదు. ఇటువంటి విషయాలలో రొనాల్డ్ రీగన్ సూత్రం పనికి వస్తుంది. ' నమ్ము, కానీ తనిఖీ చేసి చూసుకో'.

డోక్లాం ఉదంతం నుంచి మనం కొన్ని పాఠాలు నేర్చుకోవాలె. మొదటిది- చైనా వారు ఎందుకు నిలిచిపోయారనేది మనకు ఎప్పుడూ తెలువదు. ఈ వివాదం సందర్భంగా చైనా పెంపుడు మీడియా విద్వేష ప్రచారం సాగించింది. దీనివల్ల వివాద పరిష్కారం క్లిష్టంగా మారింది. భారత్ పట్ల తీవ్రంగా దాడి సాగించమని చైనా తమ మీడియాను పురిగొల్పిందా? భారత్‌పై పథకం ప్రకారం దాడి జరిగింది అవకాశాన్ని ఉపయోగించుకున్నారా? ఈ ప్రశ్నలకు ఇప్పుడు లభించే సమాధానాలతో సంతృప్తి చెందడం కన్నా, ఇంకా లోతుగా ఆలోచించాలె. రెండు- తాము రహదారి నిర్మాణం చేపడుతున్నట్టు చైనా ముందుగా మనకు చెప్పిందా? చెబితే మన అధికారికి స్పందన ఏమిటి? దీని ప్రాధాన్యం తెలిసిన వారి దృష్టికి ఈ సమాచారం చేరిందా? ఉత్తమమైన సంక్షోభ నివారణ అంటే, అసలు సంక్షోభమే తలెత్తకుండా చూడటం. సంక్షోభ నివారణ అవకాశాన్ని చేజార్చుకున్నారా? ఇదే నిజమైతే మాత్రం, ఇక ముందు అటువంటివి జరగకుండా, ఎటువంటి వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలనేది ఆలోచించాలె. మూడవది- భూటాన్ విషయమై మరింత జాగ్రత్తగా ఉండాలె. భారత్ ముందుకు వచ్చి, ఉమ్మడి భద్రతకు హామీ ఇచ్చింది. ఇది మంచి సంకేతం. చైనా ప్రాబల్యం వల్ల భయపడుతున్న చిన్న దేశాలకు భారత్ నుంచి అనుకూల సందేశం ఇచ్చినట్టయింది. ఇప్పుడు వివాదాస్పదమైన భూభాగం చైనా- భూటాన్ సరిహద్దులోనిది. మన సందేశం అన్ని వేళలా ఉపయుక్తమైనదేనా అనేది కూడా ఆలోచించాలె. మన చొరవ వల్ల భూటాన్ జాతీయ భావనలు దెబ్బతినకుండా చూడాలె. ద్వైపాక్షిక సంబంధాలు ఏ మాత్రం బలహీనపడకుండా జాగ్రత్త పడాలె. భూటాన్‌కు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించే అవకాశం కోసం చైనా వేచి చూస్తున్నది. చైనా చూపే తాయిలాలు మన తోడ్పాటు కన్నా ఆకర్షణీయంగా ఉండకుండా జాగ్రత్త వహించాలె.

రెండు దేశాల సైన్యాలు ముఖాముఖి ఎదురు నిలిచి ఉన్నప్పుడు, దౌత్య విధానం విజయం సాధించడం హర్షణీయం. అందువల్ల మేం గెలిచాం అంటూ హడావుడి చేయవద్దు. మన ప్రధాని కానీ, విదేశాంగ మంత్రి కానీ, విదేశాంగ కార్యదర్శి కానీ ఈ విధంగా వ్యవహరించడం లేదు.

(ఎన్డీటీవీ సౌజన్యంతో...)

ఆటలపై నిర్లక్ష్యం తగదు

సందర్భం



జంగం పాండు

విద్య ఉద్యోగ అవకాశాల కోసమే కాకుండా మన సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు మానవతా విలువలు, దేశభక్తి సంస్కారాన్ని పెంపొందించేలా ఉండాలి. కానీ నేటి విద్యలో అవన్ని లోపించాయి. ఎప్పుడైతే భారతదేశంలో ఆంగ్లేయులు పరిపాలన సాగించారో అప్పటినుంచి విలువలు లేని లార్డ్ మెకాలే 1835 విద్యా విధానం ఇప్పటికీ అమలవుతుండటం శోచనీయం. క్రీడా రంగంలో ఆంగ్లేయులకు ఎంతో ప్రావీణ్యం ఉన్నప్పటికీ భారతదేశంలోని విద్యా విధానంలో క్రీడలను ప్రవేశపెట్టలేదు. ఇక్కడ నిర్వహిస్తున్న వ్యాయామశాలలు, మర్దనశాలల్లో నేర్చుకుంటున్న కత్తిసాము, కర్రసాము వంటి విద్యలలో ప్రావీణ్యం పొంది తమపై తిరుగబడుతున్నారని క్రీడలను మరుగున పడేశారు. భారతదేశంలో పూర్వకాలంలోనే వ్యాయామ విద్యకు, యోగాకు చాలా ప్రాధా న్యం ఉండేది. వేద కాలం, పురాణకాలం యోగ, వ్యాయామ విద్య ఒక వెలుగు వెలిగాయి. గతంలో బాల్యం నుంచి 25 సంవత్సరాలు వచ్చేసరికి విద్యతో పాటు యోగ, వ్యాయామ క్రీడల్లో అప్పటి విద్యార్థులు ప్రావీణ్యం పొందేవారు.

స్వాతంత్ర్యానంతరం చాలా కమిటీలు క్రీడారంగంపై మార్గదర్శకాలు చేసినప్పటికీ అవి సక్రమంగా అమలు కాలేదు. వాటిలో ప్రధానంగా కుంజ్రూ కమిటీ (1959) కౌల్ కపూర్ కమిటీ (1960) వం టి కమిటీలు చాలా ముఖ్యమైన సిఫార్సులు చేసినప్పటికీ అవి అమలు జరుగలేదు. ఆ తర్వాత 1961లో వచ్చిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్, 1984లో వచ్చిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కొంతవరకు క్రీడాకారులను తయారుచేస్తున్నాయి. గత పాలకులు వ్యాయా మ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇప్పటివరకు 1968లో ఇందిరా గాంధీ, 1986లో రాజీవ్ గాంధీ, 1992లో పీవీ నర్సింహారావు ఇలా ముగ్గురి ప్రభుత్వాలు జాతీయ విద్యా విధానం లో మార్పులు చేసినప్పటికీ క్రీడలకు ప్రముఖ స్థానం కల్పించలేకపోయారు.

ఒలింపిక్స్‌లో భారత హాకీ టీం వరుసగా (1926-1956) ఆరు సార్లు గోల్డ్ మెడల్ రావడంలో కీలకపాత్ర పోషించిన హాకీ వీరుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా కొన్ని విషయాలు చర్చించుకుందాం. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5-19 సంవత్సరాల వయస్సున్న పిల్లలు 38.68 కోట్ల మంది ఉన్నారు. వారిలో 26.78 కోట్ల మంది (71 శాతం) పాఠశాలలకు వెళ్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన నూతన జాతీయ విధానంలో భాగంగా దేశంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పాఠశాలల హేతుబద్ధీకరణ, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, డిజిటల్ విద్య, డిటెన్షన్ విధానం, ఏకీకృత సర్వీస్ వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించకుంటున్న వేళ అన్ని రాష్ట్రాల్లో క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. దేశ జనాభాలో యువత 65 శాతం ఉన్నా క్రీడారంగంలో వెనుకబడే ఉన్నాం. ప్రపంచంలో చాలా ప్రాధాన్యం ఉన్న ఒలింపిక్స్ క్రీడల్లో మన క్రీడాకారుల ప్రదర్శన అధ్వాన్నంగా ఉన్నది. 2012లో లండన్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో 55వ స్థానం, 2016 రియో ఒలింపిక్స్‌లో 67వ స్థానంతో సరిపెట్టుకున్నది. అమెరికా, ఇంగ్లండ్, రష్యా, జపాన్ వంటి దేశాలు శతకాలు, అర్ధ శతకాల పథకాలు సాధిస్తే మన భారత్ కనీసం సింగిల్ డిజిట్ కూడా దాటలేకపోయింది. 32 కోట్ల జనాభా కలిగిన అమెరికా 2520 ఒలింపిక్స్ పతకాలతో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నది. 130 కోట్ల జనాభా కలిగిన చైనా 594 పతకాలతో 7వ స్థానంలో ఉండగా, 139 కోట్ల జనాభా కలిగిన భారత్ 28 పతకాలు మాత్రమే సాధించింది. ఈ సంఖ్య అమెరికా స్విమ్మర్ సాధించిన పతకాలతో సమానం.

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రతి పాఠశాలలో క్రీడా స్థలం, క్రీడలకు కావాల్సిన అసౌకర్యాలుండలన్న నిబంధనలు ప్రాతిపాదనలుగానే మిగిలిపోతున్నాయి. విద్యార్థులకు బాల్య దశ నుంచి ఆటలపై అవగాహన కల్పించి, వాటిపై మక్కువను పెంచాల్సిన అవసరం ఉన్న ది.

క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుంది. తద్వారా విద్యార్థులు ఒత్తిడిని జయిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని గుర్తుంచుకొని క్రీడలకు దేశంలో సముచిత స్థానం కల్పించాల్సిన అసరం ఎంతైనా ఉన్నది.

తర్వాత ఉత్తమ ఫలితాలు వస్తాయి. క్రీడల పట్ల తల్లిదండ్రులకూ అవగాహన కల్పించాలె. ఇప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడలు చదువులో భాగమనే విషయాన్ని గ్రహించడం లేదు. చాలా మంది విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నట్టు పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. క్రీడల ద్వరా మనిషి ఒత్తిడి నుంచి విముక్తి పొందుతాడనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడం విడ్డూరం. దేశంలో 60 లక్షల విద్యాసంస్థలు ఉంటే అందులో అరువై శాతం విద్యాసంస్థల్లో క్రీడా మైదానాలు లేవంటే మనం క్రీడలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో అర్థమవుతున్నది. 7,48,586 ప్రైమరీ స్కూళ్లలో ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు లేడు. 5,56,498 అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో యాభై శాతం వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. అటువంటప్పుడు విద్యార్థులు శారీర క, మానసిక వికాసం ఎలా పొం దుతారు. వెయ్యి విశ్వవిద్యాలయాల్లో, వాటికి అనుబంధంగా ఉన్న 30,000 డిగ్రీ కళాశాలల్లో యాభై శాతం వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే ఒలింపిక్స్ క్రీడల్లో పతకాలు తేవడంలో ఎలా ముందుకు వెళ్తారు.

వాణిజ్య లాభాపేక్ష కోసమే పది దేశాలు ఆడే క్రికెట్ ఆటకు మన దేశంలో విస్తృత ప్రచా రం కల్పించారు. తద్వారా జాతీయ క్రీడ అయిన హాకీ, సంప్రదాయ క్రీడ అయిన కబ డ్డీ, కోకో, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్ లాంటి ఆటలు మరుగున పడ్డాయి.ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆట అంటే ఒక్క క్రికెటే కాదు, మరెన్నో క్రీడలున్నాయి. క్రికెట్‌తో పాటు వాటిని కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఆ మాట కోట్లాది మంది ప్రజల కు చేరింది. ఒలింపిక్స్‌లో ఉన్న చాలా క్రీడల్లో ఆటలను మన దేశ క్రీడాకారులు పాల్గొనపోవడానికి చాలా కారణాలున్నాయి. ప్రధానంగా గత ప్రభుత్వాలు క్రీడలను నిరక్ష్యం చేయడమే. తగిన ప్రాధాన్యం కల్పించక పోవడంతో పాటు క్రీడలకు తగినంత బడ్జెట్ కేటాయించకపోవడం కూడా ఓ కారణమే. అంతర్జాతీయంగా మౌలిక వసతులు కల్పించకపోవడం, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయలేకపోవడం, వ్యాయామ శిక్షకులు లేకపోవడం, సరైన ప్రణాళికలు లేకపోవడం, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు క్రీడలకు సముచిత స్థానం కల్పించకపోవడంలాంటి కారణాలతో చాలా క్రీడలు మరుగునపడ్డాయనడంలో సందేహం లేదు.

పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు వ్యాయామ విద్యను, క్రీడలను తప్పనిసరి చేస్తూ క్రీడా సంస్కృతి విలసిల్లాలి. క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుంది. తద్వారా విద్యార్థులు ఒత్తిడిని జయిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని గుర్తుంచుకొని క్రీడలకు దేశంలో సముచిత స్థానం కల్పించాల్సిన అసరం ఎంతైనా ఉన్నది.

(నేడు హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



వరదల్లో మునిగిన హ్యూస్టన్‌లో ఓ తల్లీబిడ్డను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సహాయక సిబ్బంది

హార్వే హరికేన్‌తో టెక్సాస్ అతలాకుతలం

వరద ధాటికి ఐదుగురి మృతి, 14మందికి గాయాలు

హోస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం హార్వే హరికేన్ ధాటికి అతలాకుతలం అయ్యింది. గత యాభై ఏండ్లలో టెక్సాస్‌ను తాకిన అతి తీవ్రమైన తుఫాను ఇదేనని యూఎస్ అధికారులు చెప్తున్నారు. కేవలం వారం రోజుల్లోనే ఏండ్లలో కురవాల్సిన వర్షపాతం నమోదయ్యిందని పేర్కొన్నారు. హరికేన్ హార్వే శుక్రవారం టెక్సాస్ తీరాన్ని తాకింది. అనధికారిక సమాచారం ప్రకారం అయిదుగురు వ్యక్తులు మృతి చెందగా.. 14మంది గాయపడ్డారు. హోస్టన్‌తో పాటు టెక్సాస్‌లోని మిగతా ప్రాంతాల్లోని వీధులు, ఇండ్లు, రోడ్లు వరద నీటితో నిండిపోయాయి. కోటి ముప్పై లక్షల మంది ప్రజలు వరద ప్రభావానికి లోనయ్యారు. సుమారు మూడు లక్షల మంది అంధకారంలో ఉన్నారు. ఒక్క రోజులో అత్యధికంగా 50.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యిందని నేషనల్ వెదర్ సర్వీస్ ప్రకటించింది. వరద ప్రభావం మరికొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉందని సంస్థ తెలిపింది. ఇప్పటివరకు 250 సహాయక చర్యలు నిర్వహించి, వేయి మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం తాను టెక్సాస్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేశారు.

వరదల్లో చిక్కుకున్న 200మంది భారత విద్యార్థులు

న్యూఢిల్లీ: రెండు వందల మంది భారత విద్యార్థులు అమెరికాలోని హోస్టన్ వరదల్లో చిక్కుకున్నారని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ సోమవారం ట్విట్టర్‌లో తెలిపారు. హోస్టన్‌లోని భారత కాన్సుల్ జనరల్ అనుపమరాయ్‌తో తాను మాట్లాడానని పేర్కొన్నారు. యూనివర్సిటీ పరిసరాల్లో మోకాలు లోతులో నీరు నిలిచి ఉందని, భారత్ నుంచి ఆహారం, ఇతర సామగ్రిని పంపించేందుకు ప్రయత్నించినా యూఎస్ కోస్ట్‌గార్డులు అనుమతించడం లేదని సుష్మ తెలిపారు. సహాయ, పునరావాస చర్యల నిమిత్తం నాలుగు వేల దళాలను టెక్సాస్ గవర్నర్ జార్జ్ అబాట్ పంపించారని ఆమె పేర్కొన్నారు. ఇద్దరు భారత విద్యార్థులు షాలిని, నిఖిల్ భాటియాలను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారని, వారి బంధువులను వీలైనంత తొందరగా అక్కడికి పంపించేందుకు ప్రయత్నిస్తున్నామని సుష్మ చెప్పారు.



హార్వే హరికేన్ కారణంగా నీటమునిగిన టెక్సాస్‌లోని ఓ ప్రధాన రహదారి

డేరా కేంద్రాల మూసివేత, సోదాలు



సునారియా జైలు ఆవరణలో గుర్మీత్ రాంరహీంసింగ్

రోహతక్, ఆగస్టు 28: రోహతక్‌లోని డేరా సచ్చాసౌదా కేంద్రాలను పోలీసులు మూసేశారు. హర్యానాలోని 103 డేరా కేంద్రాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. సోనేపట్ జిల్లాలోని డేరా కేంద్రంలో జరిపిన సోదాల్లో లాఠీలతో సహా అనేక 'వస్తువులు' దొరికినట్టు పోలీసులు తెలిపారు.

డేరాలను తిప్పికొట్టేందుకు సిద్ధం

డేరా అనుచరులు అల్లర్లకు దిగితే ఎదుర్కొనేందుకు సిర్సాలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న షాపూర్-బేగూ గ్రామప్రజలు రాళ్లు, కర్రలు, ఇటుకలు, ఇనుప రాడ్లు సేకరించి పెట్టుకున్నారు. బాబా అనుచరులను తిప్పికొట్టేందుకు 'అన్నిరకాలుగా' సిద్ధంగా ఉన్నట్టు గ్రామస్థులు మీడియాకు చెప్పారు. డేరా ప్రధానకార్యాలయం వద్ద పరిస్థితి ప్రశాంతంగానే ఉందని అధికారులు చెప్పారు. లోపల ఉండిపోయిన అనుచరులు బయటికి వస్తే హర్యానా రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో వారిని స్వస్థలాలకు పంపివేస్తున్నారు.

కర్ఫ్యూ ఎత్తివేత.. నో ఇంటర్‌నెట్

ప్రస్తుతం డేరా ప్రధాన కార్యాలయమున్న సిర్సాలో మాత్రమే కర్ఫ్యూ అమలులో ఉంది. పంచ్‌కుల, కైతాల్‌తో పాటుగా అన్ని పట్టణాల్లో కర్ఫ్యూను ఎత్తివేశారు. శుక్రవారంనాటి హింసాకాండ కారణంగా ఆగిపోయిన రైలు సర్వీసులను పునరుద్ధరించారు. ఢిల్లీ-రోహతక్-భటిండా సెక్షన్‌లో మాత్రం రైళ్లు తిరుగడం లేదు. మంగళవారం ఉదయం 11.30 గంటల వరకు ఇంటర్‌నెట్ సేవల నిలిపివేత కొనసాగుతుంది. సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయానికి ఇంటర్‌నెట్ సేవలను కూడా అప్పుడే పునరుద్ధరిస్తారు. మరోవైపు హైకోర్టు ఆదేశాల మేరకు డేరా స్థిర చరాస్తుల లెక్కింపును అధికారులు నిర్వహిస్తున్నారు. బ్యాంకుల నుంచి డేరా ఖాతాల వివరాలను కూడా సేకరిస్తున్నారు. రాంరహీంసింగ్‌ను అపరాధిగా ప్రకటించిన తర్వాత జరిగిన హింసాకాండకు ఆయన అనుచరులు బాధ్యులని తేలితే బాధితులకు పరిహారం చెల్లించేందుకు వీలుగా ఆస్తులు జప్తు చేయాలని పంజాబ్, హర్యానా ప్రభుత్వాలను చండీగఢ్‌లోని ఉమ్మడి హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. అందుకుగాను మంగళవారం ఆస్తుల వివరాలను సమర్పించాలని స్పష్టం చేసింది.

పెద్దఎత్తున లాఠీలు, ఇతర వస్తువులు స్వాధీనం



సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయం వద్ద బందోబస్తులో భద్రతా బలగాలు

న్యాయమూర్తి.. మానవస్ఫూర్తి

రేపిస్టు బాబాకు కఠిన శిక్ష విధించి వార్తల్లో వ్యక్తిగా మారిన సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగదీప్‌సింగ్ మానవీయ స్పందన గల వ్యక్తిగా గతంలో పేరు గడించారు. ఓసారి ఆయన తన స్వస్థలమైన హర్యానాలోని జింద్‌కు కారులో వెళ్తుండగా.. ఆ సమయంలో రోడ్డు మీద ప్రమాదంలో గాయపడి ఉన్న నలుగురు వ్యక్తులను ఆయన చూశారు. వారిని తక్షణం దవాఖానకు తరలించాలని తపన పడ్డారు. అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే లాభం లేకపోయింది. దాంతో దారిన పోయేవారి సహాయంతో తన కారులోనే క్షతగాత్రులను దవాఖానకు తరలించి వారి ప్రాణాలు నిలబెట్టారు. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఈ ఘటనతో సింగ్ సోషల్ మీడియాలో మానవీయమైన వ్యక్తిగా జేజేలు అందుకున్నారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునే కారుణ్యమూర్తిగా న్యాయమూర్తి జగదీప్‌సింగ్‌కు ఎంతపేరుందో కఠినమైన తీర్పులు ఇవ్వడంలోనూ ఆయనకు అంతే పేరుంది.

అజ్ఞాత ఫిర్యాదుతో మొదలైన కేసు

1999-2001 మధ్యకాలంలో రాంరహీంసింగ్ తన ఆశ్రమంలోని ఇద్దరు సాధ్వులపై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ 2002 ఏప్రిల్‌లో అజ్ఞాత ఫిర్యాదుతో ఈ కేసుకు బీజాలు పడ్డాయి. పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఆ ఏడాది డిసెంబర్‌లో కేసు నమోదు చేసింది. 2007 జూలైలో అంబాలా కోర్టులో సీబీఐ నేరారోపణ పత్రం దాఖలు చేసింది. ఇద్దరు సాధ్వులపై (మహిళా అనుచరులు) డేరా చీఫ్ లైంగికదాడులకు పాల్పడ్డారనేది అభియోగం. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2008 సెప్టెంబర్‌లో భారత శిక్షాస్మృతిలోని 376 (లైంగికదాడి), 506 (బెదిరించి లొంగదీసుకోవడం) సెక్షన్ల కింద ఆరోపణలు ఖరారు చేసింది. 2009-2010 మధ్యకాలంలో పిటిషనర్లు కోర్టుకు వాంగ్మూలం ఇచ్చారు. తర్వాత ఈ న్యాయస్థానం పంచ్‌కులకు రావడంతో డేరా చీఫ్ కేసు విచారణ కూడా అక్కడకు మారింది. 2017 జూలైలో కోర్టు అనుదిన విచారణలకు ఆదేశించింది. ఆగస్టు 17కు పాసిక్యూషన్, డిఫెన్స్ వాదనలు పూర్తయ్యాయి. నేరనిరూపణ అయినట్టు గత శుక్రవారం ప్రకటించిన కోర్టు సోమవారం శిక్షను ఖరారు చేసింది.

వివాదాల గురువు!

గుర్మీత్‌సింగ్‌పై పెండింగ్‌లో ఇతర కేసులు

న్యూఢిల్లీ: వివాదాస్పద గురువు గుర్మీత్ రాం రహీంసింగ్ (డేరాబాబా)పై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 15 ఏండ్ల కిందటి లైంగికదాడి కేసులో తాజాగా జైలు శిక్ష పడింది. మహిళలపై లైంగికదాడి విషయాన్ని వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టు రామచంద్ర ఛత్రపతి హత్య కేసులోనూ డేరాబాబా నిందితుడు.

2002: డేరాబాబా తమపై లైంగికదాడి చేశాడని ఇద్దరు మహిళా సాధువులు ఆరోపించారు. ఈ కేసును పంజాబ్, హర్యానా హైకోర్టు సీబీఐకి అప్పగించింది.

2002 నవంబర్: సిర్సా నుంచి వెలువడే సాయంకాల దినపత్రిక 'పూరా సచ్' ఎడిటర్ రామచంద్ర ఛత్రపతి (53) హత్య కేసులో డేరాబాబాపై కేసు నమోదైంది. ఈ కేసు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో ఇంకా పెండింగ్‌లో ఉన్నది.

2007 మే: ఓ కార్యక్రమంలో గురుగోవింద్ సింగ్ తరహాలో వస్త్రాధారణ చేసుకున్నాడని డేరాబాబాపై కేసు నమోదవగా ఆయన నిర్దోషిగా బయటపడ్డారు.

2010: డేరా మాజీ కార్యనిర్వాహకుడు ఫకీర్ చాంద్ హత్య కేసులోనూ డేరా బాబాకు వ్యతిరేకంగా ఆధారాలు లేక సీబీఐ కేసును మూసేసింది.

2014: 400 మంది భక్తులను బలవంతంగా హిజ్రాలుగా మార్చారన్న కేసులో బాబాపై కేసు నమోదైంది. దీనిపై ఇంకా దర్యాప్తు కొనసాగుతున్నది.

2014: అనుచరులకు ఆయుధాలను ఉపయోగించడంలో శిక్షణ ఇస్తున్నారన్న ఆరోపణలు రావడంతో డేరా కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఆదేశించింది.

2016 జనవరి: విష్ణుమూర్తి తరహాలో వస్త్రాలు ధరించి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని అఖిలభారత హిందూ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు మొహాలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విపాసన X హనీప్రీత్

డేరా సచ్చా సౌదా వారసత్వం కోసం పెరిగిన పోటీ

న్యూఢిల్లీ: డేరా సచ్చా సౌదా(డీఎస్ఎస్) వారసులు ఎవరన్న విషయం రోజురోజుకు మలుపుతిరుగుతున్నది. గుర్మీత్ దత్తపుత్రిక హనీప్రీత్ ఇన్సాన్ డీఎస్ఎస్ బాధ్యతలు చేపడుతారని మొన్నటి వరకు పుకార్లు వచ్చాయి. అయితే సోమవారం గుర్మీత్‌కు కోర్టు జైలుశిక్ష విధించగానే మరో పేరు తెరపైకి వచ్చింది. డీఎస్ఎస్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తూ సంస్థలోనే రెండోస్థానంలో ఉన్న విపాసన ఇన్సాన్ పేరు మార్మోగుతున్నది. విపాసన కాలేజీ చదువు పూర్తికాగానే డీఎస్ఎస్‌లో చేరారు. సంస్థలో మంచి గుర్తింపును సంపాదించారు. ఇక హనీప్రీత్ ఇన్సాన్‌ను గుర్మీత్‌కు దత్త పుత్రికగా చెప్తారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో నిత్యం తండ్రిని పొగుడుతూ ఆమె పోస్టులు, ట్వీట్లు చేస్తుంటారు. గుర్మీత్ కోర్టులో హాజరుకావడం కోసం హెలికాప్టర్‌లో వచ్చినప్పుడు ఆయన వెంట హనీప్రీత్ ఉన్నారు. ఈ నేపథ్యంలో డీఎస్ఎస్ వారసురాలెవరనేది చర్చనీయాంశంగా మారింది.

డేరా బాబాకు 20 ఏండ్ల జైలు

మొదటిపేజీ తరువాయి...

ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా భద్రతా యంత్రాంగం కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకున్నది. ఆయనను పంచ్‌కులలోని సీబీఐ కోర్టుకు తరలించే బదులు న్యాయమూర్తినే హెలికాప్టర్‌లో జైలులో ఏర్పాటు చేసిన ప్రత్యేకకోర్టుకు తరలించారు. జైలు సమీపంలోని హెలిపాడ్ వద్ద న్యాయమూర్తి హెలికాప్టర్ నుంచి దిగి వాహనంలో జైలు లోపలికి వెళ్లారు. శిక్షాకాలంపై ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ప్రత్యేక న్యాయమూర్తి తన తీర్పును వినిపించారు. అనుయాయులపై లైంగికదాడులకు పాల్పడ్డ బాబాకు పదేండ్ల శిక్ష చాలదని, శిక్షాకాలాన్ని మరింత పెంచాలని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. తీర్పుపై హైకోర్టులో అపీల్ చేస్తామని డిఫెన్స్ న్యాయవాది ఎస్‌కే గార్గ్ నర్వాణా వెల్లడించారు. జరిమానా సొమ్ములో రూ.14 లక్షల చొప్పున బాధితులిద్దరికీ అందజేయాలని సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి ఆదేశించారు. ధార్మిక సంస్థగా చలామణి అయ్యే డేరా సచ్చాసౌదా అధినేత అయిన రాంరహీంసింగ్ 'అడవిమృగం'లా వ్యవహరించారని, పవిత్ర హృదయంతో తనను నమ్మివచ్చిన మహిళా భక్తులను సైతం వదిలిపెట్టలేదని న్యాయమూర్తి జగదీప్‌సింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుడ్డిగా నమ్మే అమాయకులైన అలాంటి అనుయాయులపై లైంగికంగా దాడి చేయడం ద్వారా దారుణమైన నమ్మకద్రోహానికి పాల్పడ్డారని, ఎలాంటి ఉదారతకు ఆయన పాత్రుడు కాదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

హర్యానా సీఎం ఎమర్జెన్సీ మీటింగ్

తీర్పు వెలువడిన దరిమిలా హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సీనియర్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. డేరా అనుచరులు శాంతిని పాటించాలని విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్నిరకాల జాగ్రత్త చర్యలు తీసుకున్నామని సమావేశం అనంతరం ఆయన మీడియాకు చెప్పారు. కాగా తీర్పు అనంతరం సిర్సాలో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరుగలేదని హర్యానా సీనియర్ అధికారి వీ ఉమాశంకర్ ప్రకటించారు.

సిర్సా సమీపంలో కారుకు నిప్పు

రాంరహీం సింగ్‌కు పదేండ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువడిన అనంతరం ఆయన మద్దతుదారులు కొట్లి గ్రామ సమీపంలో ఓ కారుకు నిప్పంటించారు. సిర్సాలోని డేరా ప్రధానకేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.

జైలు చుట్టూ భద్రతా వలయాలు

డేరా అనుచరులు హింసకు పాల్పడే అవకాశమున్నందున జైలు చుట్టూ పోలీసులు పలు అంచెల భద్రతా వలయాలను ఏర్పాటు చేశారు. హర్యానా, పంజాబ్‌లలో హైఅలర్ట్ అమలు చేశారు. ఏ క్షణంలోనయినా రంగంలోకి దిగేందుకు సైన్యాన్ని సర్వసన్నద్ధంగా ఉంచారు. రోహతక్‌లో 23 కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించారు. భద్రతా పరిస్థితి తమకు సవాల్‌గా మారిందని పోలీసు అధికారులు ప్రకటించారు. రోహతక్‌లో ఈసరికే 144 సెక్షన్ కింద ప్రజలు గుమిగూడడం, ఆయుధాలతో సంచరించడంపై నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయి.

కనిపిస్తే కాల్చివేత అమలు

హింసాత్మక చర్యలకు పాల్పడేవారిని కాల్చివేయడానికి ఏమాత్రం వెనుకాడబోమని రోహతక్ డిప్యూటీ కమిషనర్ అతుల్‌కుమార్ స్పష్టం చేశారు. 'హెచ్చరికలు ఖాతరు చేయకుండా హింసకు పాల్పడి అమాయకుల ప్రాణాలను ప్రమాదంలో పడేసేవారిపై కాల్పులు జరిపేందుకు ఏమాత్రం వెనుకాడబోం' అని ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకే హర్యానా పోలీసులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారని ఆ రాష్ట్ర డీజీపీ బీఎస్ సంధూ అన్నారు. డేరా అనుచరులెవరినీ రోహతక్ జిల్లాలోకి, సునారియా జైలు సమీపంలోకి అనుమతించే ప్రసక్తే లేదని ఆయన వివరించారు. హర్యానా, పంజాబ్‌లో విద్యాలయాలకు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా సెలవు ప్రకటించారు.

సైన్యం వద్దకన్నా ఎక్కువ మందుగుండు నిల్వలా?: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దేశరాజధాని ప్రాంతంలో 50 లక్షల కిలోల దీపావళి పటాకులు నిల్వచేయడంపై సుప్రీంకోర్టు మండిపడింది. సైన్యం వద్ద ఉన్నదానికన్నా ఎక్కువ మందుగుండు నిల్వ చేశారని అధికారులకు అక్షింతలు వేసింది. న్యాయమూర్తులు మదన్ బీ లోకూర్, దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం సోమవారం పటాకుల నిషేధం కేసుపై విచారణ జరిపింది. రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో 50 లక్షల కిలోలు, ఢిల్లీ నగరంలో లక్ష కిలోలు నిల్వ ఉన్నట్టు న్యాయవాది ఒకరు వివరించినప్పుడు ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ఈ పటాకులతో దేశాన్ని తగులబెట్టవచ్చని తీవ్రవ్యాఖ్యలు చేసింది. 'ఢిల్లీలో దీపావళి ఐదురోజులపాటు జరుపుతారు. అంటే రోజుకు 10 లక్షల కిలోల పటాకులు కాలుస్తారా?' అని ప్రశ్నించింది. చవకగా లభించే చైనా పటాకుల నిషేధానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి? అని నిలదీసింది. సర్కారు అభిప్రాయం తెలుసుకొని నివేదిస్తానని అదనపు సొలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్ ధర్మాసనానికి తెలిపారు. దీపావళి రోజుల్లో కాలుష్యం పెరిగిపోవడానికి పటాకులు మాత్రమే కారణం కాదని తయారీదారులు కోర్టుకు విన్నవించారు. రాత్రి పది గంటల తర్వాత కూడా కొందరు పటాకులు కాలుస్తుంటారని పిటిషనర్ల తరఫు న్యాయవాది ఒకరు ధర్మాసనానికి నివేదించారు.

ఆశారాం కేసు దర్యాప్తులో జాప్యం ఎందుకు?

గుజరాత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఆధ్యాత్మిక వేత్త ఆశారాం బాపుపై నమోదైన లైంగికదాడి కేసు దర్యాప్తులో జాప్యానికి కారణాలేమిటని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఆశారాం దాఖలు చేసిన పలు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అమితావ్‌రాయ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. 'త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఆదేశించినా ఎందుకు జాప్యం జరుగుతున్నది. ఈ కేసులో కీలకసాక్షి అయిన బాధితురాలి వాంగ్మూలం ఎందుకు నమోదు చేయలేదు?' అని ప్రశ్నించింది. ఆశారాం బాపు తమపై లైంగిక దాడి చేశారని సూరత్‌కు చెందిన ఇద్దరు యువతులు ఆరోపించిన కేసులో వాంగ్మూలాలను నమోదు చేయాలని ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు ఆదేశించింది.అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ఈ కేసులో ఇద్దరు కీలక సాక్షులు హత్యకు గురయ్యారని, ఒకరు అదృశ్యం అయ్యారని, 17 మందికి దాడుల్లో గాయాలయ్యాయని వివరించారు. బాధితురాలి భద్రతకు భరోసా లభించిన తర్వాతే ఆమె వాంగ్మూలం రికార్డు చేస్తామన్నారు. వచ్చేనెల 23లోగా వాంగ్మూలం నమోదుకు కింది కోర్టుకు ఆదేశాలు జారీ చేయాలని బాధితురాలి తరఫు న్యాయవాది కోరారు. తదుపరి విచారణను దీపావళి తర్వాతకు ధర్మాసనం వాయిదా వేసింది.

కేంద్ర ఉద్యోగులకు ఈమెయిల్

సురక్షితమైన సర్వర్ల ద్వారా సేవలు

న్యూఢిల్లీ: కేంద్ర సర్కార్ తన 50 లక్షలమంది ఉద్యోగులకు ఇంగ్లిష్, హిందీ భాషల్లో సురక్షితమైన ఈమెయిల్ సేవలను అందుబాటులోకి తేనున్నట్టు సోమవారం ప్రకటించింది. ఈ సేవలను సురక్షితమైన సర్వర్ల ద్వారా నిర్వహిస్తారు. ఇంతవరకు భద్రతాకారణాల రీత్యా ఉద్యోగులు ప్రైవేట్ ఈమెయిల్ సేవలను వినియోగించడాన్ని ప్రభుత్వం అనుమతించలేదు. వాటికి సంబంధించిన సర్వర్లు విదేశాల్లో ఉండడమే అందుకు కారణం. ఉద్యోగులు ఇంగ్లిష్ ఈమెయిల్ కొరకు ఎట్-గవ్-డాట్-ఇన్, హిందీ కొరకు సర్కార్-డాట్-భారత్‌ను వినియోగించవచ్చు.

గర్భస్రావ పిటిషన్‌పై వైద్యుల బోర్డు

సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ: తలలో కపాలం లేకుండా ఎదుగుతున్న 24వారాల పిండాన్ని తొలగించేందుకు అనుమతించాలని ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు వైద్యుల బోర్డును నియమించింది. 20 ఏండ్ల ఫిర్యాదుదారును పరీక్షించేందుకు పుణెలోని బీజే మెడికల్ కాలేజీలో వైద్యుల బోర్డును ఏర్పాటు చేయాలని జస్టిస్ ఎస్ఏ బోబడే, జస్టిస్ ఎల్ నాగేశ్వర రావుతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. భారత గర్భస్రావ చట్టం 20 వారాల తర్వాత గర్భస్రావాన్ని అనుమతించదు.

వినాయక నిమజ్జన బందోబస్తుకు ఏపీ బలగాలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించే బందోబస్తు కోసం అదనపు బలగాలు అవసరం ఉన్నదని, కొంత బలగాలను పంపించాలని కోరుతూ డీజీపీ అనురాగ్‌శర్మ సోమవారం ఆంధ్రప్రదేశ్ డీజీపీకి లేఖ రాశారు. ఈసారి రాష్ట్రంలో భారీ సంఖ్యలో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు.. బందోబస్తు కోసం గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో బలగాలు, సిబ్బంది అవసరం ఏర్పడిందంటూ సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఉన్న పోలీసులతోపాటు అదనపు ఫోర్స్ అవసరం ఏర్పడిందన్నారు. ఇందుకు పక్క రాష్ట్రం సహాయం తీసుకోవాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. బందోబస్తు సిబ్బందిని మాత్రమే కోరామని, ఏపీ నుంచి ఎన్ని బలగాలు వస్తాయన్న విషయం మంగళవారం తెలుస్తుందని వివరించారు.

రైల్వే కోర్టుకు మంత్రులు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కేసుల విచారణలో భాగంగా ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎక్సైజ్‌శాఖ టీ పద్మారావు సోమవారం సికింద్రాబాద్ బోయిగూడలోని రైల్వే కోర్టుకు హాజరయ్యారు. విచారణ అనంతరం, కోర్టు బయట మీడియాతో మంత్రి నాయిని మాట్లాడుతూ 2011లో జరిగిన రైల్‌రోకో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న 14 మందిపై గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును ఆపినట్టుగా ఆర్‌పీఎఫ్ పోలీసులు అభియోగాలను నమోదు చేశారన్నారు. ఎప్పటి లాగానే ఈ రోజు తామందరం విచారణకు హాజరయ్యామన్నారు. జడ్జి తమ కేసును ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారని వివరించారు. ఈ కేసులో మంత్రులతోపాటు బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీ వేణుగోపాల్‌రెడ్డి, భేతి సుభాశ్‌రెడ్డి, బద్దం పరశురాంరెడ్డి, ఆర్ నర్సింహాచారి, బీ బాల్‌రాజ్, డీ లక్ష్మీనారాయణ, ఎం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్, పోచయ్యయాదవ్, సుబ్బారావు, వింధ్యారాణి ఉన్నారని న్యాయవాది జీ విద్యాకర్‌రావు తెలిపారు.



బోయిగూడలోని రైల్వే కోర్టుకు హాజరైన మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి, పద్మారావు తదితరులు

కుత్బుల్లాపూర్‌లో 3.8 సెం.మీ. వర్షం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నాలుగు రోజులుగా గ్రేటర్ హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నది. సోమవారం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు గ్రేటర్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో అత్యధికంగా 3.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గాజులరామారంలో 2.9సెం.మీ, మల్కాజిగిరిలో 2.5, మారేడ్‌పల్లిలో 2.3, కాప్రాలో 2.2, తిరుమల్‌గిరిలో 2, దోమలో 1.4, కూకట్‌పల్లిలో 1.8, బాలానగర్‌లో 1.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా, రాజేంద్రనగర్, సికింద్రాబాద్, ఆసిఫ్‌నగర్, బహదూర్‌పుర, చార్మినార్, అంబర్‌పేట, శేరిలింగంపల్లి, హిమాయత్‌నగర్, గోల్కొండ, ఖైరతాబాద్‌లోనూ మోస్తరు వర్షం కురిసిందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశమున్నట్టు తెలిపారు.

గ్రేటర్ మాల్స్‌లో మద్యం

రూ.వెయ్యి కోట్ల టర్నోవర్ ఉన్న మాల్స్‌కు అనుమతి

మార్గదర్శకాల తయారీకి కసరత్తు చేస్తున్న ఎక్సైజ్‌శాఖ

విదేశీ మద్యానికి ప్రాధాన్యం!



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న తరుణంలో ఆధునిక సంస్కృతికి అనుగుణంగా ఎక్సైజ్‌శాఖ అడుగులు వేస్తున్నది. రాజధాని నగరం ఇప్పటికే మెట్రోపాలిటన్ సిటీస్ జాబితాలో చోటు సంపాదించి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నది. దీంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా విరివిగా షాపింగ్ మాల్స్ వెలుస్తున్నాయి. ఈ మాల్స్‌లో ఇంటిల్లిపాదికి అవసరమయ్యే అన్ని రకాల వస్తువులు లభ్యమవుతున్నాయి. క్రమంగా గ్రేటర్‌లో షాపింగ్ మాల్ కల్చర్ పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో షాపింగ్ మాల్స్‌లో మద్యం సైతం అందుబాటులో ఉంచాలని ఎక్సైజ్‌శాఖ కసరత్తు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను తయారు చేసే పనిలో నిమగ్నమైంది. వార్షిక టర్నోవర్ రూ.వెయ్యి కోట్లు ఉన్న మాల్స్‌లో మద్యం రిటైల్ అమ్మకాలకు అనుమతులు ఇవ్వాలని అధికారులు ప్రతిపాదించారు. విదేశీ మద్యానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రేటర్ పరిధిలో ఉన్న 26 రిటైల్ మద్యం దుకాణాల్లో విదేశీ మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. నగరవాసుల ఆదాయ స్థాయి పెరుగుతుండడం, విదేశీ పర్యాటకులు అధిక మొత్తంలో హైదరాబాద్‌కు వస్తుండడంతో ఫారిన్ లిక్కర్ అమ్మకాలు రెట్టింపయినట్టు గణాంకాలు చెప్తున్నాయి. మాల్స్‌లో విదేశీమద్యం అందుబాటులో ఉంచితే అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉన్నది.

వెయ్యి షాపింగ్ మాల్స్

అంతర్జాతీయ నగర స్థాయికి చేరువలో ఉన్న హైదరాబాద్‌లో షాపింగ్ కల్చర్ పెరుగుతుండడంతో బడా సంస్థలు, పారిశ్రామిక వేత్తలు మాల్స్ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే గ్రేటర్‌లో దాదాపు వెయ్యి షాపింగ్ మాల్స్ వినియోగదారులకు సేవలందిస్తున్నట్టు సమాచారం. ఇంటిల్లిపాదికి కావాల్సిన అన్ని సరుకులు ఇక్కడే దొరుకుతుండడంతో నగర ప్రజలు వీటికి అలవాటు పడిపోయారు. దీంతో ఎక్సైజ్‌శాఖ ఈ మాల్స్‌పై దృష్టి సారించింది. మాల్స్‌లో వ్యాపార లావాదేవీలు ఎలా జరుగుతున్నాయి? ఆయా మాల్స్‌లో మద్యం అమ్మకాలు ప్రారంభిస్తే ఎలా ఉంటుంది? వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు ఎక్సైజ్‌శాఖ అధికారులు క్షేత్ర పర్యటన చేపట్టారు. రానున్న రోజుల్లో షాపింగ్ మాల్ కల్చర్ మరింత విస్తరిస్తుండడంతో మాల్స్‌లో మద్యం అమ్మకాలు సాగిస్తే బాగుంటుందని అంచనాకు వచ్చినట్టు సమాచారం. బిగ్ బజార్, మెట్రో, మోర్, పై, స్పార్క్, స్పెన్సర్, రత్నదీప్, షాపర్స్ స్టాప్, డీమార్ట్, ఇనార్బిట్ మాల్ తదితర మాల్స్‌లో వినియోగదారులు అధిక మొత్తంలో షాపింగ్ చేస్తున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఈ షాపింగ్ మాల్స్ వార్షిక టర్నోవర్ రూ. వెయ్యి కోట్లకు పైగా ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మాల్స్‌లో మద్యం అమ్మకాలకు మంచి స్పందన వస్తుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

శివారు ప్రాంతాలే కీలకం

షాపింగ్ మాల్స్ ఇప్పుడు నగర శివార్లకు విస్తరిస్తుండడంతో భవిష్యత్‌లో ఈ ప్రాంతాలు కీలకం కానున్నాయి. దీంతో ఎక్సైజ్ అధికారులు ఆవైపు కూడా దృష్టి సారిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో నూతన హంగులతో కూడిన షాపింగ్ మాల్స్ నిర్మాణం లో ఉన్నాయి. ప్రధానంగా సుచిత్రా జంక్షన్ వద్ద ఓ ప్రైవేట్ కంపెనీ భారీ నిర్మాణం చేపట్టింది. దాదాపు 100 దుకాణాలతో ఈ మాల్ మరో 6 నెలల్లో ప్రజలకు అందుబాటులోకి రానున్నది. గచ్చిబౌలి, కూకట్‌పల్లి, చందానగర్, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, మాదాపూర్‌తో పాటు నగరంలోని పలుచోట్ల పెద్దపెద్ద మాల్స్ నిర్మించేందుకు పారిశ్రామికవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఇలా మరో రెండేండ్లలో గ్రేటర్ హైదరాబాద్‌లో షాపింగ్ మాల్ కల్చర్ విస్తరిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు మాల్స్‌లో మద్యం అమ్మకాలకు అనుమతిపై సమగ్ర నివేదికను తయారు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రెవెన్యూలో కదిలిన పీఠాలు

హైదరాబాద్‌లో ఏడుగురు తహసీల్దార్లు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ జిల్లా రెవెన్యూలో ఏండ్లుగా పాతుకుపోయిన అధికారుల పీఠాలు కదులుతున్నాయి. అక్రమాలకు పాల్పడి.. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని కీలక పోస్టుల్లో కొనసాగుతున్నవారిని బదిలీచేస్తూ కలెక్టర్ యోగితారాణా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని అధికారుల పనితీరు, వారిపై ఉన్న ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని బదిలీవేటు వేసినట్టు తెలుస్తున్నది. కలెక్టరేట్‌తోపాటు జిల్లాలో పని చేస్తున్న ఏడుగురు తహసీల్దార్లు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను పలు స్థానాలకు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఎన్ రాధికా రమణి	డిప్యూటీ కలెక్టర్ (లాండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్)	ఏవో, కలెక్టరేట్ (అదనపు బాధ్యతలు)
ఎండీ జహీరుద్దీన్	ఏవో కలెక్టరేట్	యూఎల్‌సీలో తహసీల్దార్
ఎంవీవీ ప్రసాదరావు	తహసీల్దార్, యూఎల్‌సీ	సూపరింటెండెంట్, కలెక్టరేట్
కేవీవీ సీతారాం	సీసీ- కలెక్టర్ -తహసీల్దార్ ల్యాండ్ ప్రొటెక్షన్	యూఎల్‌సీలో తహసీల్దార్
బాలశంకర్	తహసీల్దార్ -యూఎల్‌సీ	సూపరింటెండెంట్ -గ్రీవెన్స్ సెల్ కలెక్టరేట్
ఎన్ అనురాధబాయి	బీ-సెక్షన్ సూపరింటెండెంట్ - కలెక్టరేట్	సీసీ - కలెక్టర్
ఆర్ విజయలక్ష్మి	ఆర్-సెక్షన్ సూపరింటెండెంట్	బీ-సెక్షన్ సూపరింటెండెంట్
గిరిజ	డిప్యూటీ తహసీల్దార్ గోల్కొండ	ఆర్-సెక్షన్ సూపరింటెండెంట్
శ్రీమతి మాధవరెడ్డి	తహసీల్దార్ - యూఎల్‌సీ	కలెక్టరేట్ - కేఆర్‌సీ తహసీల్దార్
జూనియర్ అసిస్టెంట్లు		
టీ రాజు	ఈ- సెక్షన్	సీసీ-2 కలెక్టర్
జీ సచిన్	ఆర్-2 సెక్షన్	ఈ- సెక్షన్
ఎస్ సాయిరాం	యూఎల్‌సీ విభాగం	ఆర్-2 సెక్షన్
డీ నాగరాజు	ఎస్టేట్ ఆఫీస్ హైదరాబాద్	యూఎల్‌సీ విభాగం
ఏడీ రమేశ్	రికార్డ్ సెక్షన్- కలెక్టరేట్	ఎస్టేట్ ఆఫీస్ హైదరాబాద్

'నమస్తే తెలంగాణ' కథనంతోనే కదలిక..

'కలెక్టరేట్‌లో అక్రమార్కుల తిష్ట'.. శీర్షికన గత ఆదివారం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ తీవ్రంగా స్పందించినట్టు తెలిసింది. కొంత మంది అక్రమార్కులను రక్షించడంలో భాగంగా కీలకమైన ఫైల్ మాయం కావడాన్ని కలెక్టర్ యోగితారాణా సీరియస్‌గా పరిగణించి బదిలీవేటు వేసినట్టు రెవెన్యూలో ప్రచారం జరుగుతున్నది. ఏండ్లుగా అక్రమార్కులకు వత్తాసు పలుకడం.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆమె బాధ్యులపై చర్యలు తీసుకున్నట్టు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే ఇదే అంశంపై జిల్లా కలెక్టర్ ఆరా తీయడంతోపాటు ఫైల్‌ను వెతుకాలంటూ 'ఏ' సెక్షన్ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. అయినా సదరు ఫైల్ దొరుకకపోవడం గమనార్హం. దీనికి బాధ్యులుగా ఉన్న మరికొంత మందిని త్వరలోనే బదిలీచేసే అవకాశాలున్నట్టు జిల్లాలో ప్రచారం సాగుతున్నది.



వక్కల వినాయకుడు

సుమారు ఆరు వేల వక్కలతో తయారయిన ఈ గణనాథుడి రూపం అందరినీ ఆకర్షిస్తున్నది. నగరంలోని సోమాజిగూడకు చెందిన కే రామ్మూర్తి (లల్లు) అనే భక్తుడు, కళాకారుడు వీ శ్రీనివాస్‌రావు సహాయంతో ఈ విగ్రహాన్ని తొమ్మిది అడుగుల ఎత్తు తయారు చేసి రాజ్‌భవన్ రోడ్‌లో ప్రతిష్ఠించారు. సుమారు 20 అరటి చెట్లను ముక్కలుగా కోసి వినాయకుడి రూపాన్ని చేశారు. అనంతరం పట్టువస్త్రాలను అలంకరించి దానిపై కాగితాన్ని చుట్టారు. మరో వస్త్రాన్ని ఆ కాగితంపై చుట్టి తుది రూపం ఇచ్చారు. తర్వాత ఆ వస్త్రంపై వక్కలను అంటించి విఘ్నేశ్వరుడిని రూపొందించారు. - ఖైరతాబాద్

20 సెకండ్లలో నిమజ్జనం

క్రేన్ హుక్కుల్లో క్యూఆర్‌డీ టెక్నాలజీ వినియోగం.. మూడో రోజు నిమజ్జనంలో ట్రయల్ రన్ సక్సెస్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది వినాయక నిమజ్జనం సందర్భంగా అన్ని విగ్రహాలను అనుకున్న సమయానికే గంగ ఒడికి చేర్చేందుకు నగర పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసుల కృషితో హుస్సేన్‌సాగర్ వద్దకు విగ్రహాల తరలింపు వేగంగా సాగుతున్నది. అయితే ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో వినియోగిస్తున్న క్రేన్ల దగ్గర సమయం పడుతుండడంతో నిమజ్జనం ఆలస్యం అవుతున్నది. ఈ సమస్యను అధిగమించేందుకు హైదరాబాద్ పోలీసులు రెండేండ్లుగా ప్రయత్నిస్తూ.. ఈ ఏడాది పరిష్కార మార్గం కనుగొన్నారు. క్రేన్లకు అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన హుక్కుల(కొక్కేలు)ను ఉపయోగించాలని నిర్ణయించారు. క్విక్ రిలీజ్ డివైస్ (క్యూఆర్‌డీ) టెక్నాలజీతో తయారు చేసిన హుక్కులను వాడనున్నారు. ఈ హుక్కులు 100 టన్నుల బరువును కూడా సునాయాసంగా మోయగలవు. విగ్రహానికి ఈ హుక్కులను బిగించిన తర్వాత నీటిలో నిమజ్జనం చేసి తిరిగి బయటికి రావడానికి 20 సెకండ్లలోపే సమయం పట్టనున్నది. ఆదివారం జరిగిన మూడో రోజు నిమజ్జనం సందర్భంగా సెంట్రల్‌జోన్ డీసీపీ జోయెల్ డేవిస్ నేతృత్వంలో ట్యాంక్‌బండ్‌పై క్యూఆర్‌డీ టెక్నాలజీ ట్రయల్ రన్ నిర్వహించారు. కొన్ని క్రేన్లకు ఈ హుక్కులను బిగించి ఒక్కో విగ్రహాన్ని గరిష్ఠంగా 20 సెకండ్లలోపే నిమజ్జనం పూర్తి చేశారు. చివరి రోజు భారీగా వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలి వస్తుండడంతో హుస్సేన్‌సాగర్‌పై ఏర్పాటు చేసే క్రేన్లలో 20 నుంచి 25 క్రేన్లకు క్యూఆర్‌డీ హుక్కులను ఉపయోగించాలని నిర్ణయించారు. ట్రయల్ రన్‌లో 6 నుంచి 10 సెకండ్లలోపే నిమజ్జనం జరిగిందని, కొన్ని సందర్భాల్లో సమయం 20 సెకండ్ల వరకు ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు.

సగటున 5 నిమిషాలు

సాధారణ క్రేన్లతో ఒక్కో విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు 3 నుంచి 7 నిమిషాల సమయం పడుతున్నది. దీంతో ఒక్కో క్రేన్ వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ఆఖరి రోజు హుస్సేన్‌సాగర్‌కు దాదాపు 8 వేల విగ్రహాలు తరలి వస్తాయని అంచనా. నిమజ్జనానికి 25 క్రేన్లను ఉపయోగిస్తారు. పదివేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తూ వేగంగా నిమజ్జనం చేసేందుకు శ్రమిస్తుంటారు. వారు ఎంత ప్రయత్నించినా క్రేన్ల వద్ద ఒక్కో వాహనం సగటున 5 నిమిషాల పాటు ఆగాల్సిన పరిస్థితి. ఈ సమయాన్ని తగ్గించగలిగితే ఒకే రోజు నిమజ్జనాన్ని పూర్తి చేయవచ్చని పోలీసులు భావించారు. రెండేండ్లుగా పలు రకాలైన ప్రత్యమ్నాయాలను పరిశీలించారు. చివరకు మెకానికల్ ఇంజినీర్ టీ మురళీధర్ తయారుచేసిన క్యూఆర్‌డీ హుక్కులను వాడడంతో సత్ఫలితాలు వచ్చాయి. దీంతో 20 క్రేన్లకు ఈ హుక్కులను ఏర్పాటు చేసే బాధ్యతను మురళీధర్‌కు అప్పగించారు. పోలీసుల ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతం అయితే అర్ధరాత్రి లోపే వినాయక నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. పోలీసులు, ఇతర విభాగాల సిబ్బంది రెండు రోజుల పాటు కష్టపడే అవసరం తప్పనున్నది. అయితే ఆఖరు రోజు విగ్రహాలను తరలించే కార్యక్రమం చాలా ఆలస్యంగా ప్రారంభమై అర్ధరాత్రి హుస్సేన్‌సాగర్‌కు చేరుతున్నాయి. ఈ సమయాన్ని తగ్గిస్తే క్యూఆర్‌డీ హుక్కుల సాయంతో వేగంగా నిమజ్జనం పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

ట్రయల్ రన్ విజయవంతం



విగ్రహాన్ని వాహనం పైనుంచి నీటిలో వదిలే సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు క్యూఆర్‌డీ టెక్నాలజీతో తయారుచేసిన హుక్కులను ఉపయోగించనున్నాం. ఇందులో ఇరిగేషన్ శాఖ సహకారాన్ని తీసుకుంటున్నాం. కొత్త హుక్కులతో విగ్రహాన్ని నీటిలో వదిలి క్రేన్ పైకి రావడానికి 20 సెకండ్లలోపే పడుతున్నది. ట్యాంక్‌బండ్‌పై ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. ఆఖరు రోజు ఈ టెక్నాలజీని ఉపయోగిస్తాం.

- జోయెల్ డేవిస్, సెంట్రల్ జోన్ డీసీపీ

అడ్వకేట్ సవరణ బిల్లుపై ఆందోళనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: న్యాయవాద వృత్తిపై పలు ఆంక్షలు విధించేలా లా కమిషన్ చేసిన సిఫార్సులను వ్యతిరేకిస్తూ సోమవారం హైకోర్టు ఎదుట న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. న్యాయవాద చట్టానికి సవరణలను ప్రతిపాదించడాన్ని తప్పుపడుతూ అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) తరపున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సవరణ బిల్లుపై తదుపరి చర్యలు చేపట్టబోమని కేంద్రమంత్రి చెప్పారని, కానీ మరోసారి వాటిని ఆచరణలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐలూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది జీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సంక్షేమాధికారిపై కేసు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ బీసీ బాలుర హాస్టల్ సంక్షేమాధికారి బీ నరేందర్‌పై అవినీతి కేసు నమోదు చేయాలని సూచిస్తూ బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జీ అశోక్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి నిరోధక చట్టం-1988 పరిధిలో బీసీ హాస్టల్ సంక్షేమాధికారిపై కేసు నమోదు చేయాలని అందులో పేర్కొన్నారు.

మీరు ఆదేశించినా.. తాళాలు ఇవ్వడం లేదు

- భాగ్యనగర్ టీఎన్జీవోపై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేసిన ఏపీఎన్జీవో
- ఏపీఎన్జీవో చందాలు స్వీకరించడంలేదన్న భాగ్యనగర్ టీఎన్జీవో
- విచారణను ఈ నెల 30కి వాయిదా వేసిన న్యాయస్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నగరంలోని గన్‌ఫౌండ్రీ వద్ద ఉన్న ఏపీఎన్జీవో భవన్‌కు సంబంధించిన తాళాలను భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్ తమకు అప్పగించడం లేదంటూ ఉమ్మడి హైకోర్టులో ఏపీ ఎన్జీవో సంఘం కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేసింది. తాళాలు అప్పగించాలని న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలను తెలంగాణ ఎన్జీవో సంఘం సభ్యులు అమలుచేయడం లేదని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ విచారణ చేపట్టింది. భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవోల సంఘం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తాళం చెవి అప్పగించడానికి తమకు ఇబ్బంది లేదని, కానీ ఏపీఎన్జీవోలో తమ సభ్యుల సంవత్సర చందాలను స్వీకరించడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో సైతం కోర్టు ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఈ వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. సభ్యుల వివరాలు, చెల్లించాల్సిన చందా సొమ్ముపై పూర్తి వివరాలను సమర్పించాలని సూచించింది. విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది.

స్పూఫింగ్ మెయిల్స్‌తో 10 లక్షలు టోకరా

ఇద్దరు వైద్యులను మోసం చేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: 'నా కజిన్ సిస్టర్ దవాఖానలో చేరింది. అత్యవసరంగా డబ్బులు అవసరమున్నాయి. ఏమైనా సహాయం చేయగలరా' అని ఓ లేడీ డాక్టర్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ డాక్టర్‌కు స్పూఫింగ్ మెయిల్ పంపించారు. తోటి డాక్టర్ కష్టాల్లో ఉండడంతో ఆయన బ్యాంకు అకౌంట్‌లో రూ.7 లక్షలు వేశారు. తర్వాత విషయం తెలుసుకొని సీసీఎస్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణ చేపట్టగా స్పూఫింగ్ మెయిల్స్‌తో మోసం చేసినట్టు తేలింది. సైబర్ నేరగాళ్లు ఆ లేడీ డాక్టర్ మెయిల్ ఐడీలో ఒక్క అక్షరాన్ని మార్చి అచ్చం ఆమె అకౌంట్‌లాగానే ఉండేలా కొత్త (స్పూఫింగ్) మెయిల్ ఐడీ సృష్టించినట్టు పోలీసులు గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లో ఉండే న్యూసెన్ హజారే అనే వైద్యుడికి, తనకు తెలిసిన వైద్యురాలు స్వప్న నరేందర్ పేరుతో స్పూఫింగ్ మెయిల్ వచ్చింది. తన దగ్గరి బంధువు దవాఖానలో ఉన్నారని, తన వద్ద ప్రస్తుతం డబ్బు లేదని, సహాయం చేయాలని అందులో ఉన్నది. దీంతో డాక్టర్ హజారే మెయిల్‌లో ఉన్న ఖాతాకు మొదట రూ.50 వేలు బదిలీ చేశారు. తనకు డబ్బులు ముట్టాయని, మరికొంత కావాలని మరో మెయిల్ రావడంతో ఈ నెల 21వ తేదీన రూ.1.5 లక్షలు పంపించారు. ఈ డబ్బు కూడా చేరిందని, శస్త్ర చికిత్స చేసేందుకు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో 24వ తేదీన రూ.5 లక్షలు బదిలీ చేశారు. తర్వాత డాక్టర్ స్వప్నకు ఫోన్ చేసి రోగి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయగా.. అలాంటిదేమీ లేదని ఆమె సమాధానం ఇచ్చారు. దీంతో షాక్‌కు గురైన డాక్టర్ హజారే సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ తెలిపారు. బాధితుడు పంపిన డబ్బు అస్సాంలోని ఖాతాకు బదిలీ అయినట్టు గుర్తించామన్నారు. ఆ ఖాతాలో రూ.5 లక్షలు ఉన్నాయని, వాటిని ఫ్రీజ్ చేయాలని బ్యాంకుకు లేఖ రాశామన్నారు.

మరో వైద్యుడికి రూ.3 లక్షలు..

తార్నాకకు చెందిన వైద్యుడు అజారయ్యకు కెనడాలో ఉన్న తన సోదరి పేరుతో స్పూఫింగ్ మెయిల్ వచ్చింది. తన కొడుకు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని, అత్యవసరంగా డబ్బు పంపాలని అందులో ఉన్నది. దీంతో ఆయన వెంటనే మెయిల్‌లో సూచించిన బ్యాంకు ఖాతాలోకి రూ.3 లక్షలు బదిలీ చేశారు. అనంతరం సోదరికి ఫోన్ చేయగా అసలు విషయం బయటపడింది. వెంటనే ఆయన సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఈ రెండు ఘటనల్లో నైజీరియన్ మోసగాళ్లే సూత్రధారులై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

లాటరీ చీటర్స్ అరెస్ట్

- 'సామ్‌సంగ్ లాటరీ' పేరుతో వ్యాపారికి రూ.30 లక్షలు కుచ్చుటోపీ
- ముగ్గురు నైజీరియన్లు, ఢిల్లీకి చెందిన అనుచరుడి అరెస్ట్



నిందితులు గౌజే ఆరిస్టిడే, ఒక్వరేకు టోచుక్వు, ఒమేకే ఎరిక్ టోచుక్వు, ఆనంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సామ్‌సంగ్ లాటరీలో మీరు రూ.4.5 కోట్లు గెలుచుకున్నారని సైబర్ నేరగాళ్లు పంపిన మెసేజ్‌తో ఓ వ్యాపారి బోల్తాపడ్డారు. సామ్‌సంగ్ లాటరీ ఉన్నదా? లేదా? నిర్ధారించుకోకుండానే ఏకంగా రూ.29.95 లక్షలను వారి ఖాతాల్లో జమచేశారు. మోసం తెలుసుకొని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా.. పోలీసులు ముగ్గురు నైజీరియన్లతోపాటు వారి అనుచరుడిని సోమవారం అరెస్ట్ చేశారు. కూకట్‌పల్లికి చెందిన ఓ వ్యాపారి ఫోన్‌కు 2015 ఏప్రిల్‌లో 'మీరు సామ్‌సంగ్ లాటరీలో రూ.4.5 కోట్లు గెల్చుకున్నారు.. మీ వివరాలను పంపడంతోపాటు కింది ఫోన్ నంబర్‌లో సంప్రదించండి' అంటూ ఓ మెసేజ్ వచ్చింది. ఇంతలోనే ఆ వ్యాపారికి ఓ వ్యక్తి ఫోన్ చేసి తనపేరు ఆశిష్ పాటిల్ అని, ఆర్‌బీఐలో అకౌంట్స్ ఆఫీసర్‌నని చెప్పాడు. మీ లాటరీ సొమ్మును తీసుకునేందుకు ఏటీఎం కార్డును పంపిస్తున్నామని చెప్పి ఓ ఏటీఎం కార్డును పంపారు. ఆ కార్డు ద్వారా వ్యాపారి రూ.500 డ్రా చేశారు. ఆశిష్ పాటిల్ మరోసారి ఫోన్ చేసి ప్రాసెసింగ్ ఫీజు కోసం రూ.2.6 లక్షలు జమ చేయాలని కోరారు. ఇలా నగదును జమ చేయడం మొదలు పెట్టిన వ్యాపారి.. వారి మాటలకు బోల్తాపడి మొత్తం 29.95 లక్షలు సమర్పించుకున్నారు. ఎంతకీ లాటరీ నగదు రాకపోవడంతోపాటు తరుచూ నగదును అడుగుతుండడంతో మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ వ్యాపారికి వచ్చిన మెయిల్స్, ఫోన్‌కాల్స్, నగదు జమ చేసిన బ్యాంకు ఖాతాల చిరునామాలు, ఐపీ అడ్రస్‌లు విశ్లేషించి ఓ ముఠా ఢిల్లీ కేంద్రంగా ఈ మోసానికి పాల్పడినట్టు తేల్చారు. పక్కా ఆధారాలు సేకరించిన నిందితులను గుర్తించారు. సైబర్ క్రైం ఎస్సైలు విజయవర్ధన్, సురేశ్‌కుమార్, మిగతా సిబ్బంది ఈ నెల 23 నుంచి ఢిల్లీలో మాటు వేసి నైజీరియన్ మోసగాళ్లు గౌజే ఆరిస్టిడే అలియాస్ జూబ్బీ, ఒమేకే ఎరిక్ టోచుక్వు, ఒక్వరేకు టోచుక్వు, వారి అనుచరుడు ఆనంద్ నగేసీయాను అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నకిలీ పాస్‌పోర్ట్, పెన్ డ్రైవ్‌లు, సెల్‌ఫోన్లు, డెటా కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు కొంత కాలంగా లాటరీ పేరుతో చాలామందిని మోసం చేశారని పోలీసుల దర్యాప్తులో తేలింది. స్థానిక భాషలో మాట్లాడేందుకు ఆనంద్‌ను తమ అనుచరుడిగా పెట్టుకున్నారు. అతడి ద్వారానే బ్యాంక్ ఖాతాలు తెరిపించి బాధితుల డబ్బు కాజేస్తున్నారు. నైజీరియన్లు ఆనంద్‌కు కమీషన్ ముట్టజెప్తూ మిగతా డబ్బుతో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు.



కాలేజీ ప్యూన్ టూ కార్పొరేటర్

కష్టపడే తత్వానికి ఆమె కేరాఫ్. చిన్ననాటి నుంచి కష్టాలు చుట్టుముట్టినా.. పెద్దయ్యాక భర్త వదిలేసినా భయపడలేదు. కాలేజీలో ప్యూన్‌గా పనిచేసిన ఆమె ఇప్పుడు కార్పొరేటర్‌గా గెలిచింది.

మహారాష్ట్రలోని సోలాపూర్‌లో యంగర్‌వాడి అనే ప్రాంతానికి చెందిన రాజశ్రీ.. ఓ పేద కుటుంబంలో పుట్టింది. ఆర్థిక పరిస్థితులు బాగలేక 9వ తరగతిలోనే చదువు మానేసింది. 15వ ఏట పెండ్లి చేసుకుని 2004లో పూణె వచ్చింది. ఇద్దరు కూతుళ్లు పుట్టిన తర్వాత భర్త ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. కూతుళ్లను చదివించడానికి ఆమె కాలేజీలో ప్యూన్‌గా పనిచేసింది. ఫేస్ పర్ధి అనే తెగకు చెందిన రాజశ్రీ.. ఆ తెగకు చెందిన వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోరాడింది. మహిళా స్వయం సహాయక సంఘాలతో కలిసి పనిచేసి తమ తెగ బాగుకోసం కష్టపడింది. ఈ క్రమంలో 6 నెలల కిందట జరిగిన పూణె మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రాజశ్రీ.. గెలిచింది. దీంతో తాను అనుకున్న ఆశయాలు సాధించేందుకు మంచి అవకాశం దొరికిందని కార్పొరేటర్ రాజశ్రీ అంటున్నది.

చెత్తపై సమరం

ఆ ఇద్దరి పోరాటం చుట్టుపక్కల గ్రామాలను మార్చేసింది. చెత్తపై వారు చేసిన సమరం ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నది. పట్టుదలతో చేస్తే ఏ పనైనా దాసోహం అంటుందని వారు నిరూపించారు.

జర్మనీకి చెందిన మిరియం, ఢిల్లీకి చెందిన ఆరుషి.. వీరిద్దరూ చెత్తపై సమరాన్ని ప్రకటించి బెంగళూరు చుట్టుపక్కల గ్రామాలను సస్యశ్యామలం చేశారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్‌తో ఫిలాసఫీ చదువుతున్న ఆరుషి.. ఎంఏ సోషల్ వర్క్ చేసింది. బెంగళూరులో స్థిరపడిన మిరియం.. తన కూతురు నడుపుతున్న ఓ పాఠశాలలో టీచర్‌గా పాఠాలు బోధిస్తున్న ఆరుషికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయమే వారిని చెత్తపై పోరాటం చేసేదిశగా అడుగులు వేయించింది. వీరిద్దరూ ఓ టీమ్‌గా ఏర్పడి 'ది ఎనానిమస్ ఇండియన్ ఛారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించారు. దీని ద్వారా బెంగళూరు నగర సమీపంలోని గ్రామాల్లో పర్యటించి వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. రెండు గ్రామాలను ఎంచుకుని 450 ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయించి పారిశుధ్య కార్మికులకు అప్పగించేవారు. ఇలా వేరు చేసిన చెత్తను రీసైక్లింగ్ ప్లాంట్లకు పంపి వ్యర్థాలను ఎరువుగా మారుస్తున్నారు.



Life is Beautiful

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
మంగళవారం 29 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM





ఓనమ్.. భోజనం

కేరళ జాతీయ పండుగ 'ఓనమ్'.. రైతులు తాము పండిచిన పంట కోతకు రావడంతో జరుపుకొనే పండుగ ఇది.. మలయాళ పంచాంగం మొదలయ్యేది కూడా ఈ రోజు నుంచే.. పది రోజుల పాటు జరిగే పండుగను ఎంతో ఆనందంగా జరుపుకొంటారు.. కొల్ల వర్షంగా పిలిచే ఈ పండుగకు భారీ విందులు స్పెషల్ ఎట్రాక్షన్.. అందుకే వచ్చేవారం వచ్చే ఈ పండుగకోసం ముందుగానే విందు సిద్ధం చేశాం.. మరి పొరుగింటి పుల్లకూరలను మీరూ రుచిచూడడానికి సిద్ధమేగా!



జి.యాదగిరి
ఎగ్జిక్యూటివ్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్

మల్బరీ పరోటా

కావాల్సినవి :

గోధుమపిండి : 250 గ్రా. , **పాలు :** 50 గ్రా. **నెయ్యి :** ఒక టీస్పూన్, **అరటి పండు :** 1, **కొబ్బరి నూనె :** ఒక టీస్పూన్ **ఉప్పు :** తగినంత

తయారీ :

ఒక గిన్నెలో గోధుమపిండి, పాలు, అరటిపండ్లు, నూనె వేసుకొని బాగా కలుపుకోవాలి. పూరీ పిండిలా కలుపాలి. ఆ తర్వాత చిన్న చిన్న ఉండలు చేసుకొని చపాతీల్లాగా ఒత్తుకోవాలి. ఇప్పుడు పెనం పైన పెట్టి రెండు వైపులా నెయ్యి వేసి కాల్చుకోవాలి. దీన్ని ఏదో ఒక పచ్చడితో లాగించేస్తే యమ టేస్టీగా ఉంటుంది.



చికెన్ స్టీవ్



కావాల్సినవి :

చికెన్ : 200గ్రా., **పాలు :** 200గ్రా., **కాజు పేస్ట్ :** 2 టీస్పూన్స్
కొబ్బరి నూనె : ఒక టీస్పూన్, **వెల్లుల్లి :** అర టీస్పూన్,
మిరియాల పొడి : ఒక కప్పు, **నెయ్యి :** ఒక టీస్పూన్, **కరివేపాకు :** 2 రెమ్మలు **కొత్తిమీర :** ఒక కట్ట
ఉప్పు : తగినంత

తయారీ :

కడాయిలో కొబ్బరి నూనె పోసి వెల్లుల్లి, కరివేపాకు వేసి వేగనివ్వాలి. ఆ తర్వాత పాలు పోసి మరుగనివ్వాలి. పాలు మరిగాక ఉప్పు, మిరియాల పొడి, చికెన్ వేసి మగ్గ పెట్టాలి. అందులో ముందుగా మిక్సీ చేసినా కాజు పేస్ట్ వేసుకోవాలి. కొద్దిసేపు ఉడికించి పైగా కొత్తిమీర, నెయ్యి వేసుకోవాలి. మరికాసేపు ఉంచి దించేయాలి. టేస్టీ చికెన్ స్టీవ్ రెడీ!

మల్బరీ ఫిష్ కర్రీ

కావాల్సినవి :

చేపలు : 200 గ్రా., **పసుపు :** చిటికెడు, **కొబ్బరి నూనె :** ఒక టీస్పూన్, **మిరియాల పొడి :** అర టీస్పూన్, **నెయ్యి :** ఒక టీస్పూన్, **కొత్తిమీర :** ఒక కట్ట, **ఉప్పు :** తగినంత

తయారీ :

చేపలను చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. కడాయిలో నూనె వేసుకొని అందులో నూనె పోసి చేపలను వేయించుకోవాలి. అవి కొద్దిగా వేగాక పసుపు, నీళ్లు పోసి ఉప్పు, మిరియాల పొడి వేసుకొని కొద్దిసేపు మగ్గనివ్వాలి. చివరగా నెయ్యి వేసి దించేయాలి. రుచికరమైన మల్బరీ ఫిష్ కర్రీ మీ ముందుంటుంది.



కోకో అవలి రైస్



కావాల్సినవి :

బియ్యం : 200 గ్రా., **పచ్చికొబ్బరి తురుము :** ఒక టేబుల్‌స్పూన్,
కొబ్బరి నూనె : ఒక టీస్పూన్, **కరివేపాకు :** ఒక కట్ట, **కొత్తిమీర :** ఒక కట్ట
మిరియాల పొడి : ఒక టీస్పూన్, **క్యారెట్ :** 50 గ్రా.
ఆలుగడ్డ : 50 గ్రా.
ఉప్పు : తగినంత

తయారీ :

ముందుగా అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. క్యారెట్, ఆలుగడ్డలను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత కడాయిలో నూనె పోసి క్యారెట్, ఆలుగడ్డ ముక్కలను వేయించుకోవాలి. దీంట్లో కొబ్బరి తురుము కూడా వేసుకోవాలి. కొద్దిగా వేగాక ఉప్పు, కొత్తిమీర, మిరియాల పొడి వేసి కలుపాలి. చివరగా అన్నం వేసి కలిపి కాసేపు ఉంచి దించేయాలి. వేడి వేడిగా తింటే చాలా టేస్టీగా ఉంటుంది.

పరుప్పు వడ

కావాల్సినవి :

శనగపప్పు : 100 గ్రా., **జీలకర్ర :** అర టీస్పూన్, **కొత్తిమీర :** ఒక కట్ట
పుదీనా : ఒక కట్ట, **పచ్చిమిర్చి :** 4, **శనగపిండి :** 50 గ్రా.
నూనె, ఉప్పు : తగినంత

తయారీ :

ముందుగా శనగపప్పు నానబెట్టుకోవాలి. శనగపప్పు మిక్సీలో వేసి మరీ మెత్తగా కాకుండా రుబ్బుకోవాలి. దీంట్లో శనగపిండి, ఉప్పు, జీలకర్ర, కొత్తిమీర, పుదీనా, పచ్చిమిర్చి వేసుకొని బాగా కలుపుకోవాలి. తర్వాత కడాయిలో నూనె పోసుకొని వేడి చేయాలి. శనగపిండితో చేసిన వడలను నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.



బిట్స్ కార్నర్

జుట్టు సమస్యలా?



ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, అపరిశుభ్రత వల్ల జుట్టు ఊడిపోతున్నదా. దీని పరిష్కారం కోసం డాక్టర్ల చుట్టూ తిరుగాల్సిన పనిలేదు. ఇంట్లోని పదార్థాలతో మీరే ట్రీట్‌మెంట్ చేసుకోవచ్చు.

- ఆపిల్ సైడర్ వెనిగర్, సపాల్మెట్లో, టీ ట్రీ ఆయిల్.. ఈ మూడింటినీ కలిపి వేడి చేయాలి. ఆ నూనెను తలకు రాసి కుంకుడుకాయలతో తలస్నానం చేయాలి. ఇలా వారానికో సారి చేస్తుంటే తలలోని బ్యాక్టీరియా తొలగిపోతుంది.
- అలోవెరా జెల్‌లో కొబ్బరి పాలు, వీట్ జర్మ్ ఆయిల్‌ని కలిపి హెయిర్ ప్యాక్ వేసుకోవాలి. ఇది చర్మ రంధ్రాలను తెరుచుకునేలా చేస్తుంది. చుండ్రు నివారిస్తుంది.
- ఆవాలు, మెంతులు, వేపాకులు నీళ్లలో వేసి ఉడికించాలి. ఈ నీటిని వడకట్టి తలస్నానం చేసిన తర్వాత చివరగా ఈ నీళ్లు పోసుకోవాలి. దీనివల్ల తలలో ఇన్‌ఫెక్షన్స్ ఉంటే తగ్గుతాయి.
- బృంగ్‌రాజ్ ఆయిల్ బెస్ట్ హెయిర్ కేర్ ప్రొడక్ట్. దీంట్లో నువ్వుల నూనె, ఆమ్లా ఆయిల్, మందారం నూనెతో కలిపి మాడుకు రాయాలి. దీనివల్ల జుట్టుకు మంచి పోషణ లస్తుంది.

పగటి కలలు ఎలా ఆపాలి?

అడుగండి చెబుతా





డాక్టర్ వీరేందర్
మానసిక నిపుణులు
యూ అండ్ మీ
కౌన్సెలింగ్ సెంటర్
హైదరాబాద్

నా వయసు 17, నేను గుడ్ స్టూడెంట్‌ని. ఇంటర్ సెకండ్ ఈయర్ చదువుతున్నాను. నేను మంచి పొజిషన్‌లో ఉన్నట్లు కలలు వస్తున్నాయి. నా ఇబ్బంది ఏంటంటే, నేను చదివేటప్పుడు కూడా ఆ కలలే గుర్తుకు వచ్చి నా టైమ్ వేస్ట్ అవుతున్నది. నేనేం చేయాలి? చదువుపైనే మనసు ఉండాలంటే మీ సలహా?

- విరించి, వరంగల్

మనిషికి రెండు రకాల కలలు ఉంటాయి. ఒకటి నిద్ర వచ్చినప్పుడు వచ్చే కల. రెండోది నిద్ర రాకుండా చేసే కల. నిద్ర వచ్చినప్పుడు వచ్చే కలలకు ప్రాముఖ్యం లేదు. వాటికి విలువ లేదు. వాటికి స్పందించాల్సిన అవసరమూ లేదు. వాటికి స్పందించడం అంటే నీడకు 'డ్రెస్' తొడుగడం లాంటిది. కాబట్టి నిద్రలో వచ్చే కలలను జస్ట్ ఫన్ లాగా తీసుకోవాలి. వాటికి అర్థాలు వెతుకడం, అది ఏ సమయంలో వచ్చిందో తెలుసుకోవడానికి ట్రై చేయడం టైం వేస్ట్. ఇప్పటికింకా డ్రీమ్స్ మీద పరిశోధనలు చేస్తున్నారు. ఇంకా ఇందు వల్లనే ఫలానా కల వస్తుందని ఇంతవరకు నిరూపితం కాలేదు. కాబట్టి వాటిని వదిలెయ్యి. మన జీవితంలో సాధించే గోల్‌ను కూడా నా స్వప్నం, నా కల అంటూ భావాత్మకంగా చెబుతారు. అది నిజంగా మనిషిని నిరంతరం చురుగా ఉంచుతుంది. ఎంతో స్ఫూర్తిని నింపుతుంది. వేగంగా పనిచేసేందుకు సహాయపడుతుంది. అయితే మనం అనుకున్న కల అప్పుడప్పుడు మనం ఎక్కువగా ఊహించుకోవడం మూలాన అది నెరవేరితే జీవితంలో వచ్చే ఆనందం, గుర్తింపు ముఖ్యంగా మన చుట్టూరా ఉన్న బంధువులు, స్నేహితుల దృష్టిలో నేను గొప్పవాడినౌతాను, వారందరికీ నేను ఒక జవాబు చెబుతాను అనే ఒక ఆత్మన్యూనతా భావం వల్ల అలా అన్పిస్తుంది. నీకోసం ఆ కలను సాకారం చెయ్యడానికి శ్రమించు. చదువుతున్నప్పుడు వచ్చే ఆలోచనలను ఒక పేపరుపై రాయి. రాసిన తరువాత నా చదువు పూర్తయిన తర్వాత నేను ఈ ఆలోచనల గురించి ఆలోచిస్తాను అని నీకు నువ్వే అనుకోవాలి. దాన్ని ఆలో సజెషన్ అంటారు. ఆ విధంగా ఎన్ని ఆలోచనలు వచ్చినా అదే రకంగా రాసి, చదువైపోయిన తరువాత రాసిన ప్రతి ఆలోచనను రేషనలైజ్ చేయాలి. తరువాత ఆ పేపర్‌ను చింపివేసి, 10 నిమిషాలు విశ్రాంతి తీసుకుని, మళ్లీ చదువు కొనసాగించాలి. చదివిన ప్రతిసారీ ఇదే రకంగా చేస్తే చదువుపై ఏకాగ్రత వస్తుంది.

తొలి గిరిజన మహిళా పైలెట్

నాగాలాండ్‌కు చెందిన గిరిజన యువతి సాధించిన ఘనత ఇది.



మణిపూర్‌లోని గిరిజన తెగకు చెందిన అమ్మాయి రొవినై పొమి. సానాపతి జిల్లాలోని పురుల్ రోసోఫిల్ అనే మారుమూల గ్రామంలో పుట్టింది. చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకున్న రొవినై నాగాలాండ్ గిరిజన తెగ నుంచి తొలి మహిళా పైలెట్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా, న్యూ సౌత్‌వేల్‌లోని బసైర్ ఏవియేషన్ కాలేజ్‌లో శిక్షణపొందిన ఆమె ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌లో పైలెట్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. అయితే దురాచారాలకు, సంప్రదాయాలకు నిలయమై, మహిళా సాధికారత సాధించడంలో పూర్తిగా వెనుకబడిన నాగాలాండ్ నుంచి ఆమె ఈ స్థాయికి చేరుకోవడం ఒక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఈ విషయమై అనేక మహిళా సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆఖరుకు ఆర్టికల్ 234(టి) ప్రకారం పౌర సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, అనేక సంప్రదాయ గిరిజన సంస్థలు అడ్డుతగిలాయి. ఇది రాష్ట్రంలో హింసకు దారి తీసింది. అలాంటి పరిస్థితుల మధ్య రొవినై సాధించిన విజయం అక్కడి మహిళలకు కొండంత స్థైర్యాన్ని ఇచ్చింది. ఈ గిరిజన తెగల నుంచి మరెందరో రొవినైలు పుట్టుకు రావాలని, వారి ప్రతిభకు ఆకాశం కూడా హద్దు కాకూడదని అక్కడి మహిళా లోకం కోరుకుంటున్నది. అంతే కాదు రొవినై నుంచి ఎంతో మంది ఆడపిల్లలు స్ఫూర్తిని పొందుతున్నారు.

వాట్సప్!

ట్వీట్

రాహుల్ రవీంద్రన్
@23_rahulr



రాహుల్ రవీంద్ర న్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

105,295



మొత్తానికి ఆనందోబ్రహ్మ సినిమా చూశా. బావుంది. జీవితంలో మొదటిసారిగా నాన్‌స్టాప్‌గా నవ్వేశాను. మంచి కామెడీ సినిమా.

సమ్‌థింగ్ స్పెషల్



అమ్మా.. అమ్మా.. అమ్మా..
నే పసివాణ్ణమ్మా!

కామన్‌మ్యాన్ వాయిస్

మనిషి కమిట్‌మెంట్, మంచితనానికన్నా కట్టూబొట్టుకు, కట్టుకున్న బట్టలకు విలువనిస్తుంది ఈ సమాజం. కట్టుబొట్టుకు కాదు.. కమిట్‌మెంట్‌కు మర్యాద ఇవ్వడం నేర్వాలి ఈ సమాజం!

– Vijay Thadeboina

ప్రతీది రాజకీయం అలుముకున్న ఈ మనుషుల నుంచి ఏమీ కోరుకోవడం లేదు నేను. గుండె మంటను చల్లార్చడానికి చల్లనిచూపు.. చికాకులన్నీ ఎగిరిపోవడానికి చిరునవ్వు.. కన్నీరు ఆగిపోవడానికి చల్లని ఓ కౌగిలింత.. నేనున్నానని భరోసా ఇవ్వడానికి మంచి మిత్రుడుంటే చాలు. వేరే ఏమీ వద్దు.

– Mani Deep

తెలంగాణ సినిమా.. ఊపిరి పీల్చుకో. నీ కొడుకు విజయ్ దేవరకొండ వచ్చాడు!

– Ravi Gorantla

వైరల్ వీడియో



మీరు ఏ రకం ఫ్రెండ్? ఏ జోన్? తెలుసుకున్నారా ఎప్పుడైనా? ఈ జోన్స్ ఏంటి? ఫ్రెండ్స్ రకాలేంటి అని కన్ఫ్యూజన్‌గా ఉందా? అయితే ఓ సారి ఈ వీడియో చూడండి!

Types Of Friend Zone (Guys Vs Girls)|| Hyderabad Diaries

Total views : 79,185+

Published on Aug 25, 2017

షేరింగ్

టాలీవుడ్ టాప్ హీరో ఒకతను కొత్త కారు కొన్నాడు.
దాన్ని తొలిసారిగా తానే డ్రైవ్ చేయాలనుకొని నడుపుతున్నాడు సెంటిమెంట్‌తో!
కొత్త కారు కదా.. జోరుగా హుషారుగా..
స్పీడ్‌గా వెళుతున్నది కారు.
ఇంతలో రెడ్ సిగ్నల్ పడింది.
అయినా ఆపకుండా వెళ్తున్నాడు.
గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ కారును ఆపాడు.
డ్రైవర్ సీట్లో ఉన్న వ్యక్తిని చూసి.. భయంతో ఏసీపీకి ఫోన్ చేశాడు.
'సార్.. సార్.. ఇక్కడ సిగ్నల్ క్రాస్ చేసినందుకు ఓ కారును ఆపాను సార్. అందులో ఓ పెద్ద సారు ఉన్నారు. ఫైన్ రాయాలంటే భయంగా ఉంది సార్' అని దమ్ము తీసుకుంటూ చెప్పాడు.
'ఎవరిదయ్యా అసలు ఆ కారు?' అన్నాడు ఏసీపీ.
'ఏమో సార్.. ఆయన ఎంత పెద్ద తోపో తెలువడం లేదు. ఏకంగా టాలీవుడ్ టాప్ హీరోనే డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. టాలీవుడ్ టాప్ హీరోనే డ్రైవర్‌గా పెట్టుకున్నాడంటే.. ఆయనెంత పెద్దోడో ఏమో సార్' అని వణుక్కుంటూ చెప్పాడు!
ఏసీపీ : హాం... కిందపడి గిలగిలా కొట్టుకున్నాడు!!

ఓ వాట్సప్ మెసేజ్

ద్రోణార్జునులు!



నేడు జాతీయ క్రీడా దినోత్సవం

అర్జునుడి వయస్సు 101. ద్రోణాచార్యుడికి 45 ఏండ్లు. అటుదిటు.. ఇటుదటు. నిజానికి అర్జునుడు వయస్సులో చిన్నవాడు. ఇక్కడ మాత్రం అర్జునుడికి పెద్ద వయస్సు. ద్రోణాచార్యుడిది చిన్నవయస్సు. తెలంగాణ మురిసిపోయే క్రీడా సంపద వీళ్లు. వరంగల్ కోట నుంచి ఎదిగి ఢిల్లీ కోటను మెప్పించిన స్ఫూర్తిదాతలు. అర్జునుడిది మచిలీపట్నమే అయినా ఓరుగల్లు మీద మమకారంతో ఇక్కడే స్థిరపడ్డారు. మరొకరు ఓరుగల్లు బిడ్డే. ఓరుగల్లును 1970లో అర్జున అవార్డు పలుకరిస్తే, 2016లో ద్రోణాచార్య అవార్డు తరలివచ్చింది. వరంగల్ క్రీడాభిరామంలో వీరు ద్రోణార్జునులు. ఒకరు బాల్ బ్యాడ్మింటన్, మరొకరు అథ్లెట్. వారే అర్జున అవార్డు గ్రహీత జమ్మలమడక పిచ్చయ్య, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్. ఓరుగల్లు కీర్తితోరణానికి ఇరువైపులా ఉన్న హంసల వలె క్రీడాయవనికపై మేరునగధీరులు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ద్రోణార్జునుల క్రీడాకుశల సంభాషణల ఝరీ ఇది.

మనసు ఒప్పుకోలే..



నాకు అప్పట్లోనే అకాడమీ పెట్టాలనే ఆలోచన ఉండేది. కానీ ప్రోత్సాహం ఎక్కడ? ఆ మాటకు వస్తే నాకు వచ్చిన ట్రోఫీలను అమ్ముకొని ఇల్లు కొనుక్కున్నా. నేనారోజుల్లో 100–150 మందికి ఉద్యోగాలిప్పిచ్చాను. వాళ్ల దగ్గర అప్పట్లో మనిషికి కనీసం ఐదు వందలు తీసుకున్నా బాగా బతికేవాడినేమో. కానీ మనస్సు ఒప్పుకోవద్దూ.. ఇప్పుడలా కాదు. ఆటగాళ్లకు, ఆడేవాళ్లకు, సత్తా ఉన్నోళ్లకు ప్రోత్సాహం పెరిగింది. సంతోషం.

- జమ్మలమడక పిచ్చయ్య, అర్జున అవార్డు గ్రహీత

ప్రోత్సాహం ఉంటే..



ఒక్కమాటలో చెప్పాలంటే జాతీయ స్థాయిలో ఇచ్చే నగదు పారితోషికం కంటే ఎక్కువ. ప్రభుత్వమే పూనుకొని క్రీడాకారుల్ని ప్రోత్సహిస్తున్న తీరు మామూలుది కాదు. అప్పటి ప్రభుత్వం పిచ్చయ్య చేత ఇప్పటి గోపీచంద్ అకాడమీకి ఇచ్చిన ప్రోత్సాహంలో కనీసం ఒక శాతం ఉన్నా ఆయన తన అనుభవంతో జాతికి వన్నె తెచ్చే వందల మంది క్రీడాకారుల్ని తయారు చేసేవాడు. ఇప్పుడిస్తున్న ప్రోత్సాహంతోపాటు ఫిజికల్ లిటరసీ పెంచేందుకు కృషి చేయాల్సిన అవసరముంది.

- నాగపురి రమేష్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత

జమ్మలమడక పిచ్చయ్య అంటే చాలామందికి తెలియదు. అదే అర్జున పిచ్చయ్య అంటే పరిచయం అక్కర్లేని క్రీడార్జునుడు. వరంగల్ నగరంలోని దేశాయిపేటలో తన ఆటల ద్వారా వచ్చిన ట్రోఫీలు అమ్ముకొని కొన్న చిన్న ఇంటిలో ఉంటున్నాడు. ఆయనను పలుకరించేందుకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్‌ను వెంటబెట్టుకొని ఆయన ఇంటికి వెళితే 101 సంవత్సరాల వయస్సులోనూ తనకు అత్యంత ప్రీతిపాత్రమైన బ్యాట్‌ను విఘ్నేశ్వరుడి ముందు పెట్టి పూజ చేసుకుంటూ కనిపించాడు. ఆయన సుదీర్ఘ క్రీడా జీవితం బ్యాట్‌తో ఎంతలా పెనవేసుకున్నదో చెప్పడానికి వేరే ఉదాహరణలు అవసరం లేదనిపించింది. 1947లో వరంగల్ ఆజం జాహి మిల్లులో ఉద్యోగం కోసం వచ్చి దొరక్కపోయినా తెలంగాణ గడ్డ చూపే ప్రేమతో వరంగల్లోనే స్థిరపడ్డారు. వరంగల్‌కు రాకముందు నుంచే ఏకలవ్య శిష్యుడిగా బాల్‌బ్యాడ్మింటన్ పెద్దలు ఆడుతుంటే చూసి నేర్చుకున్నాడు. 1938 నుంచి దాదాపు 40 సంవత్సరాలు ఏకబిగిన ఆటాడిన క్రీడాకారుడు. 1800 టోర్నమెంట్‌లలో ప్రాతినిధ్యం వహించి తొమ్మిది సార్లు వరుసగా నేషనల్ చాంపియన్‌గా నిలిచాడు. బాల్ బ్యాడ్మింటన్‌లో భీష్మాచార్యుడిగా ఈ క్రీడలో అర్జున అవార్డు (1970) అందుకున్న తొలి క్రీడాకారుడు. ఇప్పటికీ ఆటంటే ప్రాణపదంగా భావిస్తారు. 'ఆటలో గెలుపోటములు సహజం. అదే క్రీడాస్ఫూర్తి. ఒక్కసారి ఓడిపోయినంత మాత్రాన భవిష్యత్ లేదనుకొని తిట్టిపోయడం. ఛీత్కార భావనతో ప్రవర్తించడం మంచిది కాదు' అంటారాయన. తానేనాడు ఏ క్రీడాకారుడి పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదని గర్వంగా చెప్పారు.

ద్రోణాచార్య రమేష్..

నాగపురి రమేష్‌ది హన్మకొండ కాపువాడ. పేదరిక కుటుంబ నేపథ్యం. సీనియర్ క్రీడాకారులు సారంగపాణి, ప్రదీప్ దగ్గర ఆట మెళకువలు నేర్చుకున్నాడు. 1982లో ప్రారంభించిన ఆయన క్రీడా ప్రయాణం అద్వితీయ మలుపులు తిరిగింది. అథ్లెట్‌లో జూనియర్ నేషనల్ చాంపియన్‌గా, ఆలిండియా యూనివర్సిటీ చాంపియన్‌గా నిలిచిన గొప్ప ఆటగాడు. భద్రకాళి గుట్ట దగ్గర ప్రాక్టీస్ చేస్తున్న సందర్భంలో కాలికి చిన్న ఫ్యాక్చరై కుమిలిపోతున్న దశ నుంచి ఫీనిక్స్‌లా లేచారు. తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో (ఎంపీఈడీ) కోర్సు చేసి కొంతకాలం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా చేరారు. ఆ తరువాత 1992లో బెంగుళూర్ ఎన్ఐఎస్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్)లో చేరి అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించడంతో నేరుగా సాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా)లో కోచ్‌గా అవకాశం వచ్చింది. అప్పటి నుంచి ఆయన వెనుదిరిగి చూడలేదు. ప్రఖ్యాత క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, బ్యాట్‌మెంటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, ఇండియన్ హాకీ కెప్టెన్ ముఖేష్, ఇండియన్ క్రికెట్ క్రీడాకారుడు ఎంఎస్‌కే ప్రసాద్ వంటి వారికి ఫిట్‌నెస్ కోచ్‌గా వ్యవహరించారు. జాతీయస్థాయి కోచ్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన రమేష్ ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దారు. అందులో ముఖ్యంగా సత్తిగీత, పువ్వమ్మ, దోబాశ్రీ, మృదుల, సౌజన్య, శంకర్, ద్యుతిచంద్ వంటి క్రీడాకారులను తనదైన శైలిలో ఉత్తమ క్రీడాకారులుగా తయారుచేశారు. డెక్కన్ చార్జర్స్ మొదటి దఫా క్రికెట్ టోర్నీలో పాల్గొనే జట్టుకు, రంజీ క్రికెట్ జట్టుకు, టెన్నిస్ ఇండియన్ జట్టుకు, సిడ్నీ ఒలింపిక్స్‌లో హాకీ ఇండియా జట్టుకు ఫిట్‌నెస్ కోచ్‌గా వ్యవహరించారు. 2002 నుండి 2014వరకు ఇండియన్ అథ్లెటిక్ మహిళల 4x400 రిలే జట్టుకు షియాన్ చాంపియన్ పోటీల్లో వరుసగా స్వర్ణపతకాలు, 2006లో ఆస్ట్రేలియాలో కామన్వెల్త్ పోటీల్లో రజతపతకం, 2010లో ఢిల్లీ కామన్వెల్త్ పోటీల్లో స్వర్ణపతకం అందించడంలో క్రీడాకారులను నిష్ణాతులుగా తీర్చిదిద్దారు. రమేష్ అత్యుత్తమ క్రీడా ప్రయాణానికి మురిసిన భారత ప్రభుత్వం ఆయనను 2016 ద్రోణాచార్య అవార్డుతో గౌరవించింది.

ప్రోత్సాహం లేదు..

'మా కాలంలో ప్రోత్సాహం అంటే ఏమిటో తెలియదు. ఎవరు ప్రోత్సహిస్తారో తెలియదు. ఎక్కడికి వెళ్లాలో తెలియదు. అప్పట్లో బ్యాడ్మింటన్ ఆడేది దేశంలో నాలుగైదు ప్రాంతాలే. తిరుచానపల్లి, కేరళ, బెంగుళూర్, ఆంధ్రా, హైదరాబాద్ అంతే. ఉలెన్ బంతి రెండణాలు. అవి కూడా దొరక్కపోతే సొంతంగా మాకు మేమే బంతి తయారు చేసుకొని ఆడుకునేది. టోర్నమెంట్లకు వెళ్లాలంటే ఇప్పట్లా అప్పుడు స్పాన్సర్లు లేరు. చెప్పుల్లేకుండా ఆటలకు వెళ్లేది. నేను బ్యాడ్మింటన్ మాత్రమే కాదు పుట్‌బాల్ కూడా బాగా ఆడేది. ఐ వాస్ ఏ పూర్ మ్యాన్. ఆఫ్‌కోర్స్ ఇప్పటికీ అదే పరిస్థితి అనుకోండి. నాకు అర్జున అవార్డు వచ్చినప్పుడు ఢిల్లీకి ఫస్ట్‌క్లాస్ టికెట్ ఆఫర్ ఇచ్చారు. నేనొక్కణ్నే వెళితే ఏం బావుంటుందని మా ఆవిడను తీసుకొని థర్డ్‌క్లాస్‌లో ప్రయాణం చేశా. ఆ మాటకు వస్తే నేను ఇప్పటికీ ఏనాడూ ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణం చేయలేదు. ఆ రోజుల్లో నేను నా ఫ్రెండ్ కరీమ్ డబుల్స్ ఆడుతుంటే టికెట్లు పెట్టుకొని మరీ ఆటను చూసేవాళ్లు. డబుల్స్‌లో ఆల్మోస్ట్ టెన్ ఇయర్స్ మేమే టాప్. గ్రౌండ్‌లో రూపాయి బిళ్ల పెట్టినా పిచ్చయ్య గారు కొట్టేస్తారు అని మన దగ్గర మంత్రిగా పనిచేసిన ప్రణయభాస్కర్ బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. కొట్టండి సార్ కొట్టండి. కొడితే రూపాయి మీదే అని తమాషాగా అనేవాడు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆటలోనైనా జీవితంలోనైనా, నేను నమ్మి, ఆచరించిన సిద్ధాంతం ట్రిబుల్ ఏ అండ్ డీ. ట్రిబుల్ ఏ ఫర్, ఎబిలిటీ, అక్యురసీ, ఆంటిస్పేషన్, ట్రిబుల్ డి ఫర్ డిసిప్లిన్, డివోషన్, డెడికేషన్' అంటూ తన క్రీడా ప్రయాణాన్ని గురించి చెప్పారు అర్జున పిచ్చయ్య. ద్రోణాచార్య రమేష్ మాట్లాడుతూ 'పిచ్చయ్యగారి కాలానికి మా కాలానికి చాలా తేడా ఉంది. నిజానికి పిచ్చయ్యను చూసి ఆటల్లో రాణించిన నాలాంటి వాళ్లు ఎంతో మంది ఉన్నారు. వరంగల్ గడ్డకు ఉన్న శక్తి అటువంటిది. తెలంగాణ అంటేనే పోరాట స్ఫూర్తికి, తలవంచని తత్వానికి ప్రతీక. అటువంటి ప్రాంతం నుంచి ఇవ్వాళ ఎంతోమంది క్రీడాకారులు పుట్టుకొస్తున్నారు. ఇప్పుడు పరిస్థితి గతంలాగా లేదు. మొన్న పీవీ సింధూ, సైనా నెహ్వాల్, మిథాలీరాజ్, సానియా మీర్జా వంటి ఎంతోమంది క్రీడాకారులకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నగదు పారితోషికం ప్రకటించి ఇచ్చిన ప్రోత్సాహం మాములుది కాదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2025 నాటికి ప్రపంచంలోనే ఇండియా ఓబెసిటీలో టాప్‌లో ఉంటుందని అధ్యయనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లో కొద్దోగొప్పో క్రీడలకు ఇంకా అక్కడక్కడా ప్రాధాన్యత దొరుకుతుంది. కానీ ప్రైవేట్ విద్యాసంస్థల్లో మరీ అధ్వాన్నంగా ఉంది పరిస్థితి. ఫిజికల్ లిటరసీ పెరగాలె. వయసుకు తగ్గ ఎదుగుదల ప్రతీ మనిషిలో ఉండాలె. ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచిస్తోందనడానికి ప్రతీక గురుకుల పాఠశాలల కాన్సెప్ట్ అని నా అభిప్రాయం. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలంటే కేవలం మందులు, గోళీలు వేస్తే సరిపోదు. మనిషి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటును అందించే దిశగా అడుగులు వేయాలి. అది వ్యాయామవిద్య ద్వారానే సాధ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఎడ్యుకేషన్ కరిక్యులంలో మార్పులు తెచ్చే దిశగా ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయనిపిస్తుంది' అంటూ అంతరంగాన్ని పంచుకున్నారు రమేష్.

చాలా మారింది..

క్రీడాకారులు విపరీతమైన ఒత్తిడికి గురవుతారు. ఆ స్ట్రెస్‌ను పోగొట్టుకునేందుకు కాలానుగుణంగా ఎవరికి తోచిన రీతిలో వారు సంసిద్ధులయ్యారు. అర్జున్‌పిచ్చయ్య చాలా పీలగా ఆటలో రాటుదేలాలంటే అతను రోజూ ఉదయం మూడున్నరకే లేచేవాడట. లేవగానే దాదాపు నాలుగు నుంచి ఆరేడు వందల గుంజీలు తీసేవాడు. గ్రౌండ్‌లో ఆడే సమయంలో ఏకాగ్రత కోసం ఆటకు ముందు భగవద్గీత చదవడం అలవాటు చేసుకున్నాడు. అప్పటి నుంచి (1945) ఇప్పటి దాకా రోజూ క్రమం తప్పకుండా భగవద్గీత చదవటం దినచర్యలో భాగం చేసుకున్నాడు. ధైర్యం కోసం ఆయన కుడి ముంజేయిపై హన్మంతుడి పచ్చబొట్టు పొడిపించుకున్నాడు. అప్పుడు ఇప్పటిలా వ్యక్తిగత కోచ్‌లు, ఫిజికల్ ఫిట్‌నెస్ కోచ్‌లు, మెంటర్ వంటి వాళ్లు లేరు. స్ట్రెస్ తగ్గించుకోవడం కోసం ఇప్పుడు క్రీడాకారుల ముంజేయికి త్రివర్ణ పతాక అశోకచక్రం ఉన్న త్రివర్ణపతాకం బ్యాండ్‌ను వేసుకుంటున్నామని అప్పటికి ఇప్పటికీ ఉన్నతేడాలను ఆ ద్రోణార్జునులు కాలానుగుణంగా వస్తున్న మార్పులను చర్చించుకున్నారు.

- నూర శ్రీనివాస్, ప్రశాంత్

ఫొటోలు : గొట్టె వెంకన్న

హోమియోతో సయాటికాకు చికిత్స



తుంటి నుంచి వెనుక వైపు కాలులోనూ, పిక్కలోనూ విపరీమైన నొప్పి, తిమ్మిరి ఉండడం, కాళ్ల కండరాలు బలహీనంగా ఉండడం, మానసికంగా కూడా అశాంతిగా చికాకుగా ఉండడాన్ని సయాటికా నొప్పిగా సూచిస్తారు. మన శరీరంలోని అన్ని నాడుల్లోకి పొడవైన నాడి సయాటికా నాడి. ఇది నడుములోని వెన్నుపాము నుంచి ప్రారంభమై పిరుదల నుంచి పిక్కలు, పాదాల వరకు ఉంటుంది. ఇది కాళ్లు, పాదాల్లో స్పర్శను గ్రహించడానికి ఉపయోగపడుతుంది. సయాటికా నాడి ప్రయాణించే మార్గంలో నొప్పి రావడాన్ని సయాటికా నొప్పిగా చెప్పవచ్చు. నిజానికి ఇది సమస్య కాదు. మరో సమస్యను తెలియజేసే లక్షణం. వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్ జారిపోవడం వల్ల కలిగే దష్ప్రభావంగా చెప్పుకోవచ్చు. దీనికి సరైన చికిత్స తీసుకుంటే 4–8 వారాల్లో తగ్గిపోతుంది.

లక్షణాలు

లక్షణాలు అందరిలో ఒకేరకంగా ఉండకపోవచ్చు. నొప్పి నడుములో ప్రారంభమై పిరుదులకు అక్కడి నుంచి తొడల్లోకి అక్కడి నుంచి పిక్కల్లోకి ప్రసరించడం సయాటికాలో ప్రధాన లక్షణం. సయాటికా నాడి ప్రయాణించే మార్గం మొత్తం నొప్పిగా అనిపించవచ్చు. ముఖ్యంగా తొడ వెనుక భాగంలోనూ పిక్కల్లోనూ నొప్పి స్పష్టంగా కనిపిస్తుంది. నొప్పి మామూలు నుంచి తీవ్రంగా ఉండవచ్చు. లేదా కేవలం అసౌకర్యంగా ఉండవచ్చు. లేదా షాక్ కొట్టినట్టు కూడా ఉండవచ్చు. దగ్గినపుడు, తుమ్మినపుడు, ఎక్కువ సమయం పాటు కూర్చున్నపుడు నొప్పి ఎక్కువగా ఉండవచ్చు.

- సయాటికా నాడి మీద ఒత్తిడి పడడం వల్ల కాలు తిమ్మిరిగా ఉండవచ్చు. పాదాల్లో స్పర్శ తగ్గిపోవచ్చు.
- చాలా అరుదుగా మల, మూత్ర విసర్జన మీద అదుపు తగ్గిపోవచ్చు. దీన్ని క్వాడా ఈక్విటా సిండ్రోమ్ అంటారు.

కారణాలు

వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్ జారిపోవడం వల్ల డిస్క్‌లో ఉండే జిగురు వంటి పదార్థం వెలుపలికి చొచ్చుకొని వస్తుంది. దీన్ని హర్నిమేషన్ అంటారు. సయాటికా నాడి మీద ఒత్తిడి కలుగడం ప్రధాన కారణం. ఇలా జరిగినపుడు నడుములో గానీ, కాలులో గాని లేదా రెండింటిలోనూ నొప్పి వస్తుంది.

- వెన్నుపూసల మధ్య అనేక నాడుల సముదాయంగా వెన్నుపాము ఉంటుంది. ఈ వెన్నుపాము ప్రయాణించే మార్గం ఏదైనా కారణం చేత ఇరుకుగా మారితే నాడుల మీద ఒత్తిడి పెరుగుతుంది. వెన్ను చివరి భాగంలో ఒత్తిడి పడితే నడుము భాగానికి గాని, కంటి భాగానికి గాని ప్రయాణించే నరాలు దెబ్బతింటాయి.
- సైరిస్ ఫార్మిస్ అనే కండరం సయాటికా నాడి పైన అమరి ఉంటుంది. ఇది నడుము భాగం నుంచి తొడ ఎముక వద్ద అంతమవుతుంది. ఈ కండరంలో ఒత్తిడి పెరిగి కండరం బిగుసుకుపోవడం వల్ల సయాటికా నాడి మీద ఒత్తిడి పెరిగి నడుము నుంచి మొదలై తొడ వరకు విస్తరిస్తుంది. దీనిని సైరిస్ ఫార్మిన్ సిండ్రోమ్ అంటారు. అయితే మోకాళ్ల కంటే కిందకు ప్రసరించదు. ప్రమాదాలు, ఎక్కువ సమయం పాటు కూర్చోవడం సైరిస్ ఫార్మిన్ సిండ్రోమ్ రావడానికి కారణం అవుతాయి.
- వెన్నుపాములోని లోపలి భాగాల్లో వెన్నుపాము కప్పి ఉంచే పొరల్లో గానీ, వెన్ను పూసల మధ్యన గానీ కణతులు ఏర్పడడం వల్ల కూడా సయాటికా నాడి మీద ఒత్తిడి పెరుగుతుంది.

జాగ్రత్తలు

- విశ్రాంతి తీసుకోవాలి.
- పోషకాహారం తీసుకోవాలి.
- నొప్పి నివారించడానికి తేలికపాటి వ్యాయామం చెయ్యాలి.

హోమియోచికిత్స

సయాటికాకు హోమియోపతిలో అద్భుతమైన వైద్యం అందుబాటులో ఉంది. వ్యాధి లక్షణం, వారి మానసిక, శారీరక స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో వైద్యం అందిస్తారు. దీనితో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా చాలా సింపుల్ మందులతో ఎలాంటి ఆహార నియమాలు లేకుండానే ఈ మందులు పని చేస్తాయి. నొప్పి పూర్తిగా తగ్గడానికి చాలా సమయం పడుతుందని అపోహపడుతుంటారు. నిజానికి సయాటికా చాలా త్వరగా నయం అయ్యే సమస్య. ఎంత కాలం చికిత్సకు సమయం పట్టినా ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు.

డాక్టర్ ఎ. ఎం. రెడ్డి
సీనియర్ వైద్యులు
పాజిటివ్ హోమియోపతి
హైదరాబాద్, నిజామాబాద్
హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
903 056 1144
903 056 1177
www.drpositive.in



వంట నూనెల్లో బెస్ట్



ఇది వరకు రోజుల్లో వంట నూనె అంటే కేవలం వంటకు రెండు మూడు స్పూన్ల పరిమాణంలో ఉపయోగించే పదార్థం మాత్రమే. కానీ ఇప్పుడు ఆరోగ్యం మీద దాని ప్రభావానికి సంబంధించిన ప్రాధాన్యత చాలా పెరిగిపోయింది. ఇప్పుడు వంట నూనె శక్తిని, ఆరోగ్యాన్ని అందించే ఒక ముఖ్యమైన పోషకపదార్థం.

ఏ నూనె మంచిది?

ఇతర ఆయిల్స్‌తో పోలిస్తే కేవలం రైస్ బ్రాన్ ఆయిల్‌లో మాత్రమే మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్, శాచురేటెడ్ కొవ్వులు సరైన మోతాదులో ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అమెరిక్ హార్ట్ అసోసియేషన్ వారు నిర్ధారిస్తున్నారు. ఇవి మన శరీరంలో ఎల్‌డీఎల్/హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను సమతులంగా ఉంచుతాయి. ఫలితంగా రక్తనాళాలల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం నివారించబడడం వల్ల అథెరోస్క్లిరోసిస్, దాని వల్ల వచ్చే గుండెపోటు వంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడవచ్చు. యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల కార్డియోవాస్కులార్ ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతుంది.

రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఒరైజనాల్, టోకోట్రైనాల్, టోకోఫిరాల్స్, ఫైటోస్టిరాల్స్, సాల్విన్ అనే యాంటి ఆక్సిడెంట్స్ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను మెరుగు పరుస్తాయి. ఫలితంగా గుండెకు రక్త ప్రసరణ మెరుగ్గా ఉండి తగినంత ఆక్సిజన్ అందుతుంది. ఫిజికల్లీ రిఫైండ్ రైస్‌బ్రాన్ ఆయిల్‌లో 1000 పీపీఎం కంటే ఎక్కువగా ఒరైజనాల్ ఉండడం వల్ల గుండె జబ్బులు నివారించడంలో ముందుంటుంది.

రంగు ముఖ్యం

రంగు తక్కువగా ఉండే వంటనూనె ఆరోగ్యానికి మంచిదనే అపోహ చాలా మందిలో ఉంది. వండిన బ్రౌన్ రైస్ చూడడానికి ఆకర్షణీయంగా ఉండకపోవచ్చు కానీ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే ఫిజికల్లీ రిఫైండ్ రైస్ బ్రాన్ ఆయిల్ ముదురు రంగులో ఉంటుంది. దీనికి కారణం అందులోని ఒరైజనాల్. జపాన్‌లో ఈ నూనె అత్యంత ఆరోగ్యకరమైందిగా గుర్తించి చాలా ఏళ్లుగా దీన్ని ప్రధాన వంటనూనెగా ఉపయోగిస్తున్నారు. మన దేశంలో కూడా ఈ మధ్య వినియోగదారులు ఉత్తమమైన వాటిని ఎంపిక చేసుకుంటున్నారు. మేం కూడా అత్యంత నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నామని ఫ్రీడం ఆయిల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ పి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.

రైస్ బ్రాన్ ఆయిల్ సరైన వంటనూనె అని చెప్పవచ్చు. దీనిలో ఎస్ఎఫ్ఏ, పీయూఎఫ్ఏ, ఎంయూఎఫ్ఏ సమతుల స్థాయిల్లో ఉంటాయి. దీనిలో విటమిన్లు, ఒరైజనాల్ సమృద్ధిగా ఉంది. ఈ నూనె వాడడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యం బావుంటుంది.

డాక్టర్ జి. రమేష్
కన్సల్టెంట్ ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్ట్
యశోద హాస్పిటల్స్

GURUKUL PGT/TGT ENGLISH PAPER -II

LANGUAGE & LITERATURE

1. Choose the incorrect expression.
a. Apples are grown in Kashmir.
b. The Snake was seen going into the hole.
c. The honey is sweet when it is tasted.
d.Vegetables are sell in the market.

2. Which is the correct expression to the following statements ? She was ill. So she could not attended the meeting.
i. If she was ill, she could not attend the meeting.
ii. If she had been well, she could have attended the meeting.
iii. If she had not been ill, she could have attended the meeting.
iv. If she was not ill, she could attended the meeting.
a. Only iii is correct
b. i and ii are correct
c. ii and iii are correct
d. ii, iii and iv are correct

3. Chandu said to Gouthami, "When you have a holiday?" Choose the correct Reported Speech from the following.
a. Chandu asked Gouthami when he had had holiday.
b. Chandu asked Gouthami when she had had a holiday?
c. Chandu asked Gouthami when she had had a holiday.
d. Chandu asked Gouthami when she had a holiday.

4. Which is wrong expression ?
a. Unless you work hard, you won't get job.
b. When Swathi had reached the station, the train had left.
c. When Padmavathi reached the station, the train had left.
d. While Rajini was watching T.V., the power went off.

5. All expressions are correct except
a. If Nehru had not become PM, he would have become great writer.
b. Had Nehru not become PM, he would have become great writer.
c. Mr. Feroz told Ashok to come here.
d. Pratap asked Raghu when he had had lunch.

6. All statements are correct except
a. Srinivas has been dancing since morning.
b. Jeethender has lived here since 2006.
c. Prime Minister comes to Hyderabad tomorrow.
d. Safina has visited the Tajmahal last year.

7. Rishi came in and went out The underlined words are_______
a. Preposition, Preposition
b. Adverb, Preposition
c. Adverb, Adverb
d. Adverb, Preposition

8. Raghavender gave up job. Gangadhar went up and came down The underlined words are used as
a. Preposition, Adverb
b. Adverb, Preposition
c. Adverb, Adverb
d. Adverb, Preposition

9. Prathyusha really need to wrap her brain around the concept before her exam. The underlined expression means
a. Extreme hard work
b. Concentrate on something in an effort to understand
c. Do many different types of tasks
d. Inexperienced

10. Whole of a time means
a. Immature b.Enjoy a lot
c. Watch carefully d. Incorrect

11. All sentences are incorrect except
a. They have played the match for 7 clock.
b. I prefer coffee than tea.
c. He goes to office by walk.
d. She sat beside her friend.

12. He saw ____ stick _____ stick was strong.
a. the, the b. a, a
c. a, the d. the, a

13. i. Kohli is a top class batsmen. ii. Manasa is in class X. The underlined words are called __________
a. Homograph
b. Homophone
c. Homonym d. Syntax

14. Pushpalatha has some knowledge about politics. This sum from chapter X is very difficult. The underlined words are called------
a. Homophone b. Homograph
c. Homonym d. Syntax

15. Choose the coordinating conjunction.
a. hardly b. when
c. since d. yet

16. Venu ekes out lot of reputation
a. lose b. earn
c. harm d. stop

17. Choose the correct question tag. Let's dance, __________?
a. Shan't we b. aren't we
c. shall we d. shall they

18. Choose the reported speech to the following direct speech. Lekhana says, "I went to movie."
a. Lekhana said that she went to movie.
b. Lekhana says that she had gone to movie.
c. Lekhana says that she went to movie.
d. Lekhana says that she had gone to move.

19.The definite article 'the' is used in the following cases expect
a. Before holy books names and historical movements.
b. Before nouns of which there is only one.
c. Before a thing known or already referred to
d. Before proper nouns and name of games.

20. Choose the correct grammatically expression .
a. We must discuss about your plans.
b. She married with a friend of her sister.
c. See you on next Monday.
d. The boss has been ill with flue this week.

21. Hyphens can be used in following cases except
a. Compound verbs beginning with a noun
b. With compound adjectives
c. With compound nouns
d. With primary words

22. Past form of 'lie'
a.lain b. laid
c. lay d. lays

23. 'May' can be used in following cases except
a. Possibility
b. Uncertain intention
c. Permission
d. Logical certainty

24. The Present Perfect Tense can be used in the following cases except
a. In the recent past
b. A past action that has relevance to the present. Repeated actions
c. To express tentative actions

25. How many voyages does Gulliver take ?
a. 4 b. 5 c. 7 d. 2

26. Students brought benches and kept in room. In the word 'benches', 'es' is pronounced as
a. /s/ b. /iz/ c. /z/ d. /id/

27. Swapna booked a ticket for movie. In the word booked, 'ed' is pronounced as
a. /d/ b. /id/ c. /t/ d. /s/

28. Choose the incorrect adverb of position.
a. I would just like to change things a bit.
b. Unfortunately Omkar forgot swimming.
c. I am flying to Agra tomorrow.
d. Pavani quickly ate.

29. All sentences are grammatically incorrect except
a. Now a days, many women involve in politics.
b. The advertisement invites for married couples to apply.
c. Thank you for your invitation to the party.
d. It was kind of you to invite me for your party.

30. All expressions are grammatically correct except
a. His lessons are always very interesting.
b. I am looking forward to meeting you.
c. Narender suggested meeting us outside the cinema.
d. My sister is elder than my brother.

31. Choose the grammatically incorrect sentence.
a. Vinay made them do the work.
b. It is nice to have finished work.
c. Vanitha is considering offering to help the refugees.
d.Snigdha refuses to risking lose so much money.

32. All the sentences are grammatically correct except
a. I drove all the way without to stop.
b. He is keen on riding.
c. Naresh likes his new job, but the driving makes him tired.
d. Ganesh annoyed to find the office closed.

33. Participle can be used in the following cases except
a. Participle + noun
b. an adverb before a noun
c. verb + Participle
d. participle with a suffix

34. Probably he is mistaken means
a. It is likely that he is mistaken.
b. It is not probable that he is mistaken.
c. It is sure that he is not mistaken.
d. It is not possible that he is not mistaken.

35. Identify the grammatically correct sentence.
a. It's getting to summer.
b. It's getting to be summer.
c. It's getting summer.
d. It's getting winter.

36. Between 'journey ' and travel _________
a.Travel is countable but journey is uncountable.
b.Both are uncountable.
c.'Journey' is countable but travel is uncountable.
d.Both are countable.

37. Identify the correct suffix that can be add to 'official' ;
a. –ery b. ---dom
c. ---ity d. ---ary

38. Choose the wrong stress from the following words
a. Am'bitious b. of'ficial
c. zoo'logy d.' civilize

39. A light numerous play full of silly happenings is called __________
a. fiction b. novelette
c. comedy d. farce

40. A decision from which are one cannot go back is called __________
a. irresponsive b. indomitable
c. irrevocable d. inaudible

41. All the following are proverbs except
a. Prevention is better than cure.
b. An empty vessel makes much noise.
c. It takes two to make a quarrel.
d. To be worth its weight in gold.

42. Naveen could not assuage his feelings. Choose the antonym to the underlined word.
a.appease b.placate
c.enrage d.mercy

43. Ganesh bore his misfortune with equanimity Choose the synonym to the underlined word.
a. tremble b. determination
c. boldness d. calmness of mind

44. Identify the figure of speech in the following line : 'I have many mouths to feed!'
a. pun b. oxymoron
c. metaphor d. synecdoche

45. Choose the figure of speech in the following line: 'Youth is full of pleasure, Age is full of care'
a. Oxymoron b. antithesis
c. pun d. metaphor

46. Identify the sentence with the correct marks of punctuation.
a. "Go then, said the ant, "and dance winter away."
b. "Go then said the ant and dance winter away."
c. "Go then", said the ant, "and dance winter away."
d. Go then, said the ant, and dance winter away

47. Choose the grammatically correct sentence
a. Lead is heavier than all other materials
b. I do not know whether he is not innocent.
c. Promises should be keep.
d. I am not sure that I see her tomorrow.

48. Choose the correct question tag.
a. I am well, amn't I ?
b. Machender never comes to school, does he?
c. He never comes to college, doesn't he?
d. Let's do it, shan't we?

49. The phrases 'neither…. nor', 'both…. and', 'not only ….. but also' are…….
a. Conjunctions
b. Subordinating conjunctions
c. Coordinating conjunctions
d. Correlative conjunctions

50. Which type of sentence is the following? 'Do come tomorrow.'
a. Interrogative sentence
b. Imperative sentence
c. Assertive sentence
d. Exclamatory sentence

51. "A tattered coat upon a stick." This is an example of _________
a. Simile b. metaphor
c. Irony d. metonymy

Read the following poem and answer questions (52 to 55)

A Bird came down the Walk –
He did not know I saw –
He bit an Angleworm in halves
And ate the fellow, raw,
And then he drank a Dew
From a convenient Grass-
And then hopped sidewise to the Wall
To let a Beetle pass-
He glanced with rapid eyes
That hurried all around-
They looked like frightened Beads, I thought-
He stirred his Velvet Head
Like one in danger, Cautious,
I offered him a Crumb
And he unrolled his feathers
And rowed him softer home -
Than Oars divide the Ocean,
Too silver for a seam-
Or Butterflies, off Banks of Noon
Leap, plashless as they swim.

52. Is "a convenient Grass" an example of "transferred epithet"?
a. Yes, it is. The "convenience of Grass is transferred from the Bird to the poet who finds grass convenient of access.
b. Yes, it is. The Grass is not 'convenient', but he is transferred from the bird who finds the grass convenient of access.
c. No, it is a regular epithet.
d. No, it is not an epithet in the strict sense.

53. Which of the following is not an example of kinetic imagery?
a. Unrolled his feathers
b. Hopped his sidewise
c. Velvet Head d. Rowed him

54. The poem stages an encounter between :
a. The human and the non human
b. Distrust of the non human about the humans
c. Two old friends.
d. Two old enemies

55. "Like one in danger… " who is in danger?
a. The Bird b. The Poet
c. The Angleworm
d. Frightened Beads

Read the following passage and choose the appropriate option (56-60)

All of us live in society, and are members of a nationality with its own language, tradition historical situation. To what extent are intellectuals servants of these actualities to what extent enemies? The same is true of all intellectuals relationship with institutions (academy, church, professional guild) and with worldly powers, which in our times have co-opted the intelligentsia to an extraordinary degree. Thus in my view the principal duty is the search for relative independence from such pressures. Hence my characterization of the intellectual as an exile and marginal, as amateur, and as the author of a language that tries to speak the truth to power.

56. Name four important sources to which an intellectual is related basically :
a. Society , institution, worldly powers and government
b. Institutions , language, truth and power
c. Nationality, language, tradition, and historical situation
d. Nationality, truth, language and tradition

57. What is meaning of intellectuals being servants?
a. The intellectual may be appropriated by his tradition, historical and other actualities of his nation and society
b. The intellectual may be appropriately co-opted by agencies of the government
c. The intellectual may be sent into exile and made marginal
d. The intellectual may be forced into accepting the unacceptable propositions

58. What are the four important institutions that co-opt an intellectual?
a. Society, institutions, worldly powers and truth
b. Academy, church, professional guild and worldly power
c. Society, truth, professional guild and worldly power
d. Academy, worldly powers, truth and government

59. What is the meaning of 'relative independence'?
a. Liberating oneself from the pressures of government and institutions
b. Liberating oneself from the pressures of religion and state
c. Liberating oneself from the pressures of institutions and worldly powers
d. Liberating oneself from all religious secular pressures

60. What is the duty of an intellectual and how many identities does he acquire to perform his role?
a. To achieve complete independence and be characterized as an exile, marginal and amateur.
b. To achieve complete independence and be characterized as the author of a language.
c. To manoeuvre independence and be characterized as a keeper of his own conscience
d. To search for relative independence and be characterized as an exile, marginal and amateur and author

61. What is the full title of Middlemarch?
a. A study of provincial life
b. A novel without a hero
c. Vanity fair d. The Radical

62. Adam Bede was published in …. ?
a. 1858 b. 1860 c. 1861 d. 1863

63. Which two novels were published in the same year?
a. Oliver Twist, the mill on the Floss
b. Great Expectations, Silas Marner
c. Hard Times , Adam Bede
d. A Tale of Two cities, Silas Marner

64. Thomas Carlyle's Sartor Resartus appeared in …..
a. The London Magazine
b. Frazer's Magazine
c. The Morning Post
d. Gentleman's Magazine

65. Which is not Carlyle's socio-political work?
a. Chartism b. Past and Present
c. Latter – Day pamphlets
d. Life of Schiller

66. Which Carlyle's work is a mixture of autobiography and German mysticism?
a. Sartor Resartus
b. Te French Revolution
c. Past and Present
d. Chartism

67. Sartor Resartus was published in book from in…..
a.1841 b.1838 c.1850 d.1843

68. In Carlyle's Socio-political Writings, he praised ….
a. The Medieval age
b. The Victorian age
c. The Romantic age
d. The Modern age

69. John Ruskin's Modern Painters in ……… Volumes
a. 4 b. 5 c. 6 d. 7

70. Which work extols Gothic and condemns Renaissance architecture?
a. The seven Lamps of Architecture
b. Modern painters
c. The stones of Venice
d. Sesame and lilies

71. John Ruskin's Unto This Last appeared in
a. Cornhill Magazine
b. Frazer's Magazine
c. Gentlemen's Magazine
d. The London magazine

72. Ruskin's Munera Pulveris appeared in ……..
a. Gentlemen's Magazine
b. Cornhill Magazine
c. The London magazine
d. Frazer's Magazine

CHANDRA SHEKAR.P
PGT in English
TSMS - Nandipet, Nizamabad
9550469917



73. Ruskin's The Crown of Wild Olive contains three lectures except
a. War b. Traffic
c. Work d. Jealousy

74. Ruskin's Fors Clavigera is a …
a. Collection of Letters
b. Collection of Tales
c. Collection of Poems
d. Collection of Essays

75. Choose Ruskin's uncompleted autobiography
a. Praeterita
b. Sesame and Lilies
c. Unto This Last
d. Munera Pulveris

76. The rhyme scheme of the Shakespeare sonnet is _____
a. ab ab cd cd ef ef gg
b. ab ab cd dc ef ef gg
c. ab ab cd cd ef ef ee
d. ab bc cd cd ef ef ff

77. Spenser's Amoretti is ______
a. A Sonnet addressed to his wife.
b. A Sonnet written on the death his friend
c. A collections of his love lyrics
d. A collections of love Sonnets

78. How many sonnets were written by Milton?
a. 24 b. 26 c. 20 d. 25

79. How many sonnets were written by Shakespeare?
a. 140 b. 154 c. 160 d. 145

80. Sir Philip Sidney's Astrophel and Stella is a series of ______
a. Essays b. plays
c. sonnets d. novels

81. The Nightingale and the Rose is a story of
a. Love, sacrifice and selfishness
b. Love, sacrifice and self respect
c. Love, sacrifice and selflessness
d. Love, sacrifice and self pity

82. In the story, "How to Live to be 200" , people like Jiggins are said to suffer from ______
a. Over eating b. Health habit
c. Illness d. Health mania

83. In the story, "The Face on the Wall, " the face on the wall resembled the face of _______
a. Mr. Ormond Wall
b. Mr. Boulogne Wall
c. Mr. Great Ormand Wall
d. Mr. Edward Wall

84. In the story, "The Gold Frame " , what fell on the photograph when Datta shook the folds of his dothi?
a. Black enamel paint
b. White enamel paint
c. Pen d. The Frame

85. By what name is Gulliver known in Brobdingnag?
a. Mannikin b. Splacknuck
c. Glumadlalclitch d. Grildrig

86. "'None so credulous as infidels" is an example of _____
a. paradox b. antithesis
c. metonymy d. oxymoron

87. Childe Harold's Pilgrimage is a _
a. Utopian Novel b. fairy tale
c. religious allegory d. long poem

88. Robert Browning's "Rabbi Ben Ezra" is a defense of _____
a. Knowledge against power
b. Power against knowledge
c. Old age against youth
d. Youth against old age

89. Which of these is not a pastoral elegy?
a. Adonais b. Thyrsis
c. In Memoriam d. Lycidas

90. When one line of poetry runs in to the next, with no punctuation to slow the reading, it is a case of _
a. Hyperbole b. Consonance
c. enjambment d. caesura

91. Which of the following is not a characteristic of the Victorian Age?
a. The grow of rural traditions and movement from large cities
b. A romantic focus on home and family.
c. An emphasis on strictly controlled social behaviour.
d. The rise of a highly competitive industrial technology.

92. The opposite of hyperbole is ___
a. Inversion b. synecdoche
c. anagnorisis d. meiosis

93. In Gulliver Travel's Struldbrugs are ______
a.People lured by new ideal
b.People persecuted by pets
c.People exempt from natural death
d.People replete abstract learning

cont.. on vijetha



ప్రణయ్‌రెడ్డి, కేటీఆర్, విజయ్ దేవరకొండ, సందీప్‌రెడ్డి

రాక్‌స్టార్..విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'అర్జున్‌రెడ్డి' చిత్రం సంచలనాల్ని సృష్టిస్తున్నది. ప్రస్తుతం యువతరాన్ని అర్జున్‌రెడ్డి మానియా ఆవహించింది. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా అద్భుతమైన వసూళ్లను రాబడుతున్నది. ఇదిలావుండగా ఈ చిత్రాన్ని ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం హైదరాబాద్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా తన స్పందనను ట్విట్టర్ ద్వారా వ్యక్తం చేశారు. 'వాస్తవికత, సహజత్వం, నిర్భీతి, కదిలించే భావోద్వేగాల మేళవింపుతో నిజాయితీగా తీసిన చిత్రమిది. దర్శకుడు సందీప్‌రెడ్డి, నిర్మాత ప్రణయ్‌రెడ్డికి నా అభినందనలు. విజయ్‌దేవరకొండ..నువ్వొక రాక్‌స్టార్' అంటూ కేటీఆర్ ట్విట్టర్‌లో సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. కేటీఆర్‌తో తీసుకున్న సెల్ఫీని విజయ్ దేవరకొండ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. కేటీఆర్‌తో కలిసి సినిమా చూడటం సంతోషాన్ని కలిగించిందని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు.

సామాన్యుడి యుద్ధం



వివేక్ సాగర్, రానా, నాగచైతన్య, కీరవాణి, సాయి కొర్రపాటి, కృష్ణ, రాజమౌళి

'ఓ సామాన్య యువకుడు తన తెలివితేటలను ఆయుధంగా ఉపయోగించి బలవంతుడైన శత్రువుపై ఎలా గెలుపొందాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. వినూత్న కథాంశంతో దర్శకుడు కృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని తెలిపారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. వారాహి చలన చిత్రం పతాకంపై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. కృష్ణ. ఆర్.వి. మరిముత్తు దర్శకుడు. లావణ్య త్రిపాఠి కథానాయిక. శ్రీకాంత్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. వివేక్ సాగర్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఆదివారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి ఆవిష్కరించారు. తొలి ప్రతిని దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి స్వీకరించారు. నాగ చైతన్య మాట్లాడుతూ 'దర్శకుడు కృష్ణ, నేను చిన్నప్పటి నుంచి కలిసే చదువుకున్నాం. ఇద్దరి పుట్టినతేదీ ఒక్కటే. ఎనిమిదో తరగతిలో ఒకే అమ్మాయిని ప్రేమించాం. అప్పుడా యుద్ధంలో నేను గెలిచాను. దర్శకుడిగా తాను చేస్తున్న ఈ యుద్ధంలో అతడిని గెలుపు వరిస్తుందనే నమ్మకముంది. సెప్టెంబర్ 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నాం' అని తెలిపారు. రాజమౌళి మాట్లాడుతూ 'మా ఆవిడకు ఏ కథ ఓ పట్టాన నచ్చదు. నా సినిమాలు నచ్చకపోయినా నిర్మొహమాటంగా ఆ మాట చెబుతుంది. తను ఈ సినిమా గురించి గొప్పగా మాట్లాడింది. ఆ క్షణమే సినిమా విజయంపై నమ్మకం కలిగింది. ప్రతినాయకుడిగా శ్రీకాంత్ గెటప్ బాగుంది. నాగచైతన్య కథలు ఎంపిక చేసుకునే తీరు బాగుంటుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రానా, వివేక్‌సాగర్, సురేష్‌బాబు, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జున

నవ్య పంథాను అనుసరిస్తూ నిరంతరం సృజనాత్మకంగా ఆలోచిస్తుంటారు నాగార్జున. ప్రయోగాలకు వెరవకుండా నటుడిగా తనని తాను సరికొత్తగా ఆవిష్కరించుకోవాలని తపిస్తుంటారు. అందుకే విలక్షణ పాత్రలకు ప్రతిరూపంగా విరాజిల్లుతున్నారు. 31ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రయాణంలో చిరస్మరణీయ విజయాలతో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'రాజుగారి గది-2' త్వరలో ప్రేక్షకులముందుకురానుంది. నేడు నాగార్జున జన్మదినం. ఈ సందర్భంగా ఆయన సోమవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు.

చైతూ పెళ్లికి నేను అతిథినే..!

మీ కెరీర్‌లో తొలిసారి హారర్ కామెడీ సినిమా చేయడం ఎలా అనిపించింది?

• రాజుగారి గది-2 సినిమాలో హారర్, కామెడీతో పాటు థ్రిల్లింగ్ అంశాలుంటాయి. నేను హారర్ సినిమాల్ని ఇష్టపడతాను. అయితే 'ఎక్సార్సిస్ట్' తరహా భయానక సినిమాలు నచ్చవు. కామెడీ మేళవింపుతో కొద్ది మోతాదు హారర్ వున్న సినిమాల్ని ఇష్టపడతాను. ఇక 'రాజుగారి గది-2' చిత్రంలో నేను పోషించే పాత్రలో పెద్దగా కామెడీ వుండదు. ఈ సినిమాలో వెన్నెల కిషోర్, ప్రవీణ్, అశ్విన్ ఆద్యంతం హాస్యాన్ని పంచుతారు. గతంలో వచ్చిన హారర్ కామెడీ సినిమాలకు భిన్నంగా సాగే చిత్రమిది.

కాలేజీ రోజుల్లో హారర్ సినిమాల్ని చూస్తే భయపడేవాడినని ఈ మధ్య ఓ ఇంటర్వ్యూలో చెప్పారు..?

• అవును. శబ్దాలు వినిపించకుండా చెవులు మూసుకొని హారర్ సినిమాల్ని చూసేవాడిని. ఇప్పుడు కూడా ఒక్కోసారి అలానే చేస్తుంటాను (నవ్వుతూ).

ఈ సినిమాను 'రాజుగారి గది' చిత్రానికి సీక్వెల్ అనుకోవచ్చా? ఇందులో మీరు మెంటలిస్ట్ పాత్రలో కనిపిస్తారని అంటున్నారు?

• 'రాజుగారి గది'తో..ఈ సినిమాకు ఎలాంటి సంబంధం వుండదు. రెండు కథలు పూర్తి విభిన్నమైనవి. 'రాజుగారి గది' చిత్రం ప్రేక్షకుల్లో మంచి పాపులారిటీ సంపాదించుకుంది కాబట్టి అదే టైటిల్‌ను తీసుకున్నాం. ఇక ఈ సినిమాలో నేను మెంటలిస్ట్ పాత్రలో కనిపిస్తాను. మెంటలిస్ట్‌లు ఎదుటివారి ఆలోచనల్ని పసిగట్టే ప్రత్యేకమైన మనోశక్తులు కలిగివుంటారు. మన మనసులో వున్న ఎలాంటి విషయాన్నైనా ఇట్టే కనిపెడతారు. అంతమాత్రాన వాళ్లు మ్యాజిక్ ఏమీ చేయరు. ఇతరుల కంటే వారికి పరిశీలనా శక్తి ఎక్కువగా వుంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా మెంటలిస్ట్‌లలో మిర్రర్ మెమరీ అనే స్పెషల్ టాలెంట్ కనిపిస్తుంది. ఇరవైఏళ్ల క్రితం జరిగిన సంఘటనల్ని కూడా సంబంధిత వ్యక్తుల నుంచి రాబడతారు. నేను కొందరు మెంటలిస్ట్‌లను కలిసి వారి అనుభవాల్ని తెలుసుకున్నాను. ఇలాంటి ఇంట్రస్టింగ్ పాత్రను చేయడం కొత్తగా అనిపించింది. ఈ సినిమాలో సమంత ఆత్మ పాత్రలో కనిపిస్తుంది. మా ఇద్దరి మధ్యే కథ మొత్తం నడుస్తుంది.

మీరు వ్యక్తిగతంగా దయ్యాలు, అతీత శక్తుల్ని నమ్ముతారా?

• మనుషులు, దేవుడు వున్నప్పుడు అలాంటి శక్తులు కూడా వున్నాయేమో అనిపిస్తుంటుంది. దేవుడు కూడా మనకు తెలియని విషయమే కదా. తప్పకుండా ఈ సృష్టిలో ఏదో తెలియని శక్తులు వున్నాయనుకుంటాను.

అఖిల్ నటిస్తున్న 'హలో' సినిమా ప్రచారాన్ని వినూత్న రీతిలో చేపడుతున్నారు. ఈ సినిమాపై మీ అంచనాలు ఎలా వున్నాయి?

• దర్శకుడు విక్రమ్‌కుమార్ సినిమాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రచారంలో కూడా కొత్త పంథాను ఎంచుకున్నాడు. ఆయన క్రియేటివ్ డైరెక్టర్. సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాడు. టైటిల్ బాగుందని ప్రశంసలొస్తున్నాయి. ఈ సినిమా టైటిల్ లోగో విడుదల సందర్భంగా ప్రచార చిత్రాన్ని సరికొత్త రీతిలో డిజైన్ చేశాం. ప్రముఖ హీరోలతో హలో చెప్పించడంతో పాటు చివరగా నాన్నగారి సినిమా క్లిప్పింగ్‌ను చూపిస్తూ ఆయన హలో అంటూ పలకరించడాన్ని చూపించాం. వాస్తవానికి ఆ ప్రచార చిత్రంలో తొలుత దివంగత ఎన్టీఆర్ హలో చెబుతున్నట్లుగా మొదలుపెట్టి...నాన్నగారితో ముగించాలనుకున్నాం. ఆ టైమ్‌లో మాకు ఎన్టీఆర్‌గారు హలో చెబుతున్న సినిమా క్లిప్పింగ్స్ లభించలేదు. కాబట్టి తారక్ (జూనియర్ ఎన్టీఆర్)తో హలో చెప్పించాం.

ఇంతకి సినిమాకు 'హలో' టైటిల్‌ను పెట్టడానికి కారణమేమిటి?

• తను ప్రేమించిన అమ్మాయి దగ్గరి నుంచి హలో అనే పలకరింపు కోసం హీరో నిరీక్షిస్తుంటాడు. అందుకే ఆ టైటిల్ పెట్టాం. ఈ సినిమా టైటిల్ కోసం చిత్ర బృందం ఆరు నెలలుగా ఆలోచిస్తున్నది. చివరకు నేనే టైటిల్‌ను సూచించాను. సాధారణంగా నాకు ఉదయం ఆరుగంటల సమయంలో మంచి ఆలోచనలు వస్తాయి. అప్పుడే ఎక్సర్‌సైజ్ చేసి వుంటాను కాబట్టి మైండ్ ఫ్రెష్‌గా వుంటుంది (నవ్వుతూ). ఆ టైమ్‌లో ఈ టైటిల్ తట్టింది. వెంటనే సుప్రియ (మేనకోడలు)కు ఫోన్ చేసి టైటిల్‌ను రిజిస్టర్ చేయించమన్నాను.

ఈ ఏడాది తెలుగులో మంచి సినిమాలొస్తున్నాయి. ఈ విజయాల్ని మీరు ఎలా విశ్లేషిస్తారు?

• ఈ ఏడాది చాలా సినిమాలు కమర్షియల్‌గా సక్సెస్ అయ్యాయి. వాటిలో 'ఫిదా' సినిమా నాకు బాగా నచ్చింది. శేఖర్ కమ్ముల ప్రతిభావంతుడైన దర్శకుడు. గతంలో ఎన్నో హిట్స్ అందించారు. సింపుల్ ఎమోషన్స్‌ను ఆయన తెరపై అందంగా, అర్థవంతంగా ఆవిష్కరిస్తుంటారు. 'ఫిదా' సినిమాలో దర్శకుడిగా శేఖర్ పనితనంతో పాటు సాయి పల్లవి నటన బాగా నచ్చింది.

ఈ ఏడాది బాలీవుడ్ కంటే తెలుగులోనే సక్సెస్ రేట్ ఎక్కువగా వుందని చెబుతున్నారు?

• 'బాహుబలి' విజయం వల్ల తెలుగులో సక్సెస్‌రేట్ పెరిగిందంటున్నారు. నా దృష్టిలో 'బాహుబలి' ఓ ఫినామినన్. లక్షల్లో ఒక సినిమా ఆ స్థాయిలో విజయాన్ని అందుకుంటుంది. అలాంటి సినిమాలు ఎప్పుడో ఒకసారి వస్తుంటాయి. ప్రతి రోజు అలాంటి సినిమాలు వస్తాయని ఆశించవొద్దు. 'బాహుబలి' కోసం దాదాపు ఐదేళ్లు శ్రమించారు. రాజమౌళిగారి కుటుంబం మొత్తం సినిమాలో ఇన్‌వాల్వ్ అయింది. అంకితభావంతో పనిచేశారు కాబట్టే అంతటి ఘనవిజయాన్ని సొంతం చేసుకున్నారు.

మలయాళంలో తెరకెక్కించనున్న మహాభారతంలో కర్ణుడి పాత్ర కోసం మిమ్మల్ని సంప్రదించారని తెలిసింది?

• కర్ణుడు పాత్ర చేయమని నన్ను అడిగారు. ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఆ సినిమాలోని వివిధ పాత్రల కోసం దేశంలోని ప్రముఖ నటుల్ని సంప్రదిస్తున్నారు. అయితే ఆ సినిమా ఎప్పుడు మొదలవుతుందనే విషయంలో ఇంకా ఎవరికి స్పష్టత రాలేదు.

ప్రస్తుతం అగ్రహీరోలు ఆలిండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని తమ సినిమాల్ని ప్లాన్ చేసుకుంటున్నారు. చిరంజీవిగారి 'సైరా'లో వివిధ భాషల అగ్రనటులు కనిపించబోతున్నారు. భవిష్యత్తులో మీరు ఆ తరహాలో సినిమా చేసే ఆలోచన వుందా?

• మంచి కథ దొరికితే దేశవ్యాప్తంగా మార్కెట్ చేసుకునే సినిమా చేయాలని వుంది. ప్రస్తుతానికైతే అలాంటి అవకాశాలు లేవు. చిరంజీవిగారి 'సైరా' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చూశాను. నాకు బాగా నచ్చింది.

ఈసారి పుట్టిన రోజు వేడుకల్ని ఎక్కడ ప్లాన్ చేస్తున్నారు?

• ఇంకా ఏమీ అనుకోలేదు. ఇవాళో, రేపో ఎటో వెళ్లిపోతా (నవ్వుతూ). ఇంటికి వెళ్లిన తర్వాత పిల్లలతో డిస్కస్ చేసి ఎటు వెళ్లాలో నిర్ణయించుకుంటా.

నాగచైతన్య తాజా చిత్రం 'యుద్ధం శరణం' ఎలా వుండబోతుంది?

• ఓ కొత్త జోనర్‌లో తెరకెక్కిస్తున్న చిత్రమది. మైండ్‌గేమ్ నేపథ్యంలో కథ సాగుతుంది. హింసకు దూరంగా సోషల్‌మీడియాను వాడుకొని శత్రువుపై ఎలా విజయం సాధించాడనే కాన్సెప్ట్‌తో రూపొందించిన చిత్రమది. మంచిపని కోసం ఉపయోగిస్తే సోషల్‌మీడియా సామాన్యుడికి ఓ ఆయుధంలా పనిచేస్తుందనే సందేశం వుంటుంది.

నాగచైతన్య పెళ్లి పనులు ఎప్పుడు మొదలుపెట్టబోతున్నారు...?

• చైతూ పెళ్లికి నేను అతిథినే. అంతా పిల్లలే చూసుకుంటామని చెప్పారు. నన్ను చెక్ మీద సంతకం పెట్టమన్నారంతే (నవ్వుతూ). పెళ్లి గోవాలో అక్టోబర్ 6న జరుగుతుంది. వివాహ ఘట్టాన్ని సింపుల్‌గానే నిర్వహిస్తాం. ఆ తర్వాత రిసెప్షన్ కోసం భారీగా ప్లాన్ చేస్తున్నాము. హిందు, క్రిస్టియన్ రెండు సంప్రదాయరీతుల్లో పెళ్లి జరుగుతుంది.

మీ సుదీర్ఘ నట ప్రస్థానాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది. ఏ విషయంలోనైనా అసంతృప్తికి గురయిన సందర్భాలున్నాయా?

• భగవంతుడి ఆశీస్సులతో అంతా మంచే జరిగింది. ఏ విషయంలోనూ బాధపడలేదు. తప్పులు చేసినా...వాటి నుంచి పాఠాల్ని నేర్చుకుంటూ ప్రయాణాన్ని సాగిస్తున్నాను.

పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

• నిరాశలో వున్నప్పుడు అభిమానుల మాటలే నాలో స్ఫూర్తినింపుతాయి. వయసులో ఎంతో పెద్దవారైన నాన్నగారి అభిమానులు కొందరు ఇప్పటికి నాతో మాట్లాడుతుంటారు. నాన్నగారు వున్నప్పుడు అభిమానులు ఆయనకు ప్రతి సంవత్సరం ఆవకాయ పచ్చళ్లు, తినుబండారాలు, స్వీట్లు పంపించేవాళ్లు. నాన్నగారు లేరు కాబట్టి ఇప్పుడు అవన్నీ నా దగ్గరకు వస్తున్నాయి (నవ్వుతూ). అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాల్ని ఓ వరంలా భావిస్తాను.





పూరిజగన్నాథ్, మోహన్‌బాబు, ఆనంద్‌ప్రసాద్, బాలకృష్ణ

పూరితో నా కెమిస్ట్రీ బాగా కుదిరింది



శ్రియ

'ఓ మంచి సినిమా చేసిన తర్వాత మళ్లీ ఎలాంటి కథను ఎంచుకోవాలనేది ప్రతి నటుడికి ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఇమేజ్ పట్టింపులు అడ్డుగా నిలుస్తాయి. కానీ నేను మాత్రం అలాంటి సవాళ్లను పట్టించుకోను. దర్శకుడు పూరి జగన్నాథ్‌తో సినిమా చేయాలని చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. ఈ సినిమాతో మా కలయిక కుదిరింది' అని అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'పైసా వసూల్'. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనంద్‌ప్రసాద్ నిర్మిస్తున్నారు. పూరి జగన్నాథ్ దర్శకుడు. శ్రియ, ముస్కాన్, కైరాదత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్ర ఆడియో విజయోత్సవ వేడుకను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'నాన్న ఎన్టీఆర్ అందించిన ధైర్యం, ఆవేశం, స్ఫూర్తితోనే కెరీర్‌లో భిన్న నేపథ్యాలతో కూడిన సినిమాలు చేస్తున్నాను. 'గౌతమిపుత్రశాతకర్ణి'ని 79 రోజుల్లో చిత్రీకరిస్తే ఈసినిమాను మాత్రం 78 రోజుల్లోనే పూర్తిచేశాం. పరిశ్రమపై ఆధారపడి చాలా మంది బతుకుతున్నారు. అందుకే వేగంగా సినిమాలు చేస్తున్నాను. దర్శకుడు పూరి జగన్నాథ్ నిరంతరం సినిమాల గురించే ఆలోచిస్తారు. మంచి సినిమాలు చేయాలని తపిస్తుంటారు. అతడితో నా కెమిస్ట్రీ బాగా కుదిరింది. తొలుత సెప్టెంబర్ 29న సినిమాను విడుదల చేయాలని అనుకున్నాం. ఐదు వారాల ముందుగానే సెప్టెంబర్ 1న ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. ఈ సినిమాకు ముందు 'రైతు' చేయాలని అనుకున్నాను. కుదరలేదు. అలాగే నాన్నగారి జీవిత కథపై చర్చలు జరుగుతున్నాయి' అని తెలిపారు. మోహన్‌బాబు మాట్లాడుతూ 'బాలయ్య రికార్డుల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన సినిమాలు సిల్వర్ జూబ్లీలు, గోల్డెన్ జూబ్లీలు జరుపుకున్నాయి. గొప్ప నటుడిగా, తండ్రికి తగ్గ తనయుడిగా నిరూపించుకున్నారు. కథలు, పాత్రల పరంగా ప్రతి సినిమాలో వైవిధ్యతను చాటుకునేందుకు తాపత్రయపడుతుంటారు. పూరిజగన్నాథ్ అంటే నాకు చాలా ఇష్టం. సినిమాల్ని వేగంగా తెరకెక్కిస్తుంటారు' అని తెలిపారు. 'బాలయ్యతో ఇన్నాళ్లు సినిమా చేయడం కదురకపోవడంతో ఆయన్ని మిస్సయ్యాను. ఇప్పుడు షూటింగ్ పూర్తయ్యాక మళ్లీ మిస్సవుతున్నాను. క్రమశిక్షణ, అంకిత భావం కలిగిన అలాంటి హీరోను ఇప్పటి వరకూ చూడలేదు' అని పూరి జగన్నాథ్ చెప్పారు.ఈ కార్యక్రమంలో ఛార్మి, ఆనంద్‌ప్రసాద్, కైరాదత్, గేయరచయితలు పులగం చిన్నారాయణ , భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.



గోపీచంద్, అనుఇమ్మాన్యుయేల్

సాహసమే ఒక ఆట

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఆక్సిజన్'. ఏ.ఎం. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ సాయిరామ్ క్రియేషన్స్ పతాకంపై ఎస్. ఐశ్వర్య నిర్మిస్తున్నారు. రాశిఖన్నా, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలు. అక్టోబర్ 12న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. నిర్మాత చిత్ర విశేషాల్ని తెలియజేస్తూ 'సాహసమే ఊపిరిగా బతికే ఓ ధైర్యవంతుడైన యువకుడి కథ ఇది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. గోపీచంద్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. ముంబాయి, గోవా, సిక్కింతో పాటు పలు అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపాం. దర్శకుడు జ్యోతికృష్ణ కొత్త పంథాలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. గోపీచంద్ నటన, యువన్‌శంకర్ రాజా బాణీలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో ఆడియోను విడుదల చేస్తాం' అని తెలిపారు. జగపతిబాబు, కిక్‌శ్యామ్, అలీ, చంద్రమోహన్, నాగినీడు, బ్రహ్మాజీ, అభిమన్యుసింగ్, అమిత్, ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెట్రి, ఛోటా కె. నాయుడు, ఎడిటింగ్: ఎస్.బి. ఉద్ధవ్, సంగీతం: యువన్ శంకర్ రాజా.



రాజ్ బాల, దిలీప్

తొంగి తొంగి చూడమాకు చందమామ

దిలీప్, శ్రావణి, రాజ్‌బాల, కార్తిక్, అపర్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తొంగితొంగి చూడమాకు చందమామ'. హరి వల్లభ ఆర్ట్స్ పతాకంపై ఏ.ఎం. రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆనంద్ కానుమోలు దర్శకుడు. తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు మాట్లాడుతూ 'నవ్యమైన ప్రేమకథతో తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రేమను వ్యక్తీకరించే క్రమంలో ఓ జంటకు ఎదురైన అనుభవాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. వినోదానికి ప్రాధాన్యముంటుంది. బొబ్బిలిలోని టీపీ కళాశాలలో తొలి షెడ్యూల్‌ను చిత్రీకరించాం. సెప్టెంబర్ తొలి వారం నుంచి హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ ప్రారంభిస్తాం. డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. బస్‌స్టాప్ సాయి, జబర్దస్త్ అప్పారావు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీనివాస్ విన్నకోట, సంగీతం: హరి గౌర, మాటలు: తిరుమల నాగ్.

వాలుజడ సోయగం

'కబాలి' చిత్రంలో రజనీకాంత్ కూతురుగా నటించిన సాయిధన్సిక ప్రధాన పాత్రలో తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం రూపొందుతుంది. తమిళంలో 'కులలి' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తెలుగులో 'వాలుజడ' అనే టైటిల్‌ని నిర్ణయించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల ఫస్ట్‌లుక్‌ను కథానాయిక కాజల్ విడుదల చేసింది. తమిళ దర్శకులు చేరన్, గౌతమ్‌మీనన్, విక్రమ్‌కుమార్‌ల వద్ద శిష్యరికం చేసిన రమణ మల్లం ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సింహ వాహిని చలనచిత్ర పతాకంపై సింహ వాహిని నాగరాజు ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన చిత్ర విశేషాలను తెలియజేస్తూ 'ధన్సిక పాత్ర చిత్రానికి హైలైట్‌గా వుంటుంది. ఆమె వైవిధ్యమైన పాత్ర అందరికి కొత్త అనుభూతినిస్తుంది. శరణం గచ్ఛామి, జానకిరాముడు చిత్రాల్లో నటించిన నవీన్ సంజయ్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటి వరకు యాభై శాతం షూటింగ్ పూర్తయింది. కీలక పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు నానా పటేకర్ నటిస్తున్నారు' అని తెలిపారు. యోగికత్రి, గౌతమ్‌కుమార్ , రైతుబిడ్డ నితిన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్దార్థ్ రామస్వామి, ఎడిటర్: ప్రవీణ్, సంగీతం: రధన్.



ధన్సిక

టెక్స్‌టైల్ పార్కు టెండర్లకు రంగం సిద్ధం

పీపీపీ పద్ధతిలో సీఈటీపీ ప్లాంటు.. మౌలిక సదుపాయాల కల్పనకు వేగంగా ఏర్పాట్లుచేస్తున్న టీఎస్ఐఐసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మెగా టెక్స్‌టైల్ పార్కులో మౌలిక సదుపాయాల కల్పనకు టీఎస్ఐఐసీ వేగంగా ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే ప్రహరీ గోడ నిర్మాణం మొదలు కాగా మిగిలిన పనులకు టెండర్లు పిలువడానికి సిద్ధమైంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టడానికి దక్షిణ కొరియా దేశానికి చెందిన కంపెనీల ప్రతినిధులు ఆసక్తి కనపర్చారు. స్వయంగా వచ్చి పార్కు స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. వీరితో పాటుగా ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ పార్కులో నీటి వసతి, విద్యుత్, భూమి చదును చేయడం లాంటి పనులు చేయాలని నిర్ణయించారు. వీటి కోసం ప్రభుత్వం తొలి విడుతగా రూ.50కోట్లు మంజూరు చేసింది. పార్కు కోసం సేకరించిన దాదాపు 1100 ఎకరాల భూమిలో ప్రధాన రహదారులు, తాగునీరు, కంపెనీలకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం దేవాదుల నుంచి వచ్చే నీటిని వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తూ జీవో విడుదలైంది. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని పైపులైన్ ద్వారా తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (సీఈటీపీ) నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ పనులు చేయడానికి ఎనిమిది కంపెనీలు ఆసక్తి కనబర్చినట్లు సమాచారం. బిల్ట్ ఆపరేట్ విధానంలో పనులు చేయనున్నారు. సీఈటీపీని వినియోగించుకునే కంపెనీల నుంచి యూజర్ చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించారు. వీటికి అవసరమైన సమగ్ర అంచనాలను సిద్ధం చేస్తున్నారు. టెండర్ల పిలుపు అనంతరం పనులు వేగంగా జరిగే విధంగా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని నిర్ణయించారు. టెక్స్‌టైల్ పార్కుకు ఈనెల 16న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసే కార్యక్రమం చివరి నిమిషంలో వాయిదా పడింది. త్వరలో మరో తేదీ నిర్ణయించే అవకాశం ఉందని, ఆలోగా వీలైనన్ని పనులు చేయాలని అధికారులు కృషి చేస్తున్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు అవసరమైన రాయితీలు, ప్రోత్సాహకాలకు సంబంధించిన ఉత్తర్వులు ఇటీవలే విడుదలయ్యాయి. ఇక మౌలిక సదుపాయాలు కల్పించగానే పెట్టుబడులు పెట్టడానికి మరింతమంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

కోఠి 'ఈఎన్టీ' వ్యవస్థాపక వైద్యుడు బద్రీనారాయణరావు కన్నుమూత

దవాఖాన మొదటి సూపరింటెండెంట్‌గా సేవలు.. 20వ శతాబ్దపు విశిష్టవ్యక్తిగా కేంబ్రిడ్జి పురస్కారం



సుల్తాన్‌బజార్: హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్టీ ప్రభుత్వ దవాఖాన వ్యవస్థాపకుడు, మొదటి సూపరింటెండెంట్, ప్రముఖ వైద్యుడు అక్కినేపల్లి బద్రీనారాయణరావు (ఏబీఎన్ రావు) కన్నుమూశారు. ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ ఆయన తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కోఠి ఈఎన్టీ దవాఖానలో చెవి, ముక్కు, గొంతు వ్యాధిగ్రస్తులకు ఆయన విశేష సేవలు అందించారు. ఉస్మానియా యూనివర్సిటీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా, సరోజినిదేవి కంటి దవాఖాన సూపరిటెండెంట్‌గా కూడా సేవలు అందించారు. 1996లో డార్విన్ సిటిజన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇంగ్లాండ్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జి బయోలాజికల్ కేంద్రం నుంచి 20వ శతాబ్దాపు విశిష్ఠ వ్యక్తి పురస్కారం పొందారు. 1962లో కోఠి ఈఎన్టీ దవాఖాన ప్రారంభమైనప్పుడు మొదటి సూపరింటెండెంట్, ప్రత్యేక అధికారిగా ఏబీఎన్ రావు వ్యవహరించారు. వైద్యశాల అభివృద్ధికి విశేష కృషిచేశారు. ఆరేండ్లపాటు సూపరింటెండెంట్‌గా ఆయన పనిచేసిన కాలంలోనే దవాఖాన పలురకాలుగా అభివృద్ధి చెందినట్టు డాక్టర్ ఏబీఎన్ రావు సహచరులు తెలిపారు. కాలక్రమంలో ఎఫ్ఆర్‌సీఎస్ పూర్తిచేసిన ఆయన ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో స్థిరపడ్డారు.



సోమవారం హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధలో టీఎస్‌పీఈఏ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఏపీ సర్కారు తీరును నిరసిస్తూ మహాధర్నా

- విద్యుత్‌సౌధలో టీఎస్‌పీఈఏ ప్రతినిధుల ఆందోళన
- విద్యుత్ ఉద్యోగులకు పోస్టింగ్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్ సర్కారు తీరును నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ)సోమవారం విద్యుత్ సౌధలో మహాధర్నా చేపట్టింది. ఏపీ సర్కారు, అక్కడి విద్యుత్ సంస్థలు కోర్టులను ఆశ్రయించి విద్యుత్ ఉద్యోగుల విభజనకు అడ్డుపడడంపై టీఎస్‌పీఈఏ, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు జీ సంపత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలో 2015 జూన్‌లో రిలీవ్ చేసిన 1,253 మంది ఏపీ స్థానికత కలిగిన ఉద్యోగులకు ఇప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదని, రెండున్నరేండ్లుగా జీతాలు చెల్లిస్తుండటంతో రాష్ట్ర విద్యుత్ సంస్థలకు నష్టం వాటిల్లుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీ ఉద్యోగులు, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలపై కోర్టుకు వెళ్లడం తగదన్నారు. విద్యుత్ ఉద్యోగుల విభజనను వేగవంతం చేయాలని కోరుతూ టీఎస్‌జెన్‌కో, టీఎస్‌ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు టీఎస్‌పీఈఏ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. మహాధర్నాలో టీఎస్‌పీఈఏ ప్రధాన కార్యదర్శి పీ రత్నాకర్‌రావు, సహాయ అధ్యక్షుడు మంగీలాల్, అదనపు కార్యదర్శి కిరణ్‌కుమార్, నాలుగు విద్యుత్ సంస్థల అధ్యక్ష, కార్యదర్శులు సామ్యానాయక్, తిరుమలరావు, జనప్రియ, శ్రీనివాస రెడ్డి, సదానందం, తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ ప్రతినిధులు తులసీరాణి, అంజయ్య, తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ, ఓసీ, బీసీ, ఉద్యోగుల అసోసియేషన్, బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మహిళా ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, టీజీవో అధ్యక్షురాలు మమత తదితరులు

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

సీపీఎస్ విధానంపై ఉద్యోగ సంఘాల జేఏసీ ఫైర్

సుల్తాన్‌బజార్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్నదని తెలంగాణ ప్రభుత్వ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో టీజీవో అధ్యక్షురాలు, ఉద్యోగసంఘాల జేఏసీ సెక్రటరీ జనరల్ మమత, ఇతర ప్రతినిధులతో కలిసి నిరసన కార్యక్రమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుచేయాలని రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకోసం బుధవారం ప్రభుత్వ ఉద్యోగులందరూ మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు చేపట్టాలని కోరారు. 2004 సెప్టెంబర్ ఒకటిన సీపీఎస్‌ను అమలులోకి తెచ్చినందున, ఆ రోజును బ్లాక్‌డేగా పరిగణిస్తూ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, టీజీవో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామినేని శ్రీనివాసరావు, నాయకులు జూపల్లి నర్సింగరావు, శివశంకర్, మధుసూదన్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, యూసుపుద్దీన్, రాజమహేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ప్రతాప్, నిరంజన్‌రెడ్డి, శైలజ, కొండల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బేగ్, మామాడి ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మిక సంఘాలతో చర్చలు సఫలం

- సమ్మె యోచనను విరమించుకున్న కార్మికులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మున్సిపల్ కార్మిక సంఘాలతో పురపాలకశాఖ కార్యదర్శి జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో కార్మికులు సమ్మె ఆలోచనను విరమించుకున్నారు. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు సమ్మె చేయాలని మున్సిపల్ కార్మిక సంఘాలు తొలుత నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో సోమవారం సచివాలయంలో కార్మిక సంఘాలతో పురపాలకశాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ చర్చించారు. కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ క్రమం తప్పకుండా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, పెండింగులో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేస్తామని మిట్టల్ పేర్కొన్నారు. రెండు పడక గదుల ఇండ్ల మంజూరు, మధ్యవర్తుల విధానం తొలగింపు, కార్మికుల జీతాలు బ్యాంకుల ద్వారా చెల్లించడంపై హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించిన నవీన్ మిట్టల్‌కు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. సమావేశంలో ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్ఎంఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వచ్చేనెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడానికి పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేస్తున్నది. ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ఎంపిక కమిటీ ఈ మేరకు తయారుచేసింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించాలా! లేదా అన్న అంశంపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

హైకోర్టుకు పూర్తిస్థాయి సీజేను నియమించండి

- సుప్రీంకోర్టు సీజేకు సీనియర్ న్యాయవాదుల లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టుకు పూరిస్థాయి ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల 12 మంది సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్‌మిశ్రాకు విజ్ఞప్తిచేశారు. సోమవారం ఆయనకు లేఖ రాశారు. హైకోర్టులో ఖాళీ జడ్జి పోస్టులను తక్షణం భర్తీచేయాలని కోరారు. 61 మంది జడ్జి పోస్టులకు ప్రస్తుతం 27 మంది న్యాయమూర్తులు మాత్రమే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. 60% పోస్టుల ఖాళీలతో కేసుల విచారణ మందకొడిగా సాగుతున్నదన్నారు.

మన పోలీసులు..
వ్యూహాల్లో మెరికలు



టాక్టిక్స్ శిక్షణలో పోలీసులు

ఇజ్రాయెల్ యుద్ధవిద్యలోనూ మెళకువలు.. మరింత సమర్థంగా తెలంగాణ పోలీస్

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా తర్ఫీదు.. పోలీసుల్లో మనోస్థైర్యం నింపుతున్న ప్రత్యేక కోర్సు

అన్నిజిల్లాల్లో శిక్షణ ఇచ్చేలా సన్నాహాలు.. సైబరాబాద్ కమిషనరేట్‌లో ఇప్పటికే పూర్తయిన శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కత్తిమీద సాములాంటివి పోలీస్ సిబ్బంది విధులు. క్షేత్రస్థాయిలోని పోలీసులకు అన్నివేళలా అప్రమత్తత, చతురత, వ్యూహ రచన, యుద్ధ కుశలత అవసరం. లేనిపక్షంలో భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. గతేడాది సూర్యాపేట బస్‌స్టాండ్‌లో ఉగ్రవాది కాల్పుల్లో హోంగార్డ్ మహేశ్, కానిస్టేబుల్ లింగయ్య చనిపోయారు. జానకిపురంలో ఎస్సై సిద్ధయ్య కూడా ఇలాగే అమరుడయ్యారు. శామీర్‌పేటలో నకిలీ నోట్లు సరఫరా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొనే క్రమంలో నిందితుడు కత్తితో దాడిచేయడంతో కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు చనిపోగా, ఎస్సై వెంకట్‌రెడ్డికి గాయాలయ్యాయి.. ఈ ఘటనలన్నింటిలోనూ పోలీసు సిబ్బంది చిన్నపాటి మెళకువలు పాటిస్తే ప్రాణాలు కోల్పోకుండా, చిన్నగాయం కాకుండా నిందితులను సునాయాసంగా ఎదుర్కొనే అవకాశం ఉండేది. ఇకపై అన్ని సందర్భాల్లో ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఎలాంటి వ్యూహాలు పన్నాలి, అసాంఘికశక్తులను ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాల్లో క్షేత్రస్థాయి పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర పోలీస్‌శాఖ. పరిస్థితులకు అనుగుణంగా.. చురుకుగా, మరింత సమర్థంగా, నేర్పుగా వ్యవహరించడానికి అవససరమైన వ్యూహాలపై శిక్షణ (టాక్టిక్స్ ట్రైనింగ్) ఇవ్వడం ప్రారంభించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రప్రథమంగా మన రాష్ట్ర పోలీసులకు ఈ శిక్షణ ఇస్తున్నారు. క్రావ్‌మాగా వంటి ఇజ్రాయెల్ యుద్ధవిద్యలో మెళకువలను స్థానిక పోలీసు విధులకు అన్వయిస్తూ అనేక అంశాలను జోడించి ఈ శిక్షణను 'డిఫెన్సివ్ పోలీస్ టాక్టిక్స్ కోర్సు'గా రూపొందించారు. దీనిని క్షేత్రస్థాయిలో ఉండే కానిస్టేబుల్, ఎస్ఐ స్థాయి ఉద్యోగులకు రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇవ్వాలనే డీజీపీ అనురాగ్‌శర్మ ఆదేశాలతో దశలవారీగా టాక్టిక్స్ శిక్షణకు పోలీసు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇస్తున్న ప్రాధాన్యంతో పోలీసు ఉన్నతాధికారులు మరింత ఉత్సాహంగా నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 400 మంది సిబ్బందికి ఈ శిక్షణ ఇచ్చారు. మిగిలిన జిల్లాల్లో టీవోటీ (ట్రైనింగ్‌ఆఫ్ ట్రైనీ) శిక్షణ ముమ్మరంగా సాగుతున్నది. మరికొన్ని జిల్లాల్లో ఇప్పటికే శిక్షణ పొందిన టీవోటీలతో క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

ఐటీ కంపెనీల సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ

ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సిబ్బంది పరిరక్షణకు, ముఖ్యంగా మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ)లో సభ్యత్వం పొందిన సెక్యూరిటీ సిబ్బంది 200 మందికి టాక్టిక్స్‌పై శిక్షణ ఇచ్చామని ఎస్సీఎస్సీ జనరల్ సెక్రటరీ భరణికుమార్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఐటీ కంపెనీల్లో మొత్తం సెక్యూరిటీ ఏజెన్సీల్లో కలిపి 10 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, రాత్రిసమయాల్లో విధి నిర్వహణకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

డిఫెన్సివ్ పోలీస్ ట్యాక్టిక్స్ కోర్సు ఎలా వచ్చిందంటే.. అడవిలో పోలీసు వ్యూహాలు జంగిల్ వార్‌ఫేట్ టాక్టిక్స్, పట్టణప్రాంతాల్లో అనుసరించే పద్ధతులు అర్బన్ పోలీస్ టాక్టిక్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. కానీ, స్థానిక పోలీసు సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎలాంటి నియంత్రణా విధానాలు లేవు. సూర్యాపేట ఎన్‌కౌంటర్ తర్వాత అప్పటి గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న స్టీఫెన్ రవీంద్ర ఈ ప్రత్యేక శిక్షణపై యోచించారు. తర్వాత అది టాక్టిక్స్ ట్రైనింగ్ కార్యరూపం దాల్చింది. తొలిసారిగా టాక్టికల్ ట్రైనింగ్‌ను 2016 నవంబర్‌లో సైబరాబాద్ పరిధిలో కమిషనర్ సందీప్‌శాండిల్య సారథ్యంలో అప్పటి జాయింట్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో సైబరాబాద్ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి చెందిన 12 మంది కానిస్టేబుల్స్, ఒక ఆర్‌ఎస్సైకి 60 రోజులపాటు ఇచ్చారు. డజను మందితో మొదలైన ఈ శిక్షణను క్రమంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 36 పోలీస్‌స్టేషన్లలో కలిపి సివిల్, ఏఆర్, సీసీఎస్, ఎస్‌వోటీ, ట్రాఫిక్, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ విభాగాల్లోని 400 మంది సిబ్బందిని 13 బ్యాచ్‌లుగా విభజించి ఇచ్చారు. లోకల్ టాక్టిక్స్ విధినిర్వహణలో ఏవిధంగా అమలుచేస్తారనే విషయంపై డీజీపీ అనురాగ్ శర్మ, ఇతర ఉన్నతాధికారుల ముందు ప్రదర్శనను మే 5న ఇచ్చారు. ఈ శిక్షణ చూసిన డీజీపీ సిబ్బందిని అభినందించి, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా పోలీసులకు ఇవ్వాలని సూచించారు. అలా టాక్టిక్స్ ట్రైనింగ్‌కు 'డిఫెన్సివ్ పోలీస్ టాక్టిక్స్ కోర్సు'గా దీనికి నామకరణం చేశారు.

దశలవారీగా శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఎస్సై, కానిస్టేబుల్ స్థాయి సిబ్బందికి 'డిఫెన్సివ్ పోలీస్ టాక్టిక్స్ కోర్సు'లో శిక్షణ ఇస్తున్నారు. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్న35 ఏండ్లలోపు వారు ఈ శిక్షణకు అర్హులుగా నిర్ణయించారు. ఐజీపీ ట్రైనింగ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని పోలీసు విభాగాన్ని రెండుభాగాలుగా చేసి పోలీస్ కమిషనరేట్లు, జిల్లా పోలీసు విభాగాలను టీవోటీ-01, టీవోటీ-02గా విభజించి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. వీరికి సెప్టెంబర్ ఏడు నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. అర్హులైన కానిస్టేబుళ్లు, ఎస్సై స్థాయి అధికారులందరికీ అన్ని జిల్లాల్లోఈ ఏడాది డిసెంబర్ వరకు శిక్షణ పూర్తి చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ట్రైనింగ్‌లో ఉన్న 10వేల మంది కొత్త కానిస్టేబుళ్లకు సైతం 'డిఫెన్సివ్ పోలీస్ టాక్టిక్స్ కోర్సు'ను ఒక సబ్జెక్ట్‌గా పెట్టనున్నారు. వీరికి డిసెంబర్ రెండోవారంలో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి.

పోలీసులకు నేర్పే మెళకువలు ఇవీ..

ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు టాక్టిక్స్‌లో శిక్షణ ఉంటుంది. ప్రధానంగా క్రావ్‌మాగా మెళకులు నేర్పుతున్నారు. ఇంట్లో అనుమానితుడు ఉంటే అనుసరించాల్సిన వ్యూహాలు, వారిని అదుపు చేయడం, సాయుధుడిని ఎదుర్కోవడం, రివాల్వర్‌ను కుడివైపు పెట్టుకోవడం, రాత్రివేళ సోదాలు, డ్రంక్‌అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీల్లో చూపాల్సిన చతురత, వీవీఐపీ, వీఐపీ భద్రత, బాంబు పేలుళ్ల సమయంలో స్పందించాల్సి తీరు, జనసంచార ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకొనే సమర్థతపై శిక్షణ ఇస్తున్నారున్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందికి చాలా అవసరం



టాక్టికల్ ట్రైనింగ్‌లో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాం. ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు, మానసికంగా మరింత ధృడంగా అవుతాం. క్షేత్రస్థాయిలో పనిచేసే మేము నిత్యం ఏదో ఒక సందర్భంలో ఈ మెళకువలు వాడుతాం. పౌర హక్కులకు భంగం వాటిల్లకుండా మా విధులను ఎలా నిర్వర్తించాలో మరింత లోతుగా తెలిసింది.

- పీ నరేందర్‌రెడ్డి, ఎస్సై, సైబరాబాద్

అకస్మాత్తుగా జరిగే దాడులనూ ఎదుర్కోవచ్చు



కొన్ని సందర్భాల్లో అగంతకులు అకస్మాత్తుగా మనపై దాడికి పాల్పడతారు. అలాంటి ఏ సందర్భం ఎదురైనా వెంటనే మనమూ అంతేస్థాయిలో తిప్పికొట్టే శక్తి ఈ శిక్షణతో మరింత పెరుగుతుంది. ఉగ్రదాడులు, బాంబు పేలుళ్ల వంటి ఘటనల్లోనూ ప్రజలకు కాపాడడంలోనూ ఈ మెళకువలు ఎంతో ఉపయోగపడతాయి.

- శ్రీనివాస్, కానిస్టేబుల్, గ్రేహౌండ్స్

మానసిక స్థైర్యం పెరిగింది



విధి నిర్వహణలో తరచూ తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేలా మానసిక స్థైర్యం పెరిగింది. ఒక్కరే ఉన్నా నలుగురిని ఎలా చిన్నచిన్న ట్రిక్స్‌తో ఎదుర్కోవచ్చో నేర్చుకున్నాం. ప్రజలకు రక్షణ కల్పించడం అదే సమయంలో మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి ఇందులో నేర్పారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో సిబ్బందికి టాక్టిక్స్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

- శ్రీనివాస్, ఎస్సై, ఎస్బీ, నల్లగొండ

శశికళ బహిష్కరణకు సన్నాహాలు

12న అన్నాడీఎంకే విస్తృతస్థాయి సమావేశం ■ ఈపీఎస్-ఓపీఎస్ గ్రూపు సమావేశంలో తీర్మానం

జయాటీవీ, ఎంజీఆర్ పత్రిక స్వాధీనానికి చర్యలు ■ సమావేశానికి 40 మంది ఎమ్మెల్యేల డుమ్మా!



తమిళనాడు సీఎం పళనిస్వామి, డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం

చెన్నై: ఇటీవల విలీనమైన అధికార అన్నాడీఎంకేలోని సీఎం పళనిస్వామి(ఈపీఎస్), డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం(ఓపీఎస్) వర్గాల సంయుక్త గ్రూపు పార్టీ, పార్టీ ఆస్తులను పూర్తిగా తమ నియంత్రణలోకి తెచ్చుకునే దిశగా పావులు కదుపుతున్నది. వచ్చేనెల12న పార్టీ సర్వసభ్య, కార్యవర్గమండలి సమావేశం ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రకటనపై ఈపీఎస్, ఓపీఎస్ అమ్మ, పురచ్చి తలైవి అమ్మ పార్టీ వర్గాల పేర్లున్నాయి. పార్టీ ప్రిసీడియం చైర్మన్ ఈ మధుసూదనన్ అధ్యక్షతన చెన్నైలోని ఒక మ్యారేజీ హాలులో సెప్టెంబర్ 12న ఉదయం 10.30 గంటలకు ఈ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. మంత్రి షణ్ముగం ప్రకటనను చదివి వినిపించారు. కానీ తమను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు వీకే శశికళను పార్టీ పదవి నుంచి తప్పిస్తామని గతవారం ఈపీఎస్, ఓపీఎస్ ప్రకటించారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రకటన విడుదలకు కొన్ని గంటల ముందు సీఎం పళనిస్వామి, పార్టీ ప్రధాన కన్వీనర్, డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం నాయకత్వంలో జరిగిన పార్టీ ఈ సమావేశం ఈ మేరకు ఒక తీర్మానం చేసింది. పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా దినకరన్ చేసిన నిర్ణయాలు చెల్లవని, జయలలిత చేసిన నియామకాలు, పార్టీ ఎన్నికలతో జరిగిన నియామకాలే చెల్లుతాయని మరో తీర్మానం చేసింది. పార్టీకి చెందిన జయాటీవీని, నమదు ఎంజీఆర్ పత్రికను తమ అధీనంలోకి తెచ్చుకోవడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించినట్లు సమాచారం. శశికళ ఆధిపత్యంలోని జయా పబ్లికేషన్ సంస్థ యాజమాన్యంలో నమదు పత్రిక, మ్యాజిక్ డాట్‌కమ్ సంస్థ యాజమాన్యంలో జయటీవీ నడుస్తున్నాయి. ఈ సమావేశానికి దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీలు హాజరుకాలేదని తెలిసింది. దినకరన్‌ను ఇప్పుడు పార్టీ నుంచి తొలిగించినందున పార్టీ తరపున నిర్ణయాలు తీసుకోవడానికి ఆయనకు అధికారం లేదని అన్నాడిఎంకే ఎంపీ ముత్తుకరుప్పన్ అన్నారు.

40 మంది ఎమ్మెల్యేల డుమ్మా!

సోమవారం జరిగిన సంయుక్త సమావేశానికి 40 మంది ఎమ్మెల్యేలతోపాటు కొందరు ఎంపీలు కూడా రాకపోవడం చర్చానీయాంశంగా వారిలో 22 మంది దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. కాగా కొందరు ఎంపీలు పార్లమెంటరీ కమిటీ సభ్యులుగా తీరిక లేకుండా ఉన్నందున ఈ సమావేశానికి రాలేకపోయారని, అయినా తమ వర్గాల ఎమ్మెల్యేలు చాలా మంది వచ్చారని ఈపీఎస్, ఓపీఎస్ గ్రూపులు చెప్పాయి. ఎంతో ముఖ్యమైన ఈ సమావేశానికి ఇంత మంది ఎమ్మెల్యేలు గైర్హాజరుకావడం పళనిస్వామి సర్కారుకు ఇబ్బందికరమేనని విశ్లేషకులు అంటున్నారు. కాగా, దినకరన్ వర్గం క్రమేపీ బలపడుతున్నది. తమకు 25 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నదని, ఇంకా ఎంతో మంది తమతో సంప్రదిస్తున్నారని ఈ వర్గం చెప్తున్నది.

చలించని దినకరన్ ..

ఒకపక్క పార్టీ తనపై, శశికళపై వేటు వేస్తున్నా దినకరన్ చలించడం లేదు. పార్టీపై తమకే అధికారం ఉందని సీఎంతోపాటు, మంత్రులను ఒక్కొక్కరిని తానే తప్పిస్తూ తన అనుయాయులను పార్టీ నాయకులుగా నియమిస్తున్నారు. సీఎం పళనిస్వామినే ఏకంగా పార్టీ సేలం సబర్బన్ జిల్లా కార్యదర్శి పదవి నుంచి ఆదివారం ఆయన తొలిగించారు. దినకరన్ వర్గంతోపాటు, ప్రతిపక్ష డీఎంకే ఇప్పటికే సీఎం పళనిస్వామి సర్కారుపై విశ్వాసం లేదని ప్రకటించాయి. అవసరమైతే ఆయన విశ్వాస పరీక్షను ఎదుర్కోవలిసి రావచ్చు. కాబట్టి ఈ పరీక్షలో గెలువాలంటే శశికళను పార్టీ నుంచి సాగనంపాలి లేదా 15 నుంచి 20 మంది పార్టీ ఎమ్మెల్యేలపై వేటు వేయాలి. ఈపీఎస్, ఓపీఎస్ నాయకత్వంలోని సంయుక్త గ్రూపుదే అసలైన పార్టీ అని ఎన్నికల కమిషన్ గుర్తించవలసి ఉండడం మరో ముఖ్యమైన అంశం. ఈపీఎస్, ఓపీఎస్ మంగళవారం ఢిల్లీకి వెళ్లి ఎన్నికల కమిషన్ వర్గాలను కలిసి శశికళకు తమ మద్దతు లేదని తెలిపే అవకాశం ఉంది.



మండలి చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మీడియా కమిటీ సభ్యులు

మీడియా సమస్యలను పరిష్కరిద్దాం

- అసెంబ్లీ మీడియా కమిటీ తొలి సమావేశంలో కౌన్సిల్ చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ వార్తల సేకరణలో మీడియాకు ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కరించుకుందామని శాసన మండలి చైర్మన్ కే స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జర్నలిస్టులు లెజిస్లేటివ్ సచివాలయానికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలని చెప్పారు. ఇటీవల ఏర్పాటైన తెలంగాణ అసెంబ్లీ మీడియా సలహా కమిటీ తొలి సమావేశం సోమవారం అసెంబ్లీభవనంలో జరిగింది. కమిటీ సభ్యులు తొలుత కౌన్సిల్ చైర్మన్ స్వామిగౌడ్‌తో కమిటీ హాల్‌లో, తర్వాత స్పీకర్ చాంబర్‌లో శాసనసభాపతి మధుసూదనాచారితో వేర్వేరుగా భేటీ అయ్యారు. మండలి చైర్మన్‌కు, స్పీకర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అసెంబ్లీ వార్తల కవరేజ్ విషయంలో మీడియా ప్రతినిధులకు ఎదురవుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఉభయసభల్లో మీడియాకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ చట్టసభల వార్తల సేకరణ విషయమై మీడియా ప్రతినిధులకు అవగాహన, శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. మీడియా సంస్థలతోపాటు వాటి ప్రతినిధుల సంఖ్య పెరిగిపోయినందు వల్ల వారికి సరిపడ అసెంబ్లీలో మీడియా గ్యాలరీలను విస్తరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మీడియా ప్రతినిధుల సమస్యలు, వారికి సౌకర్యాలతోపాటు, అసెంబ్లీ సమస్యలపై కూడా కమిటీ సభ్యులు దృష్టి సారించాలని అన్నారు. లెజిస్లేటివ్ సచివాలయానికి తగిన సలహాలు కూడా ఇవ్వాలని కోరారు. ఇలాంటి సమావేశాలు తరచు జరిగితే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతాయని అన్నారు. స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ గతానికంటే భిన్నంగా కొనసాగుతున్నదని, ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలను ప్రజలందరూ చూస్తున్నారని చెప్పారు. మీడియా సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కరించుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగుదామన్నారు. మీడియా సలహా కమిటీ చైర్మన్ సూరజ్‌తో పాటు వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన కమిటీ సభ్యులు, సచివాలయ కార్యదర్శి డాక్టర్ రాజాసదారాం, జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు, సహాయ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

చెన్నమనేని పౌరసత్వంపై హోంశాఖే తేల్చాలి



ఆరు వారాల గడువిచ్చిన సుప్రీంకోర్టు

నిబంధనలు మార్చకముందే నాకు పౌరసత్వం

వాటిని వర్తింపజేయాలనడం అర్థరహితం

'నమస్తే తెలంగాణ'తో చెన్నమనేని రమేశ్

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వం కేసును ఆరు వారాల్లోగా పరిష్కరించాలని కేంద్ర హోంశాఖకు సుప్రీంకోర్టు సోమవారం ఆదేశాలు జారీచేసింది. ఈసీ, న్యాయస్థానం పరిధిలో లేని అంశంపై నిబంధనల ప్రకారం స్పష్టత ఇవ్వాల్సింది కేంద్ర హోంశాఖేనని జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ నవీన్‌సిన్హాలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. గతేడాది ఆగస్టు 11న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా కేంద్ర హోంశాఖ గడువు కోరింది. ఆ గడువు ముగిసిపోవడంతో ఆరు వారాల్లో తుది నిర్ణయం తీసుకోవాలని హోంశాఖను ఆదేశిస్తూ పిటిషన్‌ను ధర్మాసనం డిస్పోజ్ చేసింది. భారత పౌరసత్వాన్ని కోరుతూ 2008 మార్చి 31న రమేశ్ కేంద్రానికి దరఖాస్తు చేసుకోగా 2009 ఫిబ్రవరి 3న పౌరసత్వాన్ని మంజూరుచేసింది. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీచేసి రమేశ్ గెలుపొందారు. ఓటమికి గురైన ఆది శ్రీనివాస్.. రమేశ్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించారని హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. విచారించిన హైకోర్టు పౌరసత్వం చెల్లదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలుచేస్తూ రమేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2008లో దరఖాస్తు చేసుకున్న తర్వాత 2009 ఫిబ్రవరి 3న పౌరసత్వం మంజూరైందని, కానీ ఫిబ్రవరి 25న పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 5(1)(ఎఫ్)కు సవరణలు చేసి 'ఒక సంవత్సరం భారతదేశంలో నివసించి ఉండాలి' అనే పాత నిబంధన స్థానంలో 'దరఖాస్తు చేసుకునేనాటికి ముందు 365 రోజుల పాటు వరుసగా దేశంలో నివసించి ఉండాలి' అని మార్చారని తెలిపారు. ఈ సవరణకు ముందే దరఖాస్తు చేసుకున్నందువల్ల కొత్త నిబంధన తనకు వర్తించదని, పాత నిబంధనే వర్తిస్తుందని సుప్రీంకోర్టుకు స్పష్టంచేశారు. గతేడాది ఆగస్టు 7న ఈ కేసు మళ్లీ విచారణకు వచ్చింది. రమేశ్ లేవనెత్తిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... రూల్ పొజిషన్ ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర హోంశాఖేనని స్పష్టంచేసింది. హోంశాఖ విజ్ఞప్తిమేరకు మూడు నెలలు గడువు, డిసెంబర్‌లో మరో మూడు నెలలు గడువును ధర్మాసనం మంజూరుచేసింది. ఈ జూన్ 7న హైకోర్టులో విచారణ సందర్భంగా కేంద్ర హోంశాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తూ.. పౌరసత్వానికి సంబంధించి తుది నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. హోం శాఖ ఇప్పటివరకూ నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఆది శ్రీనివాస్ సుప్రీంకోర్టులో మళ్లీ పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది.

నిబంధనల ప్రకారమే దరఖాస్తు: చెన్నమనేని

సుప్రీంకోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో చెన్నమనేని రమేశ్ 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. తాను పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేనాటికి పౌరసత్వ చట్టంలోని ఉన్న నిబంధనల ప్రకారం కేంద్రం తనకు పౌరసత్వాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఆ మేరకే 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని, ఆ తర్వాత 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ, తాజాగా 2014 ఎన్నికల్లోనూ పోటీచేశానని పేర్కొన్నారు. తనకు పౌరసత్వం మంజూరైన తర్వాత కేంద్రం చేసిన నిబంధనల్లోని మార్పులు తనకు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులో జరిగిన విచారణల సందర్భంగా ఇదే అంశాన్ని లేవనెత్తానని గుర్తుచేశారు. నిబంధనల్లో సవరణలకు పూర్వమే తనకు పౌరసత్వం లభించినప్పుడు.. ఆ తర్వాత వచ్చిన నూతన మార్పుల్ని వర్తింపచేయాలని వాదించడం సహేతుకం కాదని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా ఈ పిటిషన్ స్వభావం అటు ఎన్నికల సంఘం పరిధిలోకి వచ్చేది కాదని, ఇటు న్యాయస్థానాల పరిధిలోకి వచ్చేది కాదని, కేవలం నిబంధనలతో ముడిపడిన అంశం కాబట్టి తేల్చాల్సింది కేంద్ర హోం మంత్రిత్వశాఖేనని స్పష్టం చేశాయని, అయినా పదేపదే పిటిషన్లు వేయడం అర్థరహితమన్నారు. తన పౌరసత్వం సమంజసమైనదని సుప్రీంకోర్టు భావించినందువల్లే హైకోర్టు గతంలో ఇచ్చిన ఆంక్షలపై స్టే మంజూరు చేసిందని, ఆ తర్వాత 2014లో ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత లభించిందని చెప్పారు. రమేశ్ పౌరసత్వంపై ఆది శ్రీనివాస్ ఏడు పిటిషన్లు వేశారు. మూడింటిని కోర్టు కొట్టివేసింది. తాజా పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయస్థానం బంతిని హోంశాఖ కోర్టులోకి నెట్టింది. దీంతో ఇప్పుడు హోంశాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఎన్సీటీఈ అక్రెడిటేషన్ సరికాదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయ వృత్తి విద్యాకోర్సులు నిర్వహించే ప్రతి కళాశాల తప్పనిసరిగా జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) నుంచి అక్రెడిటేషన్ తీసుకోవాలనే నిబంధనను సవాల్ చేస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు ఉపాధ్యాయ వృత్తివిద్యా కళాశాలలు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించాయి. ఎన్సీటీఈ సవరణ బిల్లు-2017లో నిబంధన 8 (3)ను రద్దు చేయాలని అభ్యర్థించాయి. ఈ వ్యాజ్యాలపై సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవీలతో కూడిన ధర్మాసనం విచారించింది. సరైన వసతులు లేని కళాశాలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎన్సీటీఈ తరపున స్టాండింగ్ కౌన్సెల్ రమాకాంత్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల్లో కేసుల దాఖలు కాగా, సుప్రీంకోర్టును ఎన్సీటీఈ ఆశ్రయించిందని పేర్కొన్నారు. వీటిపై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, కాబట్టి ఈ వ్యాజ్యాలను ఆ ధర్మాసనానికి బదిలీ చేయాలని కోరారు. అక్రెడిటేషన్ పొందడానికి ఈ నెల 31 గడువు తేదీగా నిర్ణయించడం వల్ల కాలేజీలు అదనంగా రూ.1.50 లక్షలు చెల్లించాల్సి వస్తుందని కాలేజీల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

కార్పొరేట్ నేరాలు అత్యంత ప్రమాదకరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దురుద్దేశంతో అమాయక ప్రజల నుంచి డిపాజిట్ల పేరిట భారీస్థాయిలో డబ్బులు వసూలుచేసి మోసాలకు పాల్పడిన వ్యక్తులకు బెయిల్ ఇవ్వడం సులువుకాదని ఉమ్మడి హైకోర్టు స్పష్టంచేసింది. మోసం చేశాక కార్పొరేట్ చట్టాలను అడ్డం పెట్టుకొని బెయిల్ పొందాలనే ప్రయత్నాలపై న్యాయస్థానాలు ఉదాసీనంగా వ్యవహరించలేవని పేర్కొన్నది. వేల కోట్ల రూపాయలను డిపాజిట్లుగా సేకరించి చేతులెత్తేసిన అగ్రిగోల్డ్ సంస్థ వైస్‌చైర్మన్, డైరెక్టర్‌కు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సోమవారం హైకోర్టు ఈ మేరకు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆయన ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆర్థికనేరాలు ఇతర నేరాల కన్నా అత్యంత ప్రమాదకరమైనవని, వీటివల్ల సామాన్య ప్రజానీకం నష్టపోతున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ధర్మాసనం ఆవేదన వ్యక్తంచేసింది.

గుప్తా స్థానంలో శ్రీవాత్సవ

- పోలవరం అథారిటీ సభ్య కార్యదర్శిగా కృష్ణా బోర్డు చైర్మన్
- అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్రం ఉత్తర్వులు
- ఢిల్లీ హెడ్‌క్వార్టర్‌కు గుప్తా బదిలీ
- కృష్ణా బోర్డులో పాతకథే పునరావృతం!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



ఆర్కే గుప్తా



శ్రీవాత్సవ

పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ).. కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు అవినాభావ సంబంధం ఉందా? లేక ఆ సంబంధాన్ని ముడివేస్తున్నారా? మర్మమేదైనా.. రెండింటికీ మాత్రం ఏదో ఒక బంధం ఉందనేది బహిరంగ రహస్యం. అందుకే మొన్నటిదాకా కృష్ణా బోర్డు చక్రం తిప్పిన ఆర్కే గుప్తాకు ఎన్నో అదనపు బాధ్యతలున్నా.. వాటికి అదనంగా పోలవరం ప్రాజెక్టు సభ్య కార్యదర్శిగా మరో ప్రధాన బాధ్యత కూడా ఉండేది. కొంత కాలం కిందట కీలక పరిణామాల నేపథ్యంలో గుప్తాను బోర్డు బాధ్యతల నుంచి తప్పించిన కేంద్రప్రభుత్వం తాజాగా పోలవరం అథారిటీలోని బాధ్యత నుంచి కూడా గుప్తాను తప్పించి, ఢిల్లీ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేసింది. గుప్తా స్థానంలో ప్రస్తుతం కృష్ణా బోర్డు చైర్మన్‌గా ఉన్న శ్రీవాత్సవను నియమించడం గమనార్హం. దీంతో పోలవరం అథారిటీ.. కృష్ణా బోర్డుకు ఉన్న సం'బంధం'పై రెండు రాష్ట్రాల్లోని నీటిపారుదల శాఖ వర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది.

ఏపీకి అనుకూల నిర్ణయాలు తీసుకున్న గుప్తా

రాష్ట్ర విభజన అనంతరం రెండు రాష్ట్రాల మధ్య జలాల పంపిణీ పర్యవేక్షణకు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం కేంద్రం కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులను ఏర్పాటు చేసింది. ఇందులో గోదావరిపై పెద్దగా చిక్కులు లేకపోవడంతో మూడున్నరేండ్లుగా కృష్ణాబోర్డు ఏదో ఒక రూపంలో వివాద అంశాలతో తెరపైకి వస్తూనే ఉంది. ప్రధానంగా ఏడాది కిందటివరకు బోర్డు సభ్య కార్యదర్శిగా ఉన్న ఆర్కే గుప్తా అన్నీ తానై వ్యవహరించారు. ఏకపక్షంగా ఏపీకి అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ కృష్ణాజలాల పంపిణీలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగేలా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు అథారిటీకి ఆయన సభ్య కార్యదర్శిగా ఉన్నందున.. ఏపీ అధికారులతో సత్సంబంధాలు ఉండటమే ఇందుకు కారణమని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. పోలవరానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఉన్న దరిమిలా కేంద్రం అథారిటీ సభ్య కార్యదర్శి నియామకాన్ని చేపడుతుంది. ఆ నియామకంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తుందనేది అందరికీ తెలిసిన సత్యం. ఈ క్రమంలో ఆర్కే గుప్తా వ్యవహారశైలిని అప్పటో తెలంగాణ సర్కారు సీరియస్‌గా తీసుకుంది. ఏకంగా నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కేంద్ర జలవనరుల మంత్రి ఉమాభారతికి ఫిర్యాదుచేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను గుర్తించిన కేంద్రం తెలంగాణ ఫిర్యాదు మేరకు ఆర్కే గుప్తాను కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పించింది.

ఇప్పుడు మళ్లీ అవే జోడు పదవులు..

ఖాళీగా ఉన్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా శ్రీవాత్సవను కేంద్రం నియమించింది. ఈ ఏడాది మే నెలలో ఆయన బాధ్యతలు స్వీకరించాక సమావేశాలేవీ జరుగలేదు. ఈ నీటి సంవత్సరానికి సంబంధించి ఈ నెల 22న బోర్డు సమావేశాన్ని విజయవాడలో నిర్వహించారు. శ్రీవాత్సవకు తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణమవుతున్న పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ చందన్ ముఖర్జీ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆ పోస్టులో ఆర్కే గుప్తా కొనసాగారు. ఆయన నుంచి బాధ్యతలు శ్రీవాత్సవకు రావడం విశేషం. అంతేగాకుండా ఆర్కే గుప్తా కృష్ణా, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్‌గా నిన్నటివరకు బాధ్యతలు నిర్వహించారు. సోమవారం జారీచేసిన ఉత్తర్వుల్లో ఆ బాధ్యతల నుంచి తప్పించి.. బెంగళూరు కేంద్ర జల సంఘం కార్యాలయంలో పనిచేస్తున్న చీఫ్ ఇంజినీర్ ఆర్కే జైన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు పేర్కొన్నారు. అంటే ఆర్కే గుప్తాను పూర్తిగా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి పరిమితం చేశారు. దీంతో కృష్ణాబోర్డులో కీలక బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఏకంగా ఆరు అదనపు బాధ్యతలతో వెలుగొందిన ఆర్కే గుప్తాను.. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రెండు బాధ్యతలను తప్పించి ఢిల్లీకి పరిమితం చేయడం.. ప్రస్తుతం కృష్ణా బోర్డులో కీలక పోస్టులో ఉన్న శ్రీవాత్సవకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించడం కీలక పరిణామాలుగా మారాయి. పోలవరం, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరిజలాల మళ్లింపునకు సంబంధించి తెలంగాణకు కృష్ణాజలాల్లో వాటా రావాల్సిన అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా ఉన్న తరుణంలో ఈ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

ఏడు వేల చెరువులకు జలకళ



మత్తడి దుంకుతున్న కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామ పెద్ద చెరువు

మొదటిపేజీ తరువాయి...

జలమయమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా జిల్లా అంతటా ముసుర్లు కమ్ముకున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలంలోని సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గుల వాగు మళ్లీ ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో లోతట్టు గ్రామాలైన అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, లాలాయిగూడెం, సర్వాపురానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మెదక్ జిల్లాతోపాటు పొరుగున ఉన్న సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లాలోని ఏకైక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు అయిన ఘనపురం ఆనకట్ట, హవేళిఘనపూర్ మండల పరిధిలోని పోచారం ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. ఆనకట్టలపై నుండి నీరు పొంగిపొర్లుతున్నది. హైదరాబాద్ నగరంలో సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది.

నేడు సాధారణం నుంచి భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి అల్పపీడనంగా మారి, దక్షిణ ఒడిశా, కోస్తాంధ్ర మీదుగా తమిళనాడు వరకు విస్తరించింది. దీని ప్రభావంతో మంగళవారం తెలంగాణవ్యాప్తంగా సాధారణంనుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం నుంచి రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కదలిక ఆశాజనకంగా ఉండడంతో గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌లో 6 సెంటీమీటర్లు వర్షపాతం రికార్డయింది. కూసుమంచి, సంగారెడ్డి, కొత్తగూడెంలలో 4 సెం.మీ., నారాయణ్‌ఖేడ్, జుక్కల్, మాచారెడ్డి, మధిరలో 3 సెం.మీ., వెంకటాపురం, మెదక్, పినపాక, మర్పల్లి, గట్టు, బోధన్, నల్లబెల్లి, బోనకల్, అలంపూర్‌లలో 2 సెం.మీ., హైదరాబాద్, దోమ, గంభీరావుపేట, కోస్గి, జూరాల ప్రాజెక్టు, మాగనూర్, గోవిందరావుపేట, వెంకట్‌పూర్, మోమిన్‌పేట, ఏటూరు నాగారం, పరిగి, బోథ్, సదాశివనగర్, కొడంగల్, పరకాల, ఉట్నూరులలో 1 సెంటీమీటర్ చొప్పున వర్షపాతం నమోదైంది.

వివిధ జిల్లాల్లోని చెరువుల పరిస్థితి ఇలా ఉంది.. (% చెరువులు నిండిన శాతం)

జిల్లా	మొత్తం చెరువులు	0-25%	25-50%	50-75%	75-100%	అలుగు పోస్తున్నవి
భద్రాద్రి కొత్తగూడెం	2427	44	40	34	1816	493
మహబూబాబాద్	1940	55	230	336	707	612
జయశంకర్ భూపాలపల్లి	2075	153	285	784	568	285
ఖమ్మం	1407	131	394	444	424	14
వరంగల్ అర్బన్	1001	217	145	208	352	79
కామారెడ్డి	1724	207	529	461	327	200
నిర్మల్	822	69	204	271	243	35
కరీంనగర్	1490	686	406	237	125	36
వరంగల్ గ్రామీణం	760	261	188	172	123	16
నిజామాబాద్	1241	680	252	128	108	73
ఆదిలాబాద్	457	0	146	124	90	97
జనగామ	990	370	375	165	73	7
మంచిర్యాల	952	434	375	69	49	25
జగిత్యాల	1226	860	241	60	40	25
పెద్దపల్లి	1185	1062	50	29	17	27
రాజన్న సిరిసిల్ల	625	549	54	10	12	0
కుమ్రంభీం ఆసిఫాబాద్	492	70	422	0	0	0
మొత్తం	20,814	5,848	4,336	3,532	5,074	2,024

భువనగిరికి కేవీ

మొదటిపేజీ తరువాయి...

చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖకు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం కూడా మరికొన్ని కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఇప్పటివరకు భువనగిరి నియోజకవర్గ వాసులు నల్లగొండలోని కేంద్రీయ విద్యాలయంపై ఆధారపడ్డారు. రవాణ ఇబ్బందుల దృష్ట్యా ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విజ్ఞప్తులతో కేంద్రం.. కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయడంతో భువనగిరి వాసులకు ఉపశమనం లభించినట్లయింది. ఎంపీ బూర నర్సయ్య గౌడ్ చొరవతో భువనగిరికి కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడం పట్ల ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 2014లోనే భువనగిరికి కేంద్రీయ విద్యాలయం కేటాయిస్తామని అప్పటి కేంద్ర మానవవనరులశాఖ మంత్రి స్మృతి ఇరానీ హామీఇచ్చినా కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారులు స్పందించలేదు. ఎంపీ బూర నర్సయ్య గౌడ్ పలుసార్లు కేంద్ర ప్రభుత్వ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. విద్యాలయం నిర్వహణకు అవసరమైన భవనం కోసం ఎంపీ బూరనర్సయ్య గౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కేంద్ర అధికారులు ఒప్పించేందుకు ప్రయత్నించారు.

సెన్సెక్స్ **31,751** ↗ 155

నిఫ్టీ **9,913** ↗ 56

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,395
22 క్యారెట్లు	29,245
వెండి (కిలో)	39,225

ముడి చమురు (బ్రెంట్)

↗ 51.78

36 లక్షల జీఎస్టీ రిటర్నుల దాఖలు



న్యూఢిల్లీ, ఆగస్టు 28: వస్తు, సేవా పన్ను(జీఎస్టీ) కింద తొలిసారిగా 36 లక్షల మంది వ్యాపారవేత్తలు రిటర్నులు దాఖలు చేసుకున్నారని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ కింద పన్ను వసూళ్లు భారీగా పెరిగాయన్నారు. ఇప్పటి వరకు రూ.65 వేల కోట్లు మేర వసూలయ్యాయని రెవెన్యూ డిపార్టుమెంట్ అంచనావేస్తున్నది. జీఎస్టీ కింద పన్ను చెల్లింపులు, రిటర్నులు దాఖలు చేయడానికి ఈ నెల 25 వరకు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే.

ఉద్యోగులకు లభించే అదనపు ప్రయోజనాలపై జీఎస్టీ

ఉద్యోగులకు యాజమాన్యాల నుంచి లభించే ద్రవ్యేతర అదనపు ప్రయోజనాలపై జీఎస్టీ వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. నగదు పారితోషికాలు మాత్రం జీఎస్టీ పరిధిలోకి రావని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) తెలిపింది. ద్రవ్యరూపంలో ఆర్జించే ఆదాయం స్థాయిని బట్టి వ్యక్తిగత ఆదాయ పన్ను కట్టాల్సి ఉంటుందని వెల్లడించింది.

డిజిటల్ లావాదేవీలపై 2% జీఎస్టీ డిస్కౌంట్!

దేశంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం త్వరలో మరో నిర్ణయం తీసుకోనుంది. రూ.2000 వరకు డిజిటల్ లావాదేవీలపై 2 శాతం జీఎస్టీ డిస్కౌంట్‌ను క్యాష్‌రూపంలో ఆఫర్ చేసే అవకాశం ఉంది. ఆర్థిక , ఆర్బీఐ, క్యాబినెట్ సెక్రటేరియేట్, ఎలక్ట్రానిక్ అండ్ ఐటీ శాఖ ఈ ప్రతిపాదనపై సమాలోచన చేస్తున్నట్లు తెలుస్తున్నది.

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	60.63	70.30
ఆస్ట్రేలియా డాలర్	46.11	53.37
బహ్రెయిన్ దినార్	164.28	188.16
యూరో	64.05	74.28
జపాన్ యెన్/100	53.32	61.84
కువైట్ దినార్	180.34	224.42
ఒమన్ రియాల్	160.75	183.95
ఖతార్ రియాల్	16.95	19.47
సౌదీ రియాల్	16.12	19.11
సింగపూర్ డాలర్	43.02	50.95
స్టెర్లింగ్ పౌండ్	74.00	86.83
యూఏఈ దిర్హామ్	16.50	19.29

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	355-00	355-00
రంగారెడ్డి	355-00	355-00
మెదక్	355-00	355-00
కరీంనగర్	357-00	---
వరంగల్	357-00	---
రిటైల్ ప్రైస్	4-15	4-15

చికెన్ ధరలు

ఫారం ధర	84.00
రిటైల్ లైవ్	99.00
డ్రెస్డ్	139.00
స్కిన్‌లెస్	163.00

ఎన్‌టీపీసీలో 5% వాటా విక్రయం

- షేరు కనీస ధర రూ.168.. నేడు, రేపు వేలం
- కేంద్రానికి రూ.7 వేల కోట్లు సమకూరే అవకాశం



న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ 'నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్'లో (ఎన్‌టీపీసీ) కేంద్రం 5 శాతం వాటా విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) పద్ధతిలో జరుగనున్న షేర్ల వేలం ప్రక్రియ మంగళ, బుధవారాల్లో జరుగనుంది. షేర్ ఒక్కింటి కనీస ధరను రూ.168గా నిర్ణయించారు. తద్వారా కేంద్రానికి రూ.7,000 కోట్ల నిధులు సమకూరే అవకాశం ఉంది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఎన్‌టీపీసీ షేర్లు 2.5 శాతం పెరిగి రూ.173.55కు చేరుకున్నాయి. ఈ ధరతో పోలిస్తే ఓఎఫ్‌ఎస్‌లో సంస్థ షేర్ల కొనుగోలుపై 3 శాతం రాయితీ లభించనుందన్నమాట. ఈ ఆఫర్‌కు అనుకున్నదానికంటే అధిక బిడ్లు దాఖలైన పక్షంలో కేంద్రం మరో 5 శాతం వాటాను సైతం విక్రయించే అవకాశం ఉందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017-18) ఇప్పటి వరకు 6 కంపెనీల్లో వాటాల ఉపసంహరణ ద్వారా కేంద్రం రూ.8,800 కోట్లు సమీకరించగలిగింది. ఎల్ అండ్ టీలోని యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా స్పెసిఫైడ్ అండర్ టేకింగ్(ఎస్‌యూయూటీఐ) వాటాను కూడా విక్రయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ ద్వారా రూ.72,500 కోట్లు సేకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో రూ.46,500 కోట్లు మైనారిటీ వాటాల విక్రయం ద్వారా, రూ.15వేల కోట్లు వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా రాబట్టాలని అనుకుంటున్నది.

స్టార్టప్‌లకు విదేశీ వీసీల నుంచి 100% ఫండింగ్

- ఏకీకృత ఎఫ్‌డీఐ పాలసీని ప్రకటించిన కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 28: కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) సోమవారం నాడు ఏకీకృత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) విధాన నివేదికను విడుదల చేసింది. అందులో తొలిసారిగా స్టార్టప్‌లను సైతం చేర్చింది. నవజాత కంపెనీలు విదేశీ వెంచర్ క్యాపిటల్ పెట్టుబడిదారుల (ఎఫ్‌వీసీఐ) నుంచి వంద శాతం నిధులు సేకరించగలిగేలా వెసులుబాటు కల్పించింది. ఎఫ్‌వీసీఐలకు ఈక్విటీ లేదా ఈక్విటీ అనుసంధానిత పథకాలు లేదా బాండ్ల జారీ ద్వారా విదేశీ రెమిటెన్స్‌ల రూపంలో నిధులు పొందవచ్చని ఎఫ్‌డీఐ నివేదికలో స్పష్టం చేసింది. గడిచిన ఏడాదికాలంలో ఎఫ్‌డీఐ పాలసీ సవరణలన్నింటినీ ఈ నివేదికలో చేర్చింది. స్టార్టప్‌లు ఇతర దేశాల్లోని వ్యక్తులకు కన్వర్టిబుల్ నోట్ల జారీ చేయవచ్చని రిపోర్టు తెలిపింది. అయితే, ఇందుకు కొన్ని షరతులు వర్తిస్తాయి. పాకిస్థాన్, బంగ్లాదేశ్ మినహాయించి ఇతర దేశాల వ్యక్తులు లేదా సంస్థ.. దేశీయ స్టార్టప్ జారీ చేసే కన్వర్టిబుల్ నోట్స్‌ను కొనుగోలు చేయవచ్చు. కాకపోతే ఒకేసారి రూ.25 లక్షలు లేదా అంతకు మించి విలువచేసే నోట్స్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రవాస భారతీయులు సైతం స్టార్టప్‌లు జారీ చేసే కన్వర్టిబుల్ నోట్స్‌ను కొనుగోలు చేయవచ్చు. కానీ వాటిని తిరిగి స్వదేశానికి పంపేందుకు వీలుండదు. ఈ నోట్లను జారీ చేసే స్టార్టప్‌లు ఆర్బీఐ నిర్దేశించిన రీతిలో రిపోర్టులు సమర్పించాల్సి ఉంటుంది. దేశంలో ఉద్యోగ కల్పన, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్టార్టప్‌లపై ప్రధానంగా దృష్టిసారించింది.

విదేశీ విమాన సంస్థలకు ఎయిర్ ఇండియా విక్రయం లేనట్లే



'దేశీయ విమాన సంస్థల్లో విదేశీ ఎయిర్‌లైన్స్ 49 శాతం వరకు వాటా కలిగి ఉండవచ్చు. కానీ ఈ నిబంధన ఎయిర్ ఇండియాకు వర్తించదు' అని తాజాగా విడుదలైన ఎఫ్‌డీఐ పాలసీ నివేదిక పేర్కొంది. ఈ నిబంధనను బట్టి చూస్తే ఎయిర్ ఇండియాను ఫారిన్ ఎయిర్‌లైన్స్‌కు విక్రయించే అవకాశాలు లేనట్లే కన్పిస్తున్నది. అంతేకాదు, విదేశీ విమాన సంస్థ లేదా ఇన్వెస్టర్ భారత్‌లో ఎయిర్‌లైన్స్‌ను నడుపాలంటే, ఆ సంస్థలో మెజారిటీ వాటా, నియంత్రణ దేశీయుల చేతుల్లోనే ఉండాలని పేర్కొంది. దాంతో ఖతార్ ఎయిర్‌లైన్స్ 100 శాతం పెట్టుబడులతో భారత్‌లో విమాన సంస్థను ఏర్పాటు చేయాలన్న ప్రణాళికకు అడ్డుకట్టపడినట్లేనని విశ్లేషకులంటున్నారు.

త్వరలో 5జీ స్పెక్ట్రం వేలం!

న్యూఢిల్లీ, ఆగస్టు 28:

సంప్రదింపులు ప్రారంభించిన ట్రాయ్



దేశీయ టెలికం మార్కెట్‌లో 4జీ సేవలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. వినియోగదారులు ఈ సేవల అనుభూతిని పూర్తిస్థాయిలో ఆస్వాదించేలోపే 5జీ సర్వీసులు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఐదో తరం సేవలు అందించడానికి అవసరమైన స్పెక్ట్రాన్ని విక్రయించడానికి టెలికం నియంత్రణ మండలి 'ట్రాయ్' సిద్ధమైంది. గతేడాది విక్రయించిన 700 మెగాహెట్జ్ రేడియో తరంగాలకు మొబైల్ ఆపరేటర్ల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈసారి సరైన ప్రణాళికతో ట్రాయ్ సంప్రదింపులను ఆరంభించింది. టెలికం శాఖ రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రాయ్ వేలాన్ని నిర్వహించనుంది. తొమ్మిది రకాల బ్యాండ్‌విడ్త్ స్పెక్ట్రంను విక్రయించనుంది. స్పెక్ట్రం విలువ, రిజర్వు ధరపై కచ్చితమైన నిర్ణయం తీసుకోనున్నది. గతసారి నిర్వహించిన వేలంలో అమ్ముడుపోని 60 శాతం రేడియో తరంగాలను కలుపుకొని ఈసారి కొత్తగా 5జీ సేవలు అందించగలిగే స్పెక్ట్రాన్ని సైతం వేలంవేయనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత సంవత్సరంలోనే తరంగాలను వేలం వేయాలని టెలికం శాఖ ప్రతిపాదించిన నేపథ్యంలో ట్రాయ్ ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది. దీంట్లోభాగంగానే సోమవారం సంప్రదింపులను ప్రారంభించింది. ఒకేసారి లేదా విడుతల వారీగా విక్రయించే విషయంపై ట్రాయ్ త్వరలో తుది నిర్ణయం తీసుకోనున్నది. 700 మెగాహెట్జ్, 800 మెగాహెట్జ్, 900 మెగాహెట్జ్, 1800 మెగాహెట్జ్, 2100 మెగాహెట్జ్, 2300 మెగాహెట్జ్, 2500 మెగాహెట్జ్, 3300-3400 మెగాహెట్జ్, 3400-3600 మెగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్‌ల స్పెక్ట్రాన్ని వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఇందుకు సంబంధించి ట్రాయ్ తాజాగా చర్చాపత్రాన్ని విడుదల చేసింది. కేవలం 5జీ సేవలు అందించడానికి ఈసారి అదనంగా 3300-3400 మెగాహెట్జ్, 3400-3600 మెగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్ తరంగాలను వేలం వేయనున్నది. గతేడాది నిర్వహించిన ఐదు రోజుల స్పెక్ట్రం వేలంలో కేంద్రానికి రూ.5.66 లక్షల కోట్ల విలువైన స్పెక్ట్రాన్ని విక్రయానికి పెట్టగా.. ఏడు టెలికం సంస్థలు రూ.65,789 కోట్ల విలువైన 964.80 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రం కొనుగోలుకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తొమ్మిది బ్యాండ్ విడ్త్‌లకు చెందిన 7500 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రాన్ని వేలం వేయాల్సి ఉంటుందని ట్రాయ్ వర్గాలు వెల్లడించారు. ఇప్పటివరకు విక్రయించిన తరంగాల్లో ఇదే గరిష్ఠ విలువైనదని తెలిపారు. ఈ వేలానికి సంబంధించి వచ్చేనెల 25లోగా సూచనలు చేయవచ్చని, అక్టోబర్ 3లోగా కౌంటర్ దాఖలు చేయవచ్చని సూచించింది.

2019లో విక్రయించాలి: కోయ్

ప్రస్తుతం సంస్థలకు మరింత స్పెక్ట్రం అవసరం లేనందున ఈ ఏడాదే స్పెక్ట్రం వేలం వేయరాదని సెల్యులార్ ఆపరేటర్ల అసోసియేషన్ 'కోయ్' ప్రభుత్వానికి సూచించింది. ఇప్పటికే టెలికం ఇండస్ట్రీ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదని, అనిశ్చిత పరిస్థితి నెలకొన్న ఈ తరుణంలో స్పెక్ట్రం వేలం వేయడం సరికాదని కోయ్ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూ అభిప్రాయపడ్డారు. టెలికం ఇండస్ట్రీపై రుణభారం రూ.4.5 లక్షల కోట్లకు చేరుకుంది. 5జీ స్పెక్ట్రం వేలానికి 2019 ఏడాది సరైన సమయమని ఆయన అన్నారు. ముందుగా దేశవ్యాప్తంగా ఇందుకు సంబంధించి అనువైన పరిస్థితులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఆ తర్వాతనే స్పెక్ట్రాన్ని వేలం వేయాలని ఆయన సూచించారు.

మగవారి కోసం సెసా ప్రత్యేక హెయిర్ ఆయిల్



హైదరాబాద్, ఆగస్టు 28: ప్రముఖ ఆయుర్వేద సంస్థ బాన్ ల్యాబ్.. మగవారి కోసం ప్రత్యేక హెయిర్ ఆయిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'సెసా హెయిర్ వైటలైజర్ ఫర్ మెన్' పేరుతో తయారు చేసిన ఈ ప్రొడక్టు.. మగవాళ్లలో జుట్టు రాలుట, చుండ్రు వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి బాగా పని చేస్తుందని సంస్థ తెలిపింది. 19 రకాల ఔషధ మూలికలు, 11 రకాల పోషక నూనెలు ఇంకా పాలలోని శక్తి మిశ్రమంతో ఈ హెయిర్ ఆయిల్‌ను తయారు చేసినట్లు బాన్ ల్యాబ్ తెలిపింది. సంస్థ ఇప్పటికే 'సెసా' బ్రాండ్‌నేమ్‌తో మహిళలకు ప్రత్యేక హెయిర్ ఆయిల్‌ను మార్కెట్లో విక్రయిస్తున్నది.

హుషారుగా సంస్కరణలు

పేదరిక నిర్మూలనకు ఉత్తమమైన మార్గమిదే: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 28: వాణిజ్య విధానాలను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం మరింత హుషారుగా సంస్కరణలు చేపట్టాలని నీతి ఆయోగ్ తాజా నివేదిక సూచించింది. దేశంలో పేదరిక నిర్మూలనకు అదే అత్యుత్తమ మార్గమని, తద్వారా కోట్లాది మంది జీవనశైలి మెరుగుపడుతుందని పేర్కొంది. దేశీయ కార్మిక చట్టాలను భారీగా సంస్కరించాలని 'సులభతర వాణిజ్య విధానం: రాష్ర్టాలపై సర్వే' పేరుతో విడుదల చేసిన రిపోర్టులో ప్రతిపాదించింది. అంతేకాదు, సంస్థలు వ్యాపారంలోకి సులభంగా ప్రవేశించగలుగడంతోపాటు అంతే సులువుగా వైదొలుగగలిగేలా వెసులుబాటు కల్పించాలని సూచించింది.

పేదరిక నిర్మూలనకే ప్రాధాన్యం: పనగరియా

దేశంలో అసమానతలను తగ్గించడం కంటే పేదరిక నిర్మూలనకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమివ్వాలని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకోనున్న అరవింద్ పనగరియా అన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించగలుగడంతోపాటు విద్య, వైద్య సేవలందించడంపై ప్రభుత్వం మరింత దృష్టిసారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఇపామా అధ్యక్షుడిగా శ్రీపతి దయాకర్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 28: ఇండియన్ ప్రింటింగ్, ప్యాకేజింగ్ అండ్ అల్లైడ్ మెషినరీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఇపామా) అధ్యక్షుడిగా శ్రీపతి దయాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. దక్షిణ భారతం నుంచి, అందునా మన రాష్ట్రం నుంచి ఇపామాకు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొట్టమొదటి వ్యక్తి దయాకర్ రెడ్డి. ఈ సందర్భంగా తెలంగాణ ఆఫ్సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. ఇపామాకు శ్రీపతి దయాకర్ రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికవడం తెలంగాణ ముద్రణా రంగానికి గర్వకారణం అని అభినందించారు. పనిపట్ల నిబద్ధత, అంకితభావం వల్లే దయాకర్ రెడ్డిని జాతీయ పదవి వరించిందని తెలంగాణ ఆఫ్సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు.

నాలుగో రోజు మరింత పైకి



155 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్.. 9,900 ఎగువకు నిఫ్టీ

ముంబై, ఆగస్టు 28: భారత్-చైనా దేశాల సరిహద్దు వద్దనెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణుగడంతో వరుసగా నాలుగో రోజు స్టాక్‌మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మార్కెట్లకు కలిసొచ్చింది. దేశీయ పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 154.76 పాయింట్లు(0.49 శాతం) లాభపడి 31,750.82 వద్ద స్థిరపడింది. అంతకుముందు మూడు ట్రేడింగ్‌లలో సూచీ 337.21 పాయింట్లు బలపడిన విషయం తెలిందే. నిఫ్టీ మళ్లీ 9,900 పాయింట్ల ఎగువకి చేరుకుంది. మార్కెట్ ముగిసే సమయానికి 55.75 పాయింట్లు పెరిగి 9,912.80 వద్దకు చేరుకుంది. వచ్చేవారంలో చైనాలో జరుగనున్న బ్రిక్స్ సమావేశాల నేపథ్యంలో భారత్-చైనా దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయనున్నట్లు ఇరు దేశాలు ప్రకటించడం మార్కెట్లు పుంజుకోవడానికి కారణమైందని విశ్లేషకులు చెప్పారు. ఈ సమావేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరింత బలపడటం కూడా సూచీలు పుంజుకోవడానికి దోహదపడ్డాయి. ఆస్ట్రేలియాలో 1650 కోట్ల డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న బొగ్గు క్షేత్రం పనులను త్వరలో ప్రారంభించినట్లు అదానీ గ్రూపు ప్రకటించడంతో గ్రూపు షేర్లు 9 శాతం వరకు లాభపడ్డాయి. షేరు ధర 9.05 శాతం పెరిగి రూ.119.25 వద్ద స్థిరపడింది. గ్రూపునకు చెందిన ఇతర సంస్థలైన అదానీ ట్రాన్స్‌మిషన్ 8.04 శాతం పెరుగగా, అదానీ పవర్ 6.13 శాతం, ఏపీ సెజ్ 1.86 శాతం పెరిగాయి. ఎన్‌టీపీసీ 2.48 శాతం, హీరో మోటోకార్ప్ 2.21 శాతం లాభపడ్డాయి. సన్ ఫార్మా, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంకులు ఒక శాతం వరకు మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. కోల్ ఇండియా, ఎల్ అండ్ టీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, భారతీ ఎయిర్‌టెల్, విప్రో, ఐటీసీ, బజాజ్-ఆటో, కొటక్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రాలు లాభాల్లో ముగిశాయి. 2.01 శాతం తగ్గి డాక్టర్ రెడ్డీస్ టాప్ లూజర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, ఎస్‌బీఐ, టీసీఎస్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, లుపిన్, మారుతి, సిప్లా, రిలయన్స్‌లు నష్టపోయాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్, ఐటీ, టెక్నాలజీ, ఎఫ్‌ఎంసీజీ, పవర్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, పీఎస్‌యూ, హెల్త్‌కేర్, ఆటో, ఫార్మా రంగానికి చెందిన షేర్లు లాభాల్లో ముగిశాయి.

ఇన్ఫీ బైబ్యాక్‌లో షేర్లు విక్రయించనున్న ప్రమోటర్లు?

సెకండరీ మార్కెట్ ద్వారా వాటాదారుల నుంచి రూ.13 వేల కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు ఈమధ్య ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఇందులోభాగంగా ప్రమోటర్లు కూడా తమ వాటా నుంచి కొన్ని షేర్లను విక్రయించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఎన్‌ఆర్ నారాయణమూర్తితోపాటు ఇతర వ్యవస్థాపకులు, వారి కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో 12.75 శాతం వాటా (29.28 కోట్ల షేర్లు) కలిగి ఉన్నారు. బైబ్యాక్‌లో షేర్ల విషయంపై మూర్తి స్పందించేందుకు నిరాకరించారు. బైబ్యాక్‌లో భాగంగా ఒక్కో షేరును రూ.1,150కి కొనుగోలు చేయనున్నట్లు గతవారం ఇన్ఫోసిస్ బోర్డు ప్రకటించింది.

నీలేకని రిటర్న్‌తో దూసుకెళ్లిన కంపెనీ షేర్లు

నందన్ నీలేకని పునరాగమనంతో ఇన్ఫోసిస్ షేరు ధర భారీగా పుంజుకున్నది. కంపెనీ వ్యవస్థాపక సభ్యుడైన నీలేకని నూతన చైర్మన్‌గా నియమిస్తూ గత గురువారం బోర్డు నిర్ణయం తీసుకుంది. సోమవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 3.14 శాతం పెరిగి రూ.941.15 వద్దకు చేరుకుంది. ఇంట్రాడేలో 4.49 శాతం లాభపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,583.17 కోట్లు పెరిగి రూ.2,16,179.17 కోట్లుగా నమోదైంది. బీఎస్‌ఈలో 14.22 లక్షల షేర్లు ట్రేడవగా, ఎన్‌ఎస్‌ఈలో 2 కోట్ల షేర్లు చేతులు మారాయి.

డాక్టర్ రెడ్డీస్‌పై యూఎస్ కోర్టులో దావా!

న్యూఢిల్లీ, ఆగస్టు 28: అమెరికా కోర్టులో సంస్థపై నష్టపరిహార దావా దాఖలైందని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తెలిపింది. తప్పుదోవ పట్టించే స్టేట్‌మెంట్లతో అమెరికా ఫెడరల్ సెక్యూరిటీ చట్టాలను అతిక్రమించామని ఆరోపిస్తూ సంస్థకు చెందిన కొందరు ఇన్వెస్టర్లు న్యూజెర్సీ డిస్ట్రిక్ట్ కోర్టులో ఈనెల 25న క్లాస్ యాక్షన్ సూట్ దాఖలైందని బీఎస్‌ఈకి రెడ్డీస్ సమాచారం అందించింది. సరైన సమాచారం ఇవ్వని కారణంగా కంపెనీ షేర్ల ధర క్షీణత కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇన్వెస్టర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ దావాకు సంబంధించి సంస్థ ఇంకా నోటీసులందుకోలేదని, కాబట్టి ఆరోపణలపై ఇప్పుడే స్పందించలేమని పేర్కొంది. క్లాస్ యాక్షన్ సూట్ దాఖలైందన్న వార్త నేపథ్యంలో సోమవారం నాటి ట్రేడింగ్‌లో రెడ్డీస్ షేర్లు రెండు శాతం మేర క్షీణించాయి. బీఎస్‌ఈలో సంస్థ షేరు ధర 2.01 శాతం తగ్గి రూ.2,045.90 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2.78 శాతం పతనమై రూ.2,029.70 వద్దకు పడిపోయినప్పటికీ చివర్లో కాస్త కోలుకుంది.

ఈ ఏడాది 'ఏఏ+' రేటింగ్ బాండ్లలో 3వేల కోట్లు

ఈపీఎఫ్‌వో పెట్టుబడులపై కేంద్ర కార్మిక మంత్రి దత్తాత్రేయ

హైదరాబాద్, ఆగస్టు 28: ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) హై రేటెడ్ కార్పొరేట్ బాండ్లలో రూ.3 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనుందని కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. ఇప్పటివరకు ఈపీఎఫ్‌వో 'ఏఏఏ-' బాండ్లలో రూ.15 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టింది. అందులో నుంచి రూ.3,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకొని, ఆ సొమ్మును 'ఏఏ+' రేటింగ్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయాలని తాజాగా జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఏఏఏ రేటింగ్ బాండ్లతో పోలిస్తే ఏఏ+ బాండ్లు 0.25-0.45 శాతం అధిక రిటర్నులు పంచుతున్నాయన్నారు. కనీసం రెండు రేటింగ్ ఏజెన్సీల ద్వారా 'ఏఏ+' రేటింగ్ పొందిన కార్పొరేట్ బాండ్లలో మాత్రమే పెట్టుబడులు పెట్టనున్నట్లు దత్తాత్రేయ స్పష్టం చేశారు. అంతేకాదు, రూ.1000 కోట్ల కంటే అధిక నెట్‌వర్త్ కలిగి ఉండటంతోపాటు వరుసగా గత మూడేండ్ల నుంచి లాభాలు ఆర్జిస్తున్న కంపెనీల బాండ్లనే పెట్టుబడులకు ఎంచుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో(ఈటీఎఫ్) ఈపీఎఫ్‌వో పెట్టుబడులపై మంత్రి స్పందిస్తూ.. ఇప్పటివరకు సెన్సెక్స్, నిఫ్టీ ఈటీఎఫ్‌లలో రూ.27 వేల కోట్లు ఇన్వెస్ట్ చేయడం జరిగిందన్నారు. గతనెల చివరి నాటికి ఈటీఎఫ్ పెట్టుబడులపై రిటర్నులు 12.55 శాతంగా నమోదయ్యాయని అన్నారు. పీఎఫ్ చందాదారులకు తమ ఖాతాలోని సొమ్ముపై గతసారికి చెల్లించిన 8.65 శాతం వడ్డీతో పోలిస్తే ఈటీఎఫ్ పెట్టుబడులపై చాలా అధిక రిటర్నులు ఆర్జిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

బీఎస్‌ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 295.25(295.45)2324
Ace Software Exports 18.3(18.3)45
Aci Infocom 5.71(6.01)3850
Aditya Spin 8.12(8.5)160
Agro Tech Foods 531.65(542.9)399
Aishwarya Telcom 4.76(4.75)2943
Alphageo 768.75(767.15)2688
Alufluoride 65.35(63.55)98317
Alumeco 2.35(2.31)4950
Amara Raja 772.05(778.55)535120
Andhra Bank 52.75(52.3)104090
Andhra Cements 9.26(8.64)32657
Andhra Petroch 31.35(32.05)58889
Andhra Sugars 337.4(336.95)6959
Anjani Portl 236.15(214.95)8810
Astra Micro 125.2(122.35)21091
Aurobindo 741.35(732.5)177667
Avantel 259.45(252.45)8296
Avanti Feeds 1883.05(1920.3)13228
Avon Organics 4.91(5.1)8110
B N Rathi Securities 33.9(31.0)6741
B2b Software 10.09(9.61)310
Balaji Amines 311.8(311.2)5561
Bambino Agro 185.0(176.2)4742
Bartronics India 13.95(13.95)15184
Bgr Energy Sys135.05(134.45)10080
Bhagiradha Chem 190.1(199.85)3700
Bhagyaind 21.65(21.75)6908
Bhagyanagar W. 25.15(25.9)1202
Bnr Udyog 51.0(48.15)11488
Brilliant Secur8.68(8.27)339978
Cambridge Tech 77.9(76.4)1077
Cat Tech 0.63(0.6)854
Ccl Products 281.4(277.0)5377
Celestial Labs 24.0(22.85)12622
Cil Securities 29.3(28.9)581
Color Chips 46.4(46.7)17816
Combat Drugs 11.71(11.71)412
Coromandel Fert 441.15(428.9)8770
Country Club 13.24(13.1)12459
Cubex Tubings 16.35(16.45)1252
Danlaw Tech. 50.0(47.5)1204
Deccan Cem1118.1(1120.05)650
Denisons Hyd 1161.0(1145.0)193
Dhan Roto Sp 19.25(20.1)1025
Diamond Infras 21.15(20.6)20096
Divi's Lab 694.6(673.1)198571
Divyashakti Gr 103.95(100.0)1375
Dolphin Med 1.14(1.1)15105
Dr Reddy`s 2045.95(2087.9)78278
Empee Sugars 5.3(5.09)5414
Everest Org 103.0(102.25)548
Facor Alloys 3.68(3.73)42562
Firstobj 15.75(16.0)8900
Fortune Info 87.55(88.35)24798
Four Soft 90.7(94.5)1282
Gati 114.45(113.5)79545
Gayatri Proj 179.4(175.45)24043
Gayatribi 8.13(8.4)706
Gennex 3.99(3.95)65241
Gmr Infra 17.45(17.25)1889389
Goldinfra 143.9(137.05)169705
Goldstone Tech 11.0(10.71)17796
Gowra Leasing & Fin 22.7(23.8)18
Granules Ind 130.15(130.0)106643
Gss America Info 22.9(22.85)20000
Gulf Oil Corp 525.05(519.55)2664
Gvk Pwr 12.03(11.46)452345
Hbl Power 44.95(44.2)34947
Heritage Food 1423.7(1373.05)5125
Hifco Marwel 18.85(18.85)10
Hind Fluro 13.15(13.8)900
Hindustan Bio Sci0.78(0.81)4300
Hyderabad 1207.65(1113.2)15620
I V R Cons 5.01(4.97)76870
I.c.s.a. 2.7(2.55)5280
Incap 51.4(54.1)3866
Infotech Ent 534.95(531.35)9383
Invinex Lab 128.25(122.15)838
Ivrcl Infrastruc 5.01(4.97)76870
K C P 102.35(102.1)9231
Kakatiya Cem 346.25(338.35)3944
Kallam Spinning 31.5(34.0)137476
Karan Woosin 1.1(1.05)600
Kaveri Seed 549.05(541.25)29442
Kernex Mic. 36.0(35.0)2757
Knr Constru 214.45(217.65)2104
Krebsbio 93.2(92.8)51
Lanco Ind 361.0(368.15)6696
Lanco Infratech 0.88(0.92)1574635
Livewell Home Fin 70.0(67.1)1125
Lokesh Mach 81.4(80.5)5238
Lotus Chocolate 28.0(29.45)400
Madhucon Proj 28.45(28.55)9770
Maytas Infra 40.65(41.45)12211
Medinova Diagno 20.7(19.75)50
Mhril 361.7(352.95)4067
Mic Electronics 7.82(7.73)20978
Moldtek 53.15(50.0)65709
Moschip Semi 46.5(46.25)30732
Msr India Ltd 32.9(34.5)471334
N C L Ind 240.15(231.5)40270
Nagarjuna Agri 35.35(34.0)27118
Nagarjuna Agri Tech 4.1(4.2)1902
Nagarjuna Con 86.55(86.5)92687
Natco Pharma 714.2(726.1)62918
National Min 122.4(122.2)151146
Nbventure 122.0(121.85)17716
Neha International 4.75(4.9)181380
Neha Int 4.75(4.9)181380
Neocure Thera 3.3(3.2)5299
Nettlinx 84.3(82.75)18375
Neuland Lab 1235.95(1236.0)490
Nile 596.45(594.05)12822
Oil Country 43.7(43.5)560
Online Media Sol 0.38(0.4)575
Padmalaya Tel 7.32(7.23)12350
Pankaj Polymers 12.14(11.91)3300
Panyam Cem 61.15(58.95)21538
Peeti Securities 5.93(5.65)100
Pennar Ind 63.0(61.65)253614
Pflinfotc 5.77(5.77)2327
Phaarmasia 24.0(23.1)49
Pharmaids Pharma 3.15(3.0)2500
Phyto Chem 46.05(45.5)1766
Pitti Lamin 61.1(60.35)27781
Pokarna 1258.65(1246.9)1384
Prajay Eng 8.85(8.43)62374
Premier Expl 446.55(447.35)1370
Prism Cement 110.1(109.5)9473
Rain 145.0(145.55)231069
Raj Packaging 59.25(60.6)28571
Rajvir Industries 42.75(41.5)296
Ram Informatics 47.5(46.5)55
Regency Ceramic 5.7(5.46)401
Restile Ceramics 5.1(5.0)7336
Roopa Industries 12.95(12.48)10
Rubra Medicaments 3.46(3.3)1100
Sagar Cements 811.1(824.4)290
Salguti Plast 17.1(18.0)1
Samkrg Pistons 263.9(258.1)3773
Sampre Nutritions 43.4(42.4)489
Sanghi Ind 85.25(82.05)66932
Sanjeevni Indust 28.75(28.4)13846
Sark Sys 73.4(73.2)8355
Sathavahana Ispat 46.3(41.45)136262
Saven Tech23.25(22.8)1720
Sibar Auto 14.69(15.46)3222
Sks Microfin886.7(880.35)83640
Sms Pharma79.25(80.2)14115
Softpro Sys 4.92(5.17)750
Southern Online Bio3.2(2.92)32478
Sr Ray Alkalies 30.85(30.3)414280
Sree Rayalaseema 125.25(126.45)1713
Srinivasa Shipp 72.8(65.8)20203
Steel Exchange 82.6(84.45)61563
Sujana 0.97(0.99)27900
Sujana Towers 4.3(4.05)6101
Sujanametal 1.66(1.59)9800
Surana Telecom 4.65(4.65)9015
Suryaamba 66.0(63.0)2046
Suryachakra Power 1.13(1.08)28491
Suryalak Cott 99.4(99.95)1720
Suryalata Spin 137.95(139.9)113
Suvarna Cem 159.8(154.0)938
Suven 166.75(167.55)25876
Taj Gvk 153.5(155.95)2871
Tanla Solutions 32.75(32.1)42000
Tci 1696.8(1616.0)1
Tci Fin 21.0(21.75)10950
Transcorp Int21.0(20.95)35434
Transgene Biotek 2.47(2.37)32435
Transport Co 287.7(274.65)11890
Trendy Knitwear 0.19(0.19)49625
Tyche 82.2(83.45)17812
Unisocks 3.58(3.51)2533
Usher 6.65(6.54)7226
V B C Ferro 39.0(39.8)158
V S T Ind 2690.45(2692.25)95
Vamshi Rubber 63.0(60.3)1453
Viceroy Hotels 18.4(17.45)64283
Vijay Textiles 65.6(63.4)91871
Vimta Labs 130.9(130.25)7044
Virat Crane 36.3(37.45)3117
Virnichiq 74.95(76.25)44929
Visaka Ind 627.05(540.7)186892
Vista Pharma 33.5(32.5)49187
Vivmed Labs 102.55(102.9)51665
Vmf Softech 99.9(89.0)66408
Waterbase 115.45(118.15)100326
Xl Energy Ltd 1.65(1.74)460
Ybrant Digital 6.18(6.44)2081898
Zen Tech50.5(50.2)13901
Zenotech 48.0(47.8)11276


సంగారెడ్డి జిల్లా సింగూర్ జలాశయంలోకి చేరిన వరద నీరు


భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

జలాశయాలు కళకళ

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రస్తుతం 10,305 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 5,600గా ఉన్న ఇన్‌ఫ్లో క్రమంగా పెరిగింది. ఈ సీజనులో ఎగువ ప్రాంతాల నుంచి 21.674 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు 90.313 టీఎంసీలు కాగా సోమవారం సాయంత్రానికి 1070 అడుగులతో 28.871 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఇప్పటికే భారీ వర్షాలతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా, ప్రస్తుతం వరద గేటు ద్వారా గోదావరికి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 698.475 (7.208టీఎంసీల) వద్ద ఉంది. సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 4971 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రధాన గేటు ద్వారా 5200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సారంగాపూర్ మండలం స్వర్ణ ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం1183 అడుగులకు ప్రస్తుతం 1181 అడుగుల వరకు నీరుంది. ప్రాజెక్టులోకి 1685 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1165 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. పూర్తిస్థాయి నీటి మట్టం 17.802 టీఎంసీలు(1405 అడుగులు) గాను ప్రస్తుతం 1385.42 అడుగులు 2.483 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కళ్యాణి ప్రాజెక్టు 409.50 మీటర్ల లెవల్‌కు గాను 409.20 మీటర్లకు చేరుకుంది. ఎగువ నుంచి 390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. పోచారం ప్రాజెక్టులోకి 539 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సోమవారం సాయంత్రానికి 1.820 టీఎంసీల పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో 277 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సింగూరు జలాశయంలోకి 7093 క్యూసెక్కుల వరద వస్తున్నది. డ్యాంలో గత యేడాది ఇదే రోజు కేవలం 6.7టీఎంసీల నీరుండగా ప్రస్తుతం 521.525మీటర్లకు 20.366టీఎంసీలకు చేరింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం కొనసాగుతుంది. సోమవారం సాయంత్రం వరకు 3757 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.3373 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు, కిన్నెరసాని, పెద్దవాగు, మూకమామిడి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పది గేట్లను మూడడుగుల మేర ఎత్తి 27,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నీటి మట్టం 72.00 మీటర్లుగా ఉంది. ఇన్‌ఫ్లో 25 వేల క్యూసెక్కులుగా నమోదవుతున్నది. పాల్వంచలోని కిన్నెరసాని రిజర్వాయర్ నీటి మట్టం 406.8 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది. తుంగభద్ర నదికి స్వల్ప నీటి వరద వస్తున్నది. దీంతో ర్యాలంపాడు, సుల్తానపురం గ్రామాల వాళ్లు వేసుకున్న తాత్కాలిక మట్టి రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది.

వర్షం.. హర్షం..



మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎలకుర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండువాగు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. పంట చేలల్లో నీళ్లు చేరాయి. వాగులు వంకలు పొంగి పొర్లాయి. పలు చెరువులు మత్తడి దుంకి అలుగు పోయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 9 సెంటీమీటర్ల వర్షం కురిసినట్టు అధికారులు తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో తెల్లవారు జాము నుంచి వర్షం కురిసింది. అయిజలో 58మిల్లీ మీటర్ల వాన పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్, మాక్లూర్, నందిపేట్ మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 1.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో అత్యధికంగా 26.8 మి.మీ. నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలోని కుభీర్‌లో అత్యధికంగా 10.95 మి.మీ. వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 2.1 మి.మీ. వాన పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలంలోని సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గుల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. మెదక్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతున్నది. భారీ వర్షానికి వేములవాడ పట్టణం జలమయమైంది. రాజన్న ఆలయ పరిసరాలు, జాతర గ్రౌండ్, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దుకాణాల్లోకి వరదనీరు చేరగా వ్యాపారులు నీటిని తొలగించుకున్నారు. పట్టణంలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.


రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆలయం ఎదుట వరద నీరు


జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని ఓ పత్తి చేనులో నిలిచిన నీరు

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 537.626 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	20792	11023	1705	1703.90	128.72	123.67
నారాయణపూర్	9868	10217	1615	1611.98	37.646	33.51
జూరాల	2546	2025	1045	1038.58	9.66	6.034
తుంగభద్ర	6929	1187	1633	1620.76	100.86	60.31
శ్రీశైలం	1167	25	885	783.50	215.807	21.75
నాగార్జునసాగర్	0	471	590	500.00	312.045	115.31
పులిచింతల	1582	0	175	124.67	45.77	4.99
ప్రకాశం బ్యారేజీ	11083	11083	56.75	56.25	3.070	2.89

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	12309	241	1522	1515.31	102.732	76.96
కడెం	4971	723	700	698.475	7.6	7.208
ఎస్సారెస్పీ	10305	392	1091	1070	90.313	28.871
సింగూరు	7093	300	1717.93	1711.3	29.91	20.34
నిజాంసాగర్	1165	70	1405	1385.42	17.803	2.483
ఎల్లంపల్లి	8410	660	485	477.99	20.175	14.337
లోయర్‌మానేరు	0	129	920	893.40	24.07	7.292
ధవళేశ్వరం	161201	160043	45	45	2.93	2.93


పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

ప్రభుత్వ కళాశాలలకు పెరిగిన ఆదరణ

సంగారెడ్డి అర్బన్, నమస్తే తెలంగాణ/సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో విద్యార్థుల నుంచి ఆదరణ పెరిగిందని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. గతంలో 60 శాతం ఉన్న అడ్మిషన్లు ప్రస్తుతం 95 నుంచి 98 శాతానికి పెరిగినట్టు చెప్పారు. సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్‌ఖాన్‌పేట పరిధిలో నూతనంగా నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కడియం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యను అందించేందుకు 525 గురుకులాలను, 57 పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెద్దపల్లిలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఈటల, చిత్రంలో ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు తదితరులు

కాంగ్రెస్ హయాంలో కరెంట్ షాక్‌లే

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సమైక్య రాష్ట్రంలో రైతులు కరెంట్ షాక్‌లు, పాము కాట్లకు గురయ్యారని, వారి సమస్యలను అప్పటి పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. సోమవారం పెద్దపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు సమన్వయ సంఘాల ఏర్పాటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి ఈటల మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతను మరిచిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు రైతుల పేరిట మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ సర్కార్ రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. కొత్తగా ఏర్పాటయ్యే రైతు సమన్వయ సమితుల కోసం వచ్చే బడ్జెట్‌లో రూ. 500 కోట్ల మూల ధనం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రైతులను చక్రవర్తులుగా మార్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ అన్నారు. కేసీఆర్ అధికారం చేపట్టిన రోజు నుంచే రైతుల ప్రయోజనం కోసం అనేక కార్యక్రమాలు తీసుకొస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహాయజ్ఞంలా భూసర్వే



వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: రైతన్నలు బాగుపడాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సీఎం ఆదేశాల మేరకు భూ సర్వే, రైతు సమన్వయ సమితుల ఏర్పాటు వంటి కార్యక్రమాలను మహాయజ్ఞంలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు. సోమవారం వనపర్తిలో నిర్వహించిన టీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎకరాకు రూ.8 వేల సాగు పెట్టుబడులు అందజేయాలన్న తపనతో సీఎం కేసీఆర్ ఉన్నారన్నారు. ఇందుకోసం రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నట్టు చెప్పారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కమిటీలను వేసి, రైతులను సంఘటితపరిచి పకడ్బందీగా పెట్టుబడుల పథకాన్ని ప్రభుత్వం నడిపించబోతున్నదన్నారు. గడువులోగా కమిటీలను పూర్తిచేసి భూసర్వే సైతం చేపట్టి, దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలకు చెక్ పెట్టాలన్న ముందుచూపుతో సీఎం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రజలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్న ప్రతిపక్షాలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు.

నష్కల్ స్టేషన్‌లో విరిగిన రైలు పట్టా

గూడ్స్‌కు తప్పిన ముప్పు.. పలు రైళ్లు ఆలస్యం

కాజీపేట(వరంగల్ అర్బన్): జనగాం జిల్లా నష్కల్ రైల్వేస్టేషన్‌లో సోమవారం రైలు పట్టా విరిగింది. ఈ ఘటనతో గూడ్స్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. కాజీపేట రైల్వే జంక్షన్ యార్డు నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన గూడ్స్ నష్కల్ రైల్వే స్టేషన్‌లో లూప్‌లైన్‌లో ఆగింది. తిరిగి బయలుదేరుతూ మెయిన్ లైన్ పట్టాల్లోకి వెళ్తున్న క్రమంలో రైలు పట్టా వెల్డింగ్ జాయింట్ ఊడిపోయిన విషయాన్ని అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది స్టేషన్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్రమత్తమై గూడ్స్‌ను నిలిపివేశారు. ఆ వెంటనే సికింద్రాబాద్ రైల్వే జంక్షన్ ఇంజినీరింగ్ సిబ్బంది తరలివచ్చి దాదాపు గంటన్నరపాటు మరమ్మతులు చేపట్టారు. ఈ కారణంగా విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్ పెండ్యాల్ స్టేషన్‌లో గంటపాటు, బల్లార్ష నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేట రైల్వే జంక్షన్‌లో అరగంటకుపైగా నిలిచిపోయాయి. వీటితోపాటుగా సికింద్రాబాద్ వైపు పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

వచ్చే జూన్ కల్లా కాళేశ్వరం నీళ్లు


సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు.. హాజరైన జనం

- 10 నెలల్లో కాళేశ్వరం రివర్స్‌పంపింగ్ పనులు పూర్తి
- ప్రతి మండలానికో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం: మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల ప్రతినిధి/నమస్తే తెలంగాణ : పదినెలల్లో కాళేశ్వరం రివర్స్ పంపింగ్ పనులు పూర్తి చేసి, వచ్చే జూన్ నాటికి పంటలకు నీళ్లు ఇస్తామని నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రకటించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో కేడీసీసీ బ్యాంకు శాఖను, సింగిల్ విండో కార్యాలయాన్ని, అనంతరం ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం పెగడపల్లిలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సీఎం ఆలోచనల్లో నుంచి పుట్టుకు వచ్చిన గొప్ప ప్రణాళికే కాళేశ్వరం రివర్స్‌పంపింగ్ అన్నారు. కేవలం వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితం కానున్న ఈ పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఇప్పటికే పంప్ హౌస్‌ల నిర్మాణం ప్రారంభమైందన్నారు. చైనాకు విద్యుత్ మోటర్ల కోసం ఆర్డర్ ఇచ్చామని చెప్పారు. మిడ్ మానేర్ పనులను తాము ప్రారంభించామని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారని, అయితే 2005 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దానికి కేవలం రూ.106 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడేండ్లలో 407 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేయించిందన్నారు. వచ్చే ఏడాది మిడ్‌మానేర్‌లో పది టీఎంసీల నీటిని నింపి, హుస్నాబాద్, మానకొండూర్ మండలాల్లోని లక్ష ఎకరాలకు నీరు ఇస్తామన్నారు. కాళేశ్వరం రివర్స్ పంపింగ్ పూర్తి అయ్యేనాటికి కాలువలన్నీ బాగు చేయాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రూ. 806 కోట్లు కేటాయించారన్నారు. రైతుల సమస్యలను గుర్తించిన సీఎం కేసీఆర్ భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టారన్నారు. ఇందులో భాగంగా మండలానికో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. ప్రసవాల కోసం ప్రైవేటు దవాఖానలకు వెళ్లవద్దని, సర్కారు వైద్యశాలల్లో మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఎంపీ బాల్క సుమన్ కూతురు స్నానానికి వాడే జాన్సన్ కంపెనీ సబ్బునే కేసీఆర్ కిట్‌లోనూ సమావేశంలో చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఐడీసీచైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

మానేర్ రివర్‌ఫ్రంట్ తెలంగాణకు పెద్ద ఆస్తి

కొత్తపల్లి: మానేర్ రివర్ ఫ్రంట్ తెలంగాణకు పెద్ద ఆస్తి అని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. హరితహారంలో భాగంగా కరీంనగర్ మండలం రేకుర్తి శివారులోని కిమ్స్, సహజ మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్క నాటి మాట్లాడారు. గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా నదిపై ఉన్న రివర్‌ఫ్రంట్ మాదిరిగా ఎల్‌ఎండీ కింది భాగంలో రూ.506 కోట్లతో నిర్మించే మానేర్ రివర్‌ఫ్రంట్ కరీంనగర్‌కు పెద్ద ఆస్తి అని అన్నారు. ఇది పూర్తయిన తరువాత ఇక్కడి పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటితోపాటు జిల్లాల్లో ఐటీ టవర్స్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఖమ్మం, సిరిసిల్ల, వరంగల్‌లో నిర్మాణాలను ప్రారంభించారని, కరీంనగర్‌లోనూ ఐటీ నిర్మాణాల కోసం 25 ఎకరాల స్థలం కేటాయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

'అసైన్డ్'నిర్వాసితులకు న్యాయం చేస్తాం

రామడుగు : కాళేశ్వరం ప్రాజెక్ట్ -8వ ప్యాకేజీ పరిధిలో గల కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని అసైన్డ్ భూముల నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. పెగడపల్లి మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సంలో భాగంగా వెళ్తూ గోపాల్‌రావుపేటలో స్థానిక ఎమ్మెల్యే బొడిగ శోభ విజ్ఞప్తి మేరకు కొంతసేపు ఆగారు. నిర్వాసిత రైతులతో కలిసి ఎమ్మెల్యే మంత్రికి వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ నిర్వాసిత రైతులు ఆందోళన చెందవద్దని, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైతు సమితులకు రూ. 500 కోట్లు

- సెప్టెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ఏర్పాటు
- మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి


వసతి గృహాలను ప్రారంభించిన మంత్రి పోచారం, చిత్రంలో ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు తదితరులు

సంగారెడ్డి అర్బన్, నమస్తే తెలంగాణ /సంగారెడ్డి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా రైతులను సంఘటితం చేసేందుకు రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కంది శివారులోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో వసతి గృహాలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి సమన్వయ సమితికి రూ. 500 కోట్లను సీఎం కేసీఆర్ కేటాయించారన్నారు. రైతులకు నాలుగు విధాల సహాయం అందిస్తే రైతే రాజు అవుతాడని అన్నారు. సకాలంలో నాణ్యతతో కూడిన విత్తనాలను అందించడం, అవసరమైన పెట్టుబడులు సమకూర్చడం, అధిక దిగుబడులు వచ్చే వంగడాలను సృష్టించడం, పండిన పంటకు కనీస మద్దతు ధర లభించేలా చూడడం కీలకమన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసేలా సీఎం కేసీఆర్ అనేక రాయితీలు ప్రకటిస్తున్నారన్నారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో గ్రామ సమన్వయ సమితిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామ రైతు సమన్వయ సమితిలో అన్ని కులాలకు సంబంధించిన 15 మంది సభ్యులుంటారని, వారిలో 33శాతం మంది మహిళా రైతులు కూడా ఉంటారన్నారు. 24 మందితో మండల, మరో 24 మందితో జిల్లా, 42 మందితో రాష్ట్ర సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమన్వయ సమితుల ద్వారా ఎవరు ఏ పంటలు పండిస్తారో లెక్కలు రాసుకోవడం, దానికి సరిపోను విత్తనాలను 17రోజుల ముందుగానే ఏఈవోలు రైతులకు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అగ్రికల్చర్ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

సింగితం కాలువల పరిశీలన

మద్నూర్ : కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని మహ్మద్‌నగర్ వద్ద సింగితం రిజర్వాయర్ కాలువను మంత్రి పోచారం పరిశీలించారు.

త్వరలో తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో కోల్పోయిన గిరిజన విశ్వవిద్యాలయం టీఆర్‌ఎస్ ప్రత్యేక చొరవతో స్వరాష్ట్రంలో ఏర్పాటు కానున్నదని మహబూబాబాద్ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే గిరిజన విద్యార్థులకు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ నేతృత్వంలో 66 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లతోపాటు అనేక ఆశ్రమ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణను ఇప్పిస్తున్నదని పేర్కొన్నారు. 2017-18 విద్యా సంవత్సరంలో పేద విద్యార్థుల కోసం 50 గురుకుల పాఠశాలలు, 22 గురుకుల డిగ్రీ కళాశాలలు ప్రారంభించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. డిగ్రీ కళాశాలల్లో 75 శాతం సీట్లు గిరిజనులకు, 25 శాతం సీట్లు అర్హులైన ఇతర వర్గాల వారికి ప్రభుత్వం కేటాయించినట్టు చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల వీరంగం

పరిహారం కోసం విపక్షాల పేరిట ధర్నా.. కానిస్టేబుల్‌పై దాడి


తహసీల్ కార్యాలయ గేటును ధ్వంసం చేసిన దృశ్యం. (పక్కన) దాడిలో గాయపడిన కానిస్టేబుల్ జాకీర్

జడ్చర్ల రూరల్: ఉదండాపూర్ భూనిర్వాసితులకు న్యాయం చేయాలంటూ విపక్షాల ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల తహసీల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో కాంగ్రెస్ నాయకులు వీరంగం సృష్టించారు. కార్యాలయ గేటును ధ్వంసం చేసి, కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. జడ్చర్ల మండలం ఉదండాపూర్ వద్ద నిర్మించే రిజర్వాయర్‌తో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అక్కడితో ఆగకుండా రాస్తా రోకోకు దిగారు. అనంతరం ఒక్కసారిగా కార్యాలయంలో దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. సీఐ గంగాధర్ తన సిబ్బందితో కలిసి అడ్డుకునే ప్రయత్నం చేయగా కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోయి కార్యాలయ గేటును ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ జాకీర్ చొక్కా పట్టుకుని లాగారు. అతను వెళ్లిపోతుండగా వెంబడించి మరీ దాడి చేసి వీరంగం సృష్టించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

రైళ్లల్లో తరలిస్తున్న గంజాయి పట్టివేత

ఖిలావరంగల్/మారేడ్‌పల్లి: కాజీపేట, సికింద్రాబాద్ పరిధిలో సోమవారం కోణార్క్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో తనిఖీలు చేపట్టగా 132 కిలోల గంజాయి లభించింది. మొత్తం ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు. వరంగల్, కాజీపేట రైల్వే పోలీసులు సోమవారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టారు. 82 కిలోల గంజాయి లభించగా, నిందితులు మహారాష్ట్ర తూర్పు ముంబైకి చెందిన రాణి నాయుడు, రవి మరియప్పన్ దేవర్, ఆర్తి, ప్రతిభలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ గంజాయి విలువ రూ.8 లక్షలు ఉంటుంది. కాగా ఒడిశా నుంచి ముంబై వెళ్తున్న ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టి 50 కిలోల గంజాయిని పట్టుకుని, ముగ్గురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

మేకల మందపైకి దూసుకెళ్లిన లారీ..

ములకలపల్లి: మేకల మందపైకి లారీ దూసుకువెళ్లిన ఘటనలో కాపరి మృతి చెందగా ఆరు మేకలు మృత్యువాతపడ్డాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం, మాదారం మధ్య సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఏన్కూరు మండలం తిమ్మారావుపేట శివారు రాజులింగాలకు చెందిన ఇరపా వెంకన్న (40), పూసుగూడెం పంచాయతీ ఒడ్డురామారం గ్రామానికి చెందిన బాణోతు కుమార్ కలిసి పూసుగూడెంలో ఓ రైతు వద్ద జీతానికి ఉండి మేకలు కాస్తున్నారు. ఉదయం ఇద్దరు కలిసి మేకలను మేపి ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో మాదారం-పూసుగూడెం మధ్య ఈదుల వాగు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ మేకల గుంపుపైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో వెంకన్నతోపాటు ఆరు మేకలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి.

నా పనైపోలేదు!

ప్రపంచ పతకంతో మళ్లీ సత్తా చాటాను

రిటైర్మెంట్‌పై ఆలోచనే లేదు

కామన్వెల్త్, ఆసియా క్రీడలపై దృష్టి

నమస్తే తెలంగాణ తో సైనా నెహ్వాల్



ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ హోదా అందుకున్న సైనా నెహ్వాల్ వరుస వైఫల్యాలతో ఏకంగా 16వ ర్యాంక్‌కు పడిపోయింది.. ఒకప్పుడు వరుస సూపర్‌సిరీస్ టైటిళ్లతో చరిత్ర సృష్టించిన ఈ ఒలింపిక్ పతక విజేత ఖాతాలో ఏడాదిన్నరగా ఒక్క మేజర్ టైటిల్ లేకపోయింది.. గతేడాది రియో విశ్వక్రీడల్లో నూఫ్యాంగా క్వార్టర్స్‌కు ముందే వెనుదిరుగడం.. ఆ తర్వాత మోకాలి గాయంతో దాదాపు ఆటకు దూరమవ్వాల్సిన పరిస్థితి తలెత్తింది.. ఓవైపు తన జూనియర్ పీవీ సింధు మేజర్ విజయాలతో దూసుకెళుతుంటే సైనా గ్రాఫ్ అంతకంతకూ పడిపోసాగింది.. దీంతో సైనా పనైపోయిందనుకున్నారంతా.. ఇక వీడ్కోలు తీసుకునే సమయం ఆసన్నమైందన్న విమర్శలూ వినిపించాయి. అయినా ఇవన్నీ ఏమాత్రం పట్టించుకోని సైనా గాయం నుంచి పూర్తిగా కోలుకొని మళ్లీ ఆటపై దృష్టి సారించింది.. కఠోరంగా సాధన చేసింది.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండోసారి పతకంతో మెరిసి గోడకు కొట్టిన బంతిలా పైకెగసింది.. ఇప్పుడు తన కెరీర్‌లో రెండో ఇన్నింగ్స్ మొదలైనట్లుందంటున్న సైనా.. మరికొన్నేండ్లు తాను బ్యాడ్మింటన్ ఆడగలనన్న ఆత్మవిశ్వాసాన్ని ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం అందించిందని 'నమస్తే తెలంగాణ'తో చెప్పింది. టోర్నీతోపాటు కెరీర్‌కు సంబంధించి సైనా పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

రెండోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడంపై..

2015లో జకార్తా వేదికగా జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించాను. మళ్లీ రెండేండ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌లో పతకం అందుకోవడం గర్వంగా ఉంది. అయితే, ఈసారి కాంస్యం లభించింది. ఇందుకు నిరాశేమీ లేదు. ఎందుకంటే, ప్రస్తుతం నేనున్న ఫామ్ ప్రకారం ఈ టోర్నీలో నేను పతకం సాధించానంటేనే అది గొప్ప ప్రదర్శనగా ఫీలవుతున్నాను. ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లాంటి ఈవెంట్లలో అత్యుత్తమ షట్లర్లు పోటీపడుతారు. వీళ్లను దాటుకొని వెళ్లి పతకం సాధించడమంటే మామూలు విషయం కాదు.

సెమీస్‌లో జపాన్ అమ్మాయి ఒకుహర చేతిలో ఓటమిపై..

సెమీఫైనల్ ప్రత్యర్థి అయిన నొజొమి ఒకుహరపై గతంలో నాకు మెరుగైన రికార్డు ఉంది. ఈ టోర్నీకి ముందు దాకా మేమిద్దరం ఏడుసార్లు తలపడితే, ఆరుసార్లు నాదే విజయం. ఎప్పుడూ ఒక్కరే గెలువడం సాధ్యం కాకపోవచ్చు. ఆరోజు నాకు కలిసిరాలేదంతే. అయినా, ఒకుహర చాలా అద్భుతంగా ఆడింది. పట్టుదలగా పోరాడి పైచేయి సాధించింది. ఆమె ఎంత అద్భుత క్రీడాకారిణో అన్నది ఫైనల్లో సింధుపై ఆమె గెలిచిన తీరే చెబుతుంది.



పతకాలతో సింధు, సైనా

రెండేండ్ల కిత్రం ఈ టోర్నీకి ముందు ఎలాగో.. ఇప్పుడూ అలాంటి అనుభవమే!

నిజమే.. అప్పుడెలా ఉందో ఇప్పుడూ నా పరిస్థితి అలాగే ఉన్నది. 2015లో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం గెలిచే ముందు వరుస పరాజయాలతో తీవ్ర నిరాశలో ఉన్నా. ఓ దశలో ఆటకు గుడ్‌బై కూడా చెప్పాలనుకున్నాను. కానీ, ఆ టోర్నీలో పతకం గెలిచిన తర్వాత నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మళ్లీ పుంజుకున్నాను. ఇప్పుడూ అలాంటి అనుభవాన్నే చవిచూశాను. కానీ, ఈసారి రిటైర్మెంట్ గురించి మాత్రం ఆలోచించలేదు. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడే మనోనిబ్బరంగా ఉండాలనుకున్నా.

నిన్నటిదాకా వరుస వైఫల్యాలు.. ఇప్పుడు ప్రపంచ టోర్నీతో ఫామ్‌లోకి రావడం..

గతేడాది రియో ఒలింపిక్స్‌లో మోకాలి గాయానికి గురవడం కెరీర్‌పై చాలా ప్రభావం చూపించింది. రియో నుంచి నేరుగా దవాఖానకు చేరుకున్నాను. మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాను. విశ్వక్రీడల తర్వాత ఆరునెలలకుపైగా ఆటకు దూరమయ్యాను. దీంతో వరుసగా నాలుగు సూపర్‌సిరీస్ ఈవెంట్లలో ఆడలేకపోయాను. ర్యాంకింగ్స్‌లో కిందకు పడిపోయాను. గతంలో ఎన్నడూ లేనంతగా ఏకంగా 16వ ర్యాంక్‌కు దిగజారాను. అయినా, కోచ్ విమల్ సార్ నాలో ఎంతో స్థైర్యాన్ని నింపారు. శిక్షణ సమయాన్ని పెంచారు. మానసికంగా ధృడంగా ఉండేలా తయారుచేశారు. మ్యాచ్ సందర్భంగా ఒత్తిడిలో ఉన్నప్పుడు కోచ్‌పై ఆధారపడకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకునేలా చేశారు. బలహీనంగా ఉన్న అంశాల్లో మెరగయ్యేలా చేశారు. అతని దగ్గర శిక్షణ తీసుకున్నాకే నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నా, ప్రతిష్ఠాత్మక ఆలింగ్లండ్ ఓపెన్‌లో ఫైనలిస్టుగా నిలిచా. ఇంకా ఎన్నో ఈవెంట్లలో గెలిచాను. నేనిప్పుడు మళ్లీ అత్యుత్తమ ఆటను ఆడుతున్నానంటే విమల్ సారే కారణం.

భవిష్యత్ ప్రదర్శనపై..

రిటైర్మెంట్‌పై నాలో ఎలాంటి ఆలోచన లేదు. నాలో ఇంకా ఆడగల సత్తా ఉందనడానికి ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ ప్రదర్శనే నిదర్శనం. గాయం కారణంగా ఈ సీజన్‌లో ఏడెనిమిది టోర్నీలకే పరిమితమయ్యాను. ఈ ఏడాది ఆరంభంలో మలేసియా గ్రాండ్ ప్రీ గోల్డ్ టైటిల్ గెలిచాను. ఇప్పుడిలా ప్రపంచ పతకంతో మళ్లీ ఫామ్‌లోకి రావడం అత్యంత సంతోషంగా ఉంది. వచ్చే ఏడాది నాకు మరింత కీలకం కానుంది. 2018లో కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలులాంటి క్లిష్టమైన టోర్నీల షెడ్యూల్ ఉంది. ఆ ఈవెంట్లలో రాణించాలనుకుంటున్నాను.

సింధు ఫైనల్ మ్యాచ్‌పై..

ఫైనల్లో సింధు, ఒకుహర మధ్య పోరు అద్భుతంగా సాగింది. ప్రతిపాయింట్ కోసం ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. వాళ్లిద్దరి ఆటతీరుతో మ్యాచ్‌ను అలాగే చూస్తుండిపోయాను. సుదీర్ఘంగా సాగింది. సింధుకు అద్భుత భవిష్యత్ ఉంది. కచ్చితంగా నంబర్‌వన్ ర్యాంకు అందుకుంటుందన్న విశ్వాసం ఉంది.

అప్పుడూ ఇలాగే..

కొంతకాలంగా మానసికంగా చాలా కుంగిపోయా.. ఓ దశలో బ్యాడ్మింటన్ వదిలేద్దామనుకున్నా..' రెండేండ్ల కిందట ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలిచాక సైనా అన్న మాటలివి. అవును.. నిజమే అప్పట్లో సైనా ఉన్న పరిస్థితి అలాంటిది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా నిలిచిన సైనా ఆ తర్వాత అనూహ్యంగా ర్యాంకింగ్స్‌లో కిందకు పడిపోయింది. వరుసగా టోర్నీల్లో పరాజయాలు.. అనామక క్రీడాకారిణుల చేతుల్లో ఓటములు చవిచూసింది. కానీ, ఏడాది తర్వాత అనూహ్యంగా పుంజుకున్న సైనా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఏకంగా రజత పతకం గెలిచి తనేంటో చాటుకుంది. ఏకంగా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. యాదృచ్ఛికమో ఏమోగానీ.. గతేడాది రియో ఒలింపిక్స్ తర్వాతా సైనాదీ ఇదే పరిస్థితి. మలేషియా గ్రాండ్ ప్రీ టైటిల్ మినహా ఒక్క సూపర్ సిరీస్ టైటిల్ కూడా సైనా నెగ్గలేకపోయింది. కానీ, ఇప్పుడిలా ఏకంగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మురిపించింది.

సెల్ఫీ అతిథి..



న్యూఢిల్లీ: గ్లాస్గోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత, కాంస్య పతకాలు అందుకున్న సింధు, సైనాలతో అక్కడి భారత అభిమానులు సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఇందులో ఏముంది.. ఇది మామూలే కదా అంటారా? అయితే, సాదాసీదా అభిమానిగా కనిపించిన ఓ విశిష్ట అతిథి కనిపించి సెల్ఫీకోసం అడిగే సరికి సైనా తండ్రి హర్వీర్ నెహ్వాల్, సింధు తల్లి విజయలక్ష్మి ఆశ్చర్యపోయారు. ఇంతకీ ఆ సెల్ఫీ అడిగిన వ్యక్తి ఎవరంటే, ప్రస్తుత ఒలిపింక్ చాంపియన్ కరోలినా మారిన్ తల్లి టోనీ మార్టిన్ కావడం విశేషం. అప్పటిదాకా అభిమానులతో కలిసి క్యూలో నిలబడ్డ టోనీ మార్టిన్.. తనవంతు వచ్చేవరకు వేచి చూసి మరీ సైనా, ఆమె తండ్రి, సింధు, ఆమె తల్లితో కలిసి సెల్ఫీలు దిగి తన ఆనందాన్ని పంచుకుంది. 2015 బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్లో సైనాను ఓడించిన కరోలినా మారిన్.. 2016 ఒలింపిక్స్ ఫైనల్లో సింధును ఓడించి స్వర్ణం గెలుచుకున్న సంగతి తెలిసిందే.


ఐపీఎల్ ఈ-వేలానికి
సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: ఐపీఎల్ మీడియా హక్కుల విషయంలో బీసీసీఐకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. వచ్చే ఏడాది నుంచి ఐదేండ్ల పాటు మీడియా హక్కుల కోసం ఈ-వేలం నిర్వహించాలని బీసీసీఐని ఆదేశించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఇంటర్నెట్, టెలివిజన్, మొబైల్ హక్కుల కోసం ఇప్పటికే బోర్డు బిడ్లను ఆహ్వానించింది. ఇందులో స్టార్ ఇండియా, సోనీ పిక్చర్స్ లాంటి ప్రముఖ మీడియా సంస్థలతో పాటు 24 కంపెనీలు బిడ్డింగ్‌లో పోటీపడుతున్నాయి. బిడ్లు దాఖలు చేసేందుకు వచ్చే నెల 4ను ఆఖరి తేదీగా నిర్ణయించారు. అయితే బోర్డు బిడ్డింగ్ ప్రక్రియలో భారీ ఎత్తున అవకతవకలు జరిగే అవకాశమున్నందున.. ఈ-వేలం జరిగేలా బోర్డును ఆదేశించాలంటూ బీజేపీ నేత సుబ్రమణ్యం స్వామి దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం తిరస్కరించింది. మరోవైపు ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా బిడ్డింగ్ కొనసాగుతున్నదని క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) వాదనను ముగ్గురు సభ్యులు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎమ్ ఖాన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నది. మీడియా హక్కులను కైవసం చేసుకునే క్రమంలో కంపెనీలు అన్నీ సీల్డ్ కవర్‌లో తమ బిడ్లను దాఖలు చేస్తున్నాయని, ఇందులో ఎలాంటి అవకతవకలు లేవని సీవోఏ తరపున సీనియర్ న్యాయవాది పరాగ్ త్రిపాఠి వాదించారు.

మహిళల క్రికెట్ జట్టుకు
మరిన్ని పర్యటనలు

న్యూఢిల్లీ: మహిళల క్రికెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు బీసీసీఐ ప్రణాళికలు రచిస్తున్నది. రానున్న భవిష్యత్తులో మహిళల క్రికెట్ జట్టుకు మరిన్ని పర్యటనలు రూపొందించేందుకు బోర్డు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీనికి తోడు ఇప్పటిదాకా ఆల్ ఇండియా జూనియర్ టోర్నీల్లో అండర్-19, అండర్-23 చోటు ఉండగా, దీన్ని అండర్-16కు విస్తరించే యోచనలో ఉన్నది. ఈ క్రమంలో క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) సభ్యురాలు డయానా ఎడుల్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళల కమిటీ బుధవారం సమావేశం అయ్యే అవకాశముంది. ఇందులో భారత మహిళల క్రికెట్ కెప్టెన్ మిథాలీరాజ్‌తో పాటు వెటరన్ బౌలర్ జులన్ గోస్వామి, బీసీసీఐ క్రీడాభివృద్ధి జీఎమ్ రత్నాకర్‌శెట్టి పాల్గొననున్నారు. 'దేశవాళీ షెడ్యూల్‌ను అనుసరించి మహిళల 'ఎ' జట్టుకు పర్యటనల ప్రణాళికను రూపొందిస్తాం. జాతీయ జట్టుకు రిజర్వ్ బెంచ్‌ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు ఇలాంటివి కావాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్‌కు మన దేశవాళీ క్రికెట్‌కు చాలా వ్యత్యాసం ఉందని కెప్టెన్ మిథాలీరాజ్ పలుమార్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో యువ క్రికెటర్లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు పర్యటనలు ఉపయోగపడుతాయి' అని బీసీసీఐ అధికారి పేర్కొన్నాడు. మరోవైపు భారత క్రికెట్ జట్టు షెడ్యూల్ విషయం సమావేశంలో చర్చకు వచ్చే చాన్స్ ఉన్నది.

మ్యాచ్ షెడ్యూల్ వల్లే సైనా ఓటమి..



విమల్‌కుమార్

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మ్యాచ్‌ల షెడ్యూల్‌పై భారత స్టార్ సైనా నెహ్వాల్ కోచ్ విమల్‌కుమార్ తీవ్ర అంసతృప్తి వ్యక్తంచేశాడు. సెమీస్‌లో సైనా ఓటమికి మ్యాచ్‌ల షెడ్యూలే కారణమని విమల్ ఆరోపించాడు. క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌ను పూర్తిగా రాత్రి సయయంలో ఆడిన సైనా.. ఆ వెంటనే మరుసటిరోజు ఉదయమే సెమీఫైనల్ పోరులో తలపడాల్సి వచ్చిందని విమల్ అన్నాడు. ఇలా ఎక్కువ సమయం లేకుండా మ్యాచ్‌లు ఆడాల్సి రావడంతో సైనా పూర్తిగా అలసిపోయిందనీ, ఆ ప్రభావం సెమీస్ పోరుపై చూపడంతో ఓటమిపాలైందన్నాడు. 'సెమీస్‌కు ముందు ఆమెకు తగినంత విశ్రాంతి తీసుకునే సమయం లేకపోయింది. ఇది షెడ్యూలింగ్ సమస్య. టీవీ ప్రసారాల కోసమే ఇలాంటి షెడ్యూల్ వేసినట్లుగా కనిపిస్తున్నది. టీవీ ప్రసారాలు షెడ్యూలింగ్‌ను నిర్ణయించడం విచారకరం' అని అన్నాడు. మ్యాచ్‌ల సమయం నిర్ణయించే విషయంలో ఆటగాళ్లు మళ్లీ మ్యాచ్‌కు సిద్ధమయ్యేలా వారికి సమయం ఇచ్చేలా ఉండాలని కోరాడు. చెన్‌లాంగ్, కిడాంబి శ్రీకాంత్ కూడా ఈ షెడ్యూల్‌తో తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. ఇందుకు టెక్నికల్ అధికారులే బాధ్యత వహించాలన్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్, ఒలింపిక్స్ లాంటి పెద్ద టోర్నీలకు టైమ్ షెడ్యూల్ నిర్ణయించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాడు.

మినీ స్టేడియం నిర్మాణానికి ఎకరం

సాట్స్ చైర్మన్ దాతృత్వం



మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రాస్‌కు భూమికి సంబంధించిన పత్రాలు అందజేస్తున్న సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి. చిత్రంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివకుమార్ నాయుడు, డీవైఎస్‌వో సత్యవాణి ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సొంతూరును..కన్నతల్లిని మరువొద్దు అంటారు. సరిగ్గా ఇలాగే వ్యవహరించి అందరి హృదయాలను దోచుకున్నారు మన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి. తన సొంతూరైన మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అల్లీపురంలో మినీ స్టేడియం నిర్మాణానికి కావలసిన ఎకరం భూమిని దానంగా అందించి వెంకటేశ్వర్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. తన సొంతస్థలాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తూ ఆ స్థలంలో మినీ స్టేడియంతోపాటు వాలీబాల్ కోర్టు, బాస్కెట్‌బాల్ కోర్టు, ఆడిటోరియం నిర్మించేందుకు సాయం అందించాలని కోరారు. ఈ మేరకు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రొనాల్డ్ రాస్‌ను కలిసి తనకు సంబంధించిన సర్వే నంబర్ -156, సర్వేనంబరు-228లోని ఎకరా భూమిని స్వాధీనం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇందుకు సంబంధించిన పత్రాలను అందించి త్వరలోనే జరుగబోయే స్టేడియం నిర్మాణానికి కావలసిన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

షకీబ్ పాంచ్ పటాకా



ఢాకా: ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ అదరగొడుతున్నది. సొంతగడ్డపై పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ఆసీస్ భరతం పడుతున్నది. 43 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండోసారి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా వికెట్ నష్టానికి 45 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లతో ఉన్న బంగ్లా ప్రస్తుతం 88 పరుగుల కీలక ఆధిక్యంలో కొనసాగుతున్నది. తమీమ్ ఇక్బాల్(30), తైజుల్ ఇస్లాం(0) క్రీజులో ఉన్నారు. అంతకుముందు 18/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు సోమవారం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్..షకీబల్‌హసన్(5/68) ధాటికి 217 పరుగులకు ఆలౌటైంది. షకీబల్ సుడులు తిరిగే స్పిన్‌కు ఆసీస్ బ్యాట్స్‌మెన్ ఘోరంగా తడబడ్డారు. వచ్చిన వచ్చినట్లు పెవిలియన్ వెళ్లేందుకు పోటీపడ్డారు. ఆఖర్లో ఆగర్(41 నాటౌట్), కమ్మిన్స్(25) కలిసి తొమ్మిదో వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో ఆసీస్ 200ల మార్క్ అందుకుంది. షకీబల్‌కు తోడు మెహదీహసన్(3/62) కూడా ఆకట్టుకున్నాడు.

హోంమంత్రి నాయినితో అజరుద్దీన్ భేటీ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ : భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ సోమవారం సచివాలయంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిశాడు. 'హోం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసేందుకే సచివాలయానికి వచ్చాను' అని అజర్ మీడియాతో అన్నాడు.



సచివాలయంలో హోంమంత్రి నాయిని నర్సింహా రెడ్డితో అజరుద్దీన్

ప్రపంచ బాక్సింగ్ క్వార్టర్స్‌లో గౌరవ్

హాంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ గౌరవ్ బి ధూరి (56కి) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో గౌరవ్.. మైకోలా బు ట్సెంకో (ఉక్రెయిన్)పై విజయం సాధించాడు. పతకంపై భారీ ఆశలు కల్గించిన స్టార్ బాక్సర్ శివ తాపా (60కి) అనారోగ్యంతో మెగా టోర్నీ నుంచి నిష్క్రమించాడు. విష ఆహారానికి తోడు జ్వరం రావడంతో రెండో రౌండ్‌లో బరిలోకి దిగలేకపోయాడు. మనోజ్ కుమార్(69కి).. నాలుగో సీడ్ వెనిజులా బాక్సర్ గాబ్రియెల్ పెరెజ్ చేతిలో ఓడిపోయాడు.



క్విటోవా ముందంజ



న్యూయార్క్: సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో తొలిరోజు స్టార్లు ముందంజ వేశారు. మహిళల వింబుల్డన్ చాంపియన్ గార్బినె ముగురుజా, మాజీ నంబర్‌వన్ పెట్రా క్విటోవాలు అలవోకగా రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు. స్పెయిన్‌కు చెందిన మూడోసీడ్ ముగురుజా తొలిరౌండ్లో 6-0, 6-3తో స్థానిక క్రీడాకారిణి వార్వరా లెప్‌చెన్‌కోపై వరుససెట్లలో విజయం సాధించింది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఈ పోరులో ముగురుజా తొలిసెట్లో ప్రత్యర్థికి ఒక్క పాయింట్‌కు కూడా అవకాశమివ్వకుండా చెలరేగడం విశేషం. మరో మ్యాచ్‌లో వింబుల్డన్ మాజీ చాంపియన్ క్విటోవా (చెక్ రిపబ్లిక్) 7-5, 7-5తో సెర్బియాకు చెందిన జెలెనా జంకోవిచ్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో స్టీవ్ జాన్సన్ (అమెరికా) 6-4, 7-6(2), 7-6(5)తో నికోలస్ అల్మాగ్రో (స్పెయిన్)పై గెలిచి రెండోరౌండ్ చేరాడు.

'అర్జున' వస్తుందనుకోలేదు



హర్మన్‌ప్రీత్

న్యూఢిల్లీ: ఏ క్రీడాకారుడికైనా అర్జున అవార్డు అందుకోవాలని కలలుగంటారని, తనకు ఇంత త్వరగా ఈ అవార్డు వస్తుందని ఊహించలేదని మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్‌కౌర్ తెలిపింది. మంగళవారం రాష్ట్రపతి చేతులమీదుగా అర్జున అవార్డు అందుకోనున్న సందర్భంగా హర్మన్‌ప్రీత్ ఆనందం వ్యక్తంచేసింది. 'ఏ పరిస్థితుల్లోనైనా ప్రతి క్రీడాకారుడికి ప్రభుత్వ గుర్తింపు లభించడం అనేది చాలా సంతోషాన్నిస్తుంది. కెరీర్ మరింత ఉజ్వలంగా కొనసాగేలా ఈ గుర్తింపు, ప్రశంస ఆత్మవిశ్వాసాన్ని పెంచి విజయాలవైపు నడిపిస్తుంది. నాకు అవార్డు ఇవ్వడానికి అర్హత ఉందని నిర్ణయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. భవిష్యత్‌లో నేను మరింతగా రాణించేందుకు ఈ అవార్డు నాకు ఉత్తేజాన్ని ఇస్తుంది' అని హర్మన్‌ప్రీత్ చెప్పింది.

విండీస్ లక్ష్యం 322

లీడ్స్: రెండో టెస్ట్‌లో వెస్టిండీస్ ముందు ఇంగ్లండ్ 322 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనకు దిగిన విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 5 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్(4), పావెల్ (1) క్రీజులో ఉన్నారు. తొలుత 171/3 ఓవర్‌నైట్ స్కోరు తో నాలుగో రోజు సోమవా రం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్ 490/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ రూట్ (72), మలన్(61), స్టోక్స్ (58), అలీ(84), వోక్స్(61 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు.



మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆగ్నేయాసియా క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో ఓ క్రీడాకారిణి అద్భుత విన్యాసం

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కిలోన్నర పసిడి పట్టివేత

4 చైన్లు, 6 కడియాలు స్వాధీనం


సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న కిలోన్నర విలువజేసే బంగారు చైన్లు, కడియాలు

హైదరాబాద్/శంషాబాద్, నమస్తే తెలంగాణ: శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీ మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నారు. కౌలాలంపూర్ నుంచి ఎయిర్ ఆసియా ఎయిర్‌లైన్స్ విమానంలో సోమవారం ముగ్గురు హైదరాబాద్‌కు వచ్చారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా ఎలాంటి వస్తువులు లభించలేదు. ఆ తర్వాత ఒంటిపై ఉన్న దుస్తులను పరిశీలించగా మొత్తం 1505 గ్రాముల బంగారం పట్టుబడింది. నాలుగు బంగారు గొలుసులు, ఆరు కడియాలు దొరికాయి. ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఈ బంగారం దుబాయ్ నుంచి కౌలాలంపూర్ మీదుగా తీసుకొచ్చినట్టు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ రూ.45,01,455 ఉంటుందని అధికారులు తెలిపారు.

ఒక్క క్లిక్‌తో పౌరసేవలు

ఆన్‌లైన్‌లో అనేక అనుమతులు

కాలు కదుపకుండా మ్యుటేషన్లు, అడ్వర్‌టైజ్‌మెంట్లు, నల్లా కనెక్షన్లు ట్రేడ్ లైసెన్సులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ప్రజలకు అందించాల్సిన పౌరసేవల్లో పురపాలకశాఖ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కీలకమైన పౌరసేవలను ఆన్‌లైన్‌లో అందిస్తున్నది. స్మార్ట్‌ఫోన్ లేదా ఇంట్లో నెట్‌సౌకర్యం ఉంటే కాలు కదుపకుండా అనేక పౌరసేవలు పొందవచ్చు. పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆదేశాల మేరకు ఏడాది క్రితమే అప్పటి కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మిషన్స్ సీడీఎంఏ దానకిశోర్ ఆన్‌లైన్‌లో పౌరసేవలను అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అయితే, అది పూర్తి కావడానికి సుమారు ఏడాది పట్టింది. ప్రస్తుతం పౌరసేవల్లో వేగం పెరిగినందుకు పట్టణ పౌరులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలో ఆన్‌లైన్‌లో ఇండ్ల అనుమతులిచ్చే విధానం ఇప్పటికే కొనసాగుతుండగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ ఈ ప్రక్రియ తాజాగా మొదలైంది. మ్యుటేషన్లలోనూ వేగం పెరిగింది. విద్యుత్తు కనెక్షన్ కోసం ఒకవేళ రోడ్డు కట్టింగ్ చేయాల్సి వస్తే.. ఇందుకు అవసరమయ్యే అనుమతిని వారంలోపు ఇవ్వాల్సి ఉంటుంది. ఆస్తిపన్ను లెక్కించడం, ట్రేడ్ లైసెన్సుల జారీ, వ్యాపార ప్రకటనకు అనుమతి వంటివి 15 రోజుల్లో ఇవ్వాలి.

ఆస్ట్రేలియా చేరుకున్న టీఎస్‌ఎండీసీ బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో మంగళవారం నుంచి జరిగే 'ది మైనింగ్-2017', ఆసియా పసిఫిక్ ఇంటర్నేషనల్ మైనింగ్ ఎగ్జిబిషన్‌కు హాజరయ్యేందుకు తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఎండీసీ) చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి నేతృత్వంలో వెళ్లిన బృందం సోమవారం సిడ్నీ చేరుకున్నది. వీరికి ఆస్ట్రేలియా టీఆర్‌ఎస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి కాసర్ల స్వాగతం పలికారు. మంగళవారం సిడ్నీలో జరిగే ఆసియా పసిఫిక్ ఇంటర్నేషనల్ మైనింగ్ ఎగ్జిబిషన్, 31న బ్రిస్బేన్‌లో ది మైనింగ్ రిసోర్స్ కన్వెన్షన్స్‌కు ఈ బృందం హాజరవుతుంది. సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మెల్బోర్న్‌లో జరిగే వివిధ మైనింగ్ కంపెనీల సీఈవోల సమ్మిట్‌లో కూడా పాల్గొంటారు. మైనింగ్ తవ్వకాలు, సాంకేతిక నైపుణ్యం, మార్కెటింగ్, పర్యావరణ పరిరక్షణ, వివిధ నూతన శాస్త్రీయ పద్ధతులను పరిశీలించి, మన రాష్ట్రంలో ఆ పద్ధతులను అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై ఈ బృందం చర్చించనున్నది.


సోమవారం సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమంపై సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

అంగన్‌వాడీ కేంద్రాలకు మోడల్ భవనాలు

వెనుకబడిన మూడు వందల ప్రాంతాల్లో నిర్మిస్తాం

త్వరలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీ

అరువై ఏండ్లు నిండిన సిబ్బందికి వన్‌టైం సెటిల్ మెంట్ కింద సాయం

రేషన్ దుకాణం నుంచే అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో కొత్తగా 300 అంగన్‌వాడీ మోడల్ భవనాలను నిర్మించనున్నామని, వీటి నిర్మాణానికి వేదాంత ఫౌండేషన్ ముందుకు వచ్చిందని మహిళా, శిశు సంక్షేమశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అరవై ఏండ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఆర్థిక సహాయం అందిస్తామని, టీచర్లకు రూ. 60 వేలు, ఆయాలకు రూ. 30 వేల చొప్పున ఇవ్వనున్నట్టు మంత్రి తెలిపారు. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ దుకాణాల నుంచే బియ్యం సరఫరా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆయా కేంద్రాల్లోని పిల్లలసంఖ్య మేరకు అంగన్‌వాడీ టీచర్ల బయోమెట్రిక్ ఆధారంగా వారికి రేషన్ అందించాలన్నారు. అంగన్‌వాడీల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని మంత్రి ఆదేశించగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు అధికారులు వివరించారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని మంత్రికి వివరించారు. కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వయసు సహకరించడంలేదని విజ్ఞప్తి చేశారని, అందుకే వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కొంత మొత్తాన్ని ప్రభుత్వం అందించనుందని మంత్రి చెప్పారు. ఈ అవకాశాన్ని 60ఏండ్లు నిండిన అంగన్‌వాడీ సిబ్బంది ఉపయోగించుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను వేదాంత ఫౌండేషన్ చేపడుతున్నదని తుమ్మల చెప్పారు. మొత్తం 11 రాష్ట్రాల్లో నాలుగువేల భవనాలు నిర్మించేందుకు ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుందని వివరించారు. అందులో భాగంగా రాష్ట్రంలో 300 భవనాలను నిర్మించనుందని పేర్కొన్నారు. అవసరమైన స్థలాలను అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో నడుస్తున్నాయని, వీటికి చేరువలోనే కొత్త భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తిచేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎం జగదీశ్వర్, డైరెక్టర్ విజయేంద్ర బోయి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పరిశీలించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రం నమూనా చిత్రం

రేపటి నుంచి చేపపిల్లల పంపిణీ

రెండో విడుతలో రూ.52 కోట్లతో 70 కోట్ల చేపపిల్లలు సిద్ధం

బెల్జియం నుంచి చేపపిల్లల లెక్కింపు యంత్రం

మత్స్యశాఖలో 214 పోస్టుల భర్తీకి చర్యలు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడి


సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో రాష్ట్ర గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ రాజయ్య, అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మత్స్యకారులకు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందించాలనే లక్ష్యంతో ఈ నెల 30 నుంచి రెండో దశ చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని సింగూరు జలాశయం నుంచి చేపట్టనున్నట్టు మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.52 కోట్లతో దాదాపు 70 కోట్ల చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ అన్నిఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 77 జలాశయాలు, 4,647 మత్స్య శాఖ చెరువులు, 20,391 గ్రామపంచాయతీ కుంటల్లో ఉచితంగా చేపపిల్లలను వదులనున్నట్టు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చేప పిల్లల పంపిణీలో మత్స్యశాఖ, రెవెన్యూశాఖ, గ్రామస్థాయి అధికారులను భాగస్వాములను చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలోని కొనుగోలు కమిటీల ద్వారా ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు పిలిచి చేపపిల్లల కొనుగోలు ధరలు నిర్ణయించామని చెప్పారు. చేపపిల్లలను లెక్కించడానికి బెల్జియం నుంచి యంత్రాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు ఈ పథకం వల్ల మత్స్యకారులైన గంగపుత్రులు, బెస్త, ముదిరాజ్ కులాల వారి ఆదాయం పెరిగి వారి జీవనోపాధి మెరుగుపడుతుందని, ఉత్పత్తి పెరిగి వినియోగదారులకు అందుబాటు ధరల్లో చేపలు లభ్యమయ్యే అవకాశాలు ఏర్పడుతాయని మంత్రి తలసాని తెలిపారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని కారణంగానే మత్స్యసొసైటీలు నిర్వీర్యమయ్యాయని, త్వరలోనే అర్హులైన వారికి సభ్యత్వం కల్పించి 31 జిల్లాలకు నూతన సొసైటీలను ఏర్పాటుచేస్తామని మంత్రి చెప్పారు.

ప్రాధాన్యక్రమంలో పంపిణీ

6 నుంచి 8 మాసాల వరకు నీరు నిల్వ ఉండే చెరువులకు చేప పిల్లల పంపిణీలో తొలిప్రాధాన్యం ఇచ్చామని, వీటిలో 35 నుంచి 40 మిల్లీమీటర్ల పొడవు గల కట్ల, రోహు, బంగారు తీగ చేపపిల్లలను సరఫరా చేస్తామని మంత్రి తలసాని చెప్పారు. ఏడాది పొడవునా నీరు ఉండే చెరువుల్లో 80 నుంచి 100 మి.మీ కట్ల, రోహు, మ్రిగాల చేపపిల్లలను నేరుగా చెరువు వద్దకే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఐదు వేల హెక్టార్ల నీటి విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉన్న జలాశయాల్లో మొదటివిడుతగా 60 శాతం చేపపిల్లలను ఆగస్టు-సెప్టెంబర్‌లో, మిగిలిన 40 శాతాన్ని రెండోవిడుతగా అక్టోబర్ లేదా నవంబర్ మాసాల్లో తూకం పద్ధతిన లెక్కించి విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు.

మత్స్యశాఖలో 214 పోస్టుల భర్తీ

మత్స్యశాఖ బలోపేతానికి ప్రభుత్వం 214 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపిందని, వెంటనే నియామక ప్రక్రియ చేపడుతామని మంత్రి తెలిపారు. మత్స్యరంగ, మత్స్యకారుల సమీకృత అభివృద్ధికి రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య (టీఎస్‌ఎఫ్‌సీవోఎఫ్) ద్వారా రూ.1000 కోట్ల ప్రణాళికను రాష్ట్రప్రభుత్వం ఈ రెండేండ్లలో అమలుచేయనున్నదని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.22 కోట్లు వెచ్చించి 27 కోట్ల చేపపిల్లలను జలాశయాల్లో విడుదల చేశామని, మూడు లక్షల మత్స్యకార సభ్యులకు లబ్ధి చేకూరిందని తెలిపారు.

14,76,573 గొర్రెల పంపిణీ

ఇప్పటివరకు గొల్ల, కురుమలకు 14,76,573 గొర్రెలను పంపిణీచేసినట్టు రాష్ట్ర గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ రాజయ్య చెప్పారు. 1962 టోల్ ఫ్రీ నంబర్‌తో వంద సంచార పశువైద్య మొబైల్ వాహనాలు అందుబాటులోకి తెస్తామన్నారు. వీటిని సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో ప్రారంభిస్తారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా రొయ్యల పెంపకాన్ని కూడా చేపట్టాలని నిర్ణయించినట్టు మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తెలిపారు. సమావేశంలో పశు సంవర్ధకశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్ చందా, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీట్లు నిండని ఇంజినీరింగ్ కాలేజీలపై వేటు

- **వరుసగా ఐదేండ్లు తక్కువ సీట్లు నిండిన వాటికి అనుమతుల్లేవు**
- **20 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ అనివార్యం**
- **కాలేజీ యాజమాన్యాల సమావేశంలో నిర్ణయించిన ఏఐసీటీఈ**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

దేశవ్యాప్తంగా ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలను నియంత్రించడంపై అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు, సీట్ల సంఖ్య డిమాండ్‌కు మించి ఉండటంతోపాటు నాణ్యమైన విద్య కరువైందని, దాని ప్రభావం భవిష్యత్తు తరాలపై పడుతుందని భావిస్తున్న కేంద్రం.. కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. గత ఐదేండ్ల నుంచి వరుసగా 30 శాతం కంటే తక్కువగా సీట్లు నిండిన కాలేజీలకు ఇక నుంచి అనుమతులు ఇవ్వొద్దన్న కచ్చితమైన నిర్ణయానికి ఏఐసీటీఈ వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు, సీట్ల సంఖ్య డిమాండ్‌కు మించి ఉండటంతో అక్కడ విద్యావిధానం పూర్తిగా నీరుగారిందని, అందువల్లే ఏఐసీటీఈ ఈ నిర్ణయానికి వచ్చిందని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య అభిప్రాయపడ్డారు. ఏఐసీటీఈ చైర్మన్ ఈ నెల 24న న్యూఢిల్లీలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఈ అంశాన్ని చర్చించారు. ఈ నిబంధనను 2018-19 విద్యా సంవత్సరం నుంచి కచ్చితంగా అమలుచేయాలని నిర్ణయించారు. దీనిపై అన్ని రాష్ట్రాల నుంచి హాజరైన వివిధ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు, కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు తమ అంగీకారాన్ని తెలిపారు. అదేవిధంగా ఇంజినీరింగ్ కాలేజీల్లో క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ ఉండాలన్న నిబంధనతోపాటు ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ ఉండాలన్న నిబంధన కూడా కచ్చితంగా అమలు చేయాలని, ఈ నిబంధన పాటించకపోయినా అనుమతులు ఉండవని ఏఐసీటీఈ పేర్కొన్నది. ఒక కోర్సులో ఎక్కువ సెక్షన్లు ఉండటం వల్ల విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబులు, సైన్స్ ల్యాబులు అందుబాటులో ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ఒక కాలేజీలో ఒక కోర్సుకు రెండు సెక్షన్లను మాత్రమే ఉండాలనే నిబంధనను ఏఐసీటీఈ విధించింది. భవిష్యత్తులో కొత్త ఇంజినీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్లు ఇవ్వకూడదని ఏఐసీటీఈకి తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనపై కూడా చర్చ జరిగింది. దీనిద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు కాలేజీల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని, అన్నిరకాల ప్రమాణాలను పాటించిన కాలేజీలకు మాత్రమే 2017-18 విద్యా సంవత్సరంలో అఫిలియేషన్లు ఇచ్చామని జేఎన్‌టీయూహెచ్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఆశయాల సాధనకు కృషిచేయాలి

వివిధశాఖల అధికారులకు అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీ విద్యార్థుల సంక్షేమం విషయంలో ప్రభుత్వ ఆశయాల మేరకు కృషిచేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖ అధికారులకు అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ కోరింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో వెనుకబడిన తరగతులు(బీసీ) విద్యార్థుల భర్తీ, వారికి కల్పిస్తున్న సౌకర్యాలను కమిటీ సమీక్షించింది. చైర్మన్ ఉల్లోల్ల గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైన కమిటీ ఈ విషయమై ఆయా శాఖల ఉన్నతాధికారులతో చర్చించింది. బీసీ విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్థాయి హాస్టళ్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో కూడా బీసీలకు 10 శాతం వరకు రిజర్వేషన్లున్నాయి. ఈ మేరకు ఆ హాస్టళ్లలో సీట్ల భర్తీ, వారికి కల్పిస్తున్న వసతులు, ప్రభుత్వం తరపున నాలుగు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించడం, సన్నబియ్యం సరఫరా, ఆహార నాణ్యత, పెంచిన మెస్ చార్జీల చెల్లింపు, తదితర అంశాలపై కమిటీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖ అధికారులను వివరాలను అడిగింది. కమిటీ సభ్యులు ఆర్ కృష్ణయ్య, విఠల్‌రెడ్డి, ఫారుక్ హుస్సేన్, బాలసాని లక్ష్మీనారాయణ, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి అశోక్‌కుమార్, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్, ఎస్సీ సంక్షేమశాఖ డైరెక్టర్ కరుణాకర్, ఎస్టీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బెన్హర్ ఎక్కా, తెలంగాణ లెజిస్లేటివ్ సచివాలయం కార్యదర్శి డాక్టర్ రాజా సదారాం, జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

యాసంగి పంటల బీమా ప్రీమియం షెడ్యూలు ఖరారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

2017-18 యాసంగి పంటలకు బీమా ప్రీమియం చెల్లింపు షెడ్యూల్‌ను రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ (ఎస్‌ఎల్‌సీసీఐ) ఖరారు చేసింది. యాసంగి పంటల బీమాపై వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల కార్యదర్శి సీ పార్థసారథి అధ్యక్షతన రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. 2017-18 యాసంగి పంటకాలంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో వరి, మక్కజొన్న, జొన్న, పెసలు, మినుములు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, మిరప, ఉల్లి, శనగ పంటలతోపాటు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో మామిడి పంటను నోటిఫై చేయాలని నిర్ణయించారు. ఈ పథకంలో రుణం తీసుకున్న, తీసుకోని రైతులందరూ ప్రీమియం చెల్లించాల్సిన గడువును.. శనగ పంటకు నవంబర్ 30, మక్కజొన్న, మామిడి పంటకు డిసెంబర్ 15, మిగతా పంటలకు డిసెంబర్ 31 వరకు విధించారు. వేరుశనగ పంటకు వనపర్తి, నాగర్‌కర్నూల్, శనగ పంటకు ఆదిలాబాద్, గద్వాల, జొన్నకు ఆసిఫాబాద్, వరికి 25 జిల్లాల్లో గ్రామం యూనిట్‌గా పంటల బీమా వర్తింపజేయనున్నారు. కచ్చితమైన సమాచారం కోసం క్రాప్ కటింగ్ ఎక్స్‌పర్‌మెంట్ యాప్‌ను వినియోగించాలని సమావేశం నిర్ణయించింది. ఈ వానాకాలం సీజన్ పంటల బీమాలో ఉన్నట్టుగానే 2017-18 యాసంగిలో కూడా రాష్ట్రాన్ని ఆరు క్లస్టర్లుగా విభజించారు.


సోమవారం సచివాలయంలో జరిగిన ఎస్‌ఎల్‌సీసీఐ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి


సోమవారం ఎంసీహెచ్‌ఆర్డీలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు

ఎంబీసీల సామాజికస్థితిపై సదస్సు

బీసీ కులాల వర్గీకరణ, సంచార కులాలు, ఎంబీసీల గుర్తింపుపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని బీసీ, ఎంబీసీ, సంచార కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఎంసీహెచ్చార్డీలో సోమవారం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో బీసీ కులాల జాబితా వర్గీకరణ, సంచార కులాలు, ఎంబీసీల గుర్తింపు, నొమాడిక్ (సంచార), సెమినొమాడిక్, విముక్త జాతులపై సమగ్ర అధ్యయనంలో భాగంగా పలు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, తదితర అంశాలపై చర్చించారు. జాతీయస్థాయిలోని కాకా కాలేల్కర్, మండల్ కమిషన్, సంచార కులాలకు సంబంధించిన బాలకృష్ణ రెనెకె, ఇదాటె కమిషన్ నివేదికలను పరిశీలించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన అనంతరామన్, మురళీధర్‌రావు, జస్టిస్ దాల్వ సుబ్రహ్మణ్యం నివేదికల్లోని ప్రతిపాదనలు, తమిళనాడుకు చెందిన సత్యనాథన్, జస్టిస్ జనార్దనమ్, కర్ణాటకకు చెందిన హావనూర్ కమిషన్, ఓ చిన్నప్పరెడ్డి, వెంకటస్వామి కమిషన్లు, కేరళకు చెందిన కుమార పిళ్లై దామోదరన్, ఇతర కమిషన్ నివేదికలు, ప్రతిపాదనలు సమీక్షించారు. సదస్సులో బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఈగ ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, ఐసీఎస్‌ఎస్‌ఆర్ దక్షిణాది రాష్ట్రాల డైరెక్టర్ చెన్నబసవయ్య, సెస్ డైరెక్టర్ గాలబ్, ఓయూ సోషల్ సైన్సెస్ రిటైర్డ్ డీన్ కే శ్రీనివాసులు, జేఎన్‌యూ న్యూఢిల్లీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఐ తిరుమలి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో టీడీపీ అభ్యర్థి విజయం

27,466 ఓట్ల ఆధిక్యం

రెండో స్థానంతో సరిపెట్టుకున్న వైసీపీ.. పత్తాలేని కాంగ్రెస్


వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నంద్యాల ఉపఎన్నికలో టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధించారు. సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతీ రౌండ్‌లోనూ ఆధిక్యం ప్రదర్శించిన టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిపై 27,644 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దీంతో టీడీపీ వర్గాలు సంబురాలు చేసుకున్నాయి. 19 రౌండ్లలో ఓట్లను లెక్కించగా.. టీడీపీ అభ్యర్థికి 97,076 ఓట్లు, వైసీపీ అభ్యర్థికి 69,610 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ తన ఉనికిని చాటుకోలేకపోయింది. ఆ పార్టీకి 1382 ఓట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం 250 పోస్టల్ బ్యాలెట్లు రాగా, 211 బ్యాలెట్ పేపర్లపై ఎవరికీ ఓటు వేయలేదు. మరో 39 పోస్టల్ బ్యాలెట్లపై సరైన చిరునామా లేకపోవడంతో వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. నంద్యాల ప్రజలు అభివృద్ధికి పట్టంకట్టారని ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం విజయవాడలో మీడియాతో చెప్పారు. ఉపఎన్నికలో విజయం సాధించడానికి టీడీపీ రూ.200 కోట్లను ఖర్చు చేసి.. అధికార దుర్వినియోగానికి పాల్పడిందని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. తాము నైతిక విజయం సాధించామని పేర్కొన్నారు.


నంద్యాల ఉపఎన్నికలో విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు. చిత్రంలో ఏపీ మంత్రి భూమా అఖిలప్రియ తదితరులు ఉన్నారు.